శేషాద్రి రమణ కవులు

పాపారాయ నిర్యాణము

బెజవాడ, 1921

Record no. 558

Śēṣādri Ramaṇa Kavulu

Pāpārāya niryāṇamu

Bejavāḍa, 1921

Record no. 558

Bibliographic Record Target

శేషాద్రి రమణ కవులు.

పాపారాయ నిర్యాణము / శేషాద్రిరమణకవులుచే విరచింపఁబడియె.- 1. కూర్పు.- బెజవాడ : ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల, 1921.

8, (1), 3, 132, iii p. ; 21 cm.

Record no. 558

Śēṣādri Ramaṇa Kavulu.

Pāpārāya niryāṇamu / Śēṣādriramaṇakavulucē viracimpam̐baḍiye.- 1. kūrpu.- Bejavāḍa : Āṃdhragranthālaya Mudrākṣaraśāla, 1921.

8, (1), 3, 132, iii p. ; 21 cm.

Record no. 558

నవోదయ గ్రంథమాల ౧.

మహారాష్ట్ర పరాభవము.

అను పానిపట్టు సంగ్రామము.

శేషాద్రిరమణకవులచే
రచింపబడినది.

ప్రకాశకులు:
...ము, బెజవాడ.

...లరు ౧—౦—౦.

పాపారాయనిర్యాణము.

శ్రీ శేషాద్రి రమణకవులచే
విరచింపఁబడియె.

మొదటికూర్పు: ౧౦౦౦ ప్రతులు.

ప్రకాశకులు:
ఆంధ్రపరిషత్తు, బెజవాడ.

ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల,
బెజవాడ.

౧౯౨౧.

[వెల ౧-౦-౦.

రాజు వంచక స్వభావమును, బుస్సియొక్క నిర్దోషత్వమును, హైదరు జంగు లంచగొండితనమును రావువంశీయుల పరాక్రమపౌరుషములును వివరింపఁబడినవి.

చితుకులు కదల్చుటచే నగ్ని చెలఁగి మండుచున్నది. చెడుగుఁ జేయుటచేఁ బాము పడగవిప్పుచున్నది. మానవుఁడు సైతము క్షోభమునలననె తనపరాక్రమతేజములు కనబఱచి విజృంభించుచున్నాఁడు. బొబ్బిలి పద్మనాయకులు పరాక్రమైకజీవనులు. స్వాతంత్ర్యప్రియులు. అంతటి వారు తమస్వాతంత్ర్యమును గోలుపోనోపరు. బుస్సిదొరయాగమనముచేఁ దమసంస్థానముపైఁ గ్రొత్తపన్నులు విధింపఁబడుటయేగాక తమస్వాతంత్ర్యమునకు సైతము భంగమువాటిల్లుచున్నది. పరాసువారిసైన్యము శతఘ్నికాసమేతమై భయంకరమైనది. అయినను ధూర్తుఁడగు వెంగళరాయఁడు

"వాలును డాలుఁ గేలఁ గొని వచ్చి రణాంగణమందు నిల్చి యా
భీలపరాక్రమంబుఁ గనుపింప మెలంగెడి వెల్మజేనితోఁ
గాలుఁడెకాదు తత్ప్రళయకాలగిరీశుఁడుగాని నిల్వఁగాఁ
జాలఁడు సంశయంపడఁగ జన్నె యొకానొక మ్లేచ్ఛసూతికిన్"

మఱియొకచోట.

"వెలమవీరుండు వెరచునే విలయమునకు"

అని పలికియున్నాఁడు. అంతియకాక దేశకాలపాత్రవేదియగు పాపారాయఁడు సైతము

"జ్వాలామాలికా కీలితంబైన యీపద్మనాయక శౌర్యవహ్నికిఁ
బ్రతిపక్షకోటి శలభబృందమై తీఱును"

అనిధైర్యముగాఁ జెప్పియున్నాఁడు. అభిమాన ధనుండగు రంగరాయఁడు పరాసు సైన్యముల బలాబలములు గ్రహింపక పోలేదు. కావుననే యతఁడు బుస్సి హైదరుజంగులకుఁ బంపిన సందేశములో నిట్లుచెప్పియున్నాఁడు.

"శ్వాసప్రాణముండిన దనుక బొబ్బిలికోటఁ
బరులకీయరు వెల్మవారలనుము

* * * *

తుచ్ఛపుం బ్రాణములకయి స్వచ్ఛయశముఁ
బాడొనర్పరు శ్రీరావు వంశ్యులనుము
కీర్తిశాశ్వతమనుము.................."

అంతియకాదు వృద్ధుఁడును బ్రభుభక్తి పరాయణుఁడును, నను భవజ్ఞుఁడు నగు దామెర దమ్మన్న సైతము విజయము విషయమై యించుక సందేహపడియే యున్నాఁడు.

"జననీ! బొబ్బిలిరాజ్యలక్ష్మి నిను నీచస్వాంతుఁడొక్కఁడు తీ
అని కామంబునఁ గోరినాఁడతనిపై రాగంబువాటించి నీ
తని వర్జించెదవో జగద్విదిత పాతివ్రత్య రుజ్మండలా
శనిచే భస్మముఁ జేసెదో యిదె నమస్కారంబు నీకీశ్వరీ!॥

ఎటులైనను సంధికార్యనిర్వాహణభార మాతనియందే యున్నది. సంధి తప్పక కుదురునని యతనికి దృఢమైన నమ్మకము లేకపోవుట చేతనే

"ఖడ్గపుత్రికిఁ గదనరంగంబునందుఁ
బెండ్లిపేరంటములను గావింపవలయుఁ
ద్వరితముగ మీరలెల్ల స్నాతకులుగండు
పద్మనాయకులార! ధీసద్ములార!"

అని వెలమవీరులను హెచ్చరించి యున్నాఁడు.

ఈనాటకములోని కరుణారసము మిక్కిలి జాలి పుట్టించునదిగానున్నది. విజయరామరాజు పద్మనాయకసైన్యమును నురుము జేయుచుండుటయుఁ, బద్మనాయకవీరులు పెక్కండ్రు భయంకరములగు శతఘ్నుల కాహుతి యగుచుండుటయు, బొబ్బిలికోట పగిలిపోవుచుండుటయుఁ గాంచి రంగారాయఁడు

"బొబ్బిలిరాజ్యలక్ష్మి! సరిపోయెను నీఁకిక నాఋణంబు"

అని యనినప్పుడును అంతఃపుర కాంతాజనమును శత్రులఁబాఱిఁ బడకుండ వీరోచితముగ క్షాత్రధర్మము నిర్వహించు విషయమై చెలికాని వెంకయ్య కాజ్ఞాపించి

"జాలివహింపకయ్య, కలుషంబని దీనికిఁ బ్రేలుమాలి యీ

వాలును రిత్తసేయుటకుఁ బాల్పడకయ్య, సతీమతల్లులన్
గూలుచు పట్లనెమ్మదిని గుందు వహింపకుమయ్య, గెల్వఁగా
జాలమటంచు స్త్రీవధను సల్పఁగబోగదవయ్య నెయ్యమా!"

ఖడ్గము నొసంగునపుడును మఱియు

"అనురాగంబునఁ బ్రియంబునకుఁ బ్రేమావేశ సంసిద్ధికీ
దినమే యంత్యదినంబు సాంఘికమృతిన్ దేవుండు కల్పించె నో
వనితారత్నములార! ఐహికపు సంబంధంబు తీరెన్ బరం
బున నే యింకఁ బునస్సమాగమము త్రావుం డశ్రుగర్భాంజలుల్"

అని యవరోధజనమునకు సందేశమంపునపుడును హృదయము కఱఁగి స్రవించుచున్నది. రంగారాయని మరణానంతమున వెంగళరాయని మనోదుఃఖమును రాజాము కోటనుండి తిరిగివచ్చు పాపారాయఁడు దుశ్శకునములఁ గాంచుటయు మూర్ఛపోయిన వెంగళరాయని సందర్శనమును వారిరువురి యంత్యసంభాషణము విచారము కలిగించుచున్నది. మఱియు మల్లమాదేవి తనకుమారుని జూచి

"ముద్దులకుమార యింకనైనఁ బోయిరార"

యని చేటి కప్పగించునపుడును దనకుమారుని విషయమై సామర్లకోటలోని సోదరికి సందేశమంపుచు

"కడుపసిపాపఁడాఁకలికిఁ దాళఁగలేఁడు
కడుపుననిడివీనిఁ గాంచుమమ్మ
బుడుతఁడు పిల్లిప్రేవులవాఁడు కావునఁ
గనలిమెన్నండేని కసరకమ్మ
నీకునాకును గల నేస్తంబుఁ దలపోసి
యూరకమది దిగులొందకమ్మ
పసివానిఁ బ్రతికించి వంశంబునిల్పి నా
యాశీర్వచనముల నందుమమ్మ
మఱల నీయుత్తరమువచ్చు వఱకు మేము
బందుగులతోడ స్వర్గాననుందుమమ్మ.
కరుణవిడకమ్మ సుతుని నేమఱకుమమ్మ
బాలుఁబ్రతికింపు మమ్మ! నీ భారమమ్మ!!"

అని వచించునపుడు హృదయము శతధా భిన్నమగుచున్నది. పాపము! చెలికాని వెంకయ్య మిక్కిలి జాలిపేగులవాఁడు. అతఁడు పద్మనాయకవీరుల యంతఃపురాంగనల దుర్దశలపాలు గాకుండ వీరోచితముగ ఖండింపవలయునని యుద్దేశముకలవాఁడె గాని యాసాహసకార్యము నిర్వర్తింప నాతనిచేతు లాడకున్నవి. కావుననె,

"చెలికాని వెంకయ కరప్రాలంబతీక్ష్ణాసికా
పరకాంతానికురుంబ కంఠరుధిరప్రత్యగ్రసత్కారముల్"

అని యెంతపరితపించినను నాకార్యము నిర్వర్తించుటకు రంగారాయని కంతకంటెఁ బరమాప్తుఁ డెవ్వడును లేడు. ఇంకొకచోట,

"కఠినకర్కశరిపురాజ కంఠదళన
భయదకర్మంబునకు నీవుపనికిరావు
ఖడ్గమా యింక మార్దవ కలితములగు
చిపురుఁబోఁడులకుత్తుకల్ చెండఁబొమ్మ!!"

అని యెట్టకేలకు మల్లమదేవికి ఖడ్గమునొసంగి సాధ్వీరక్తపూరితమైన కరవాలమును తిరిగి కైకొనుచున్నాఁడు.

మల్లమాదేవి పాత్రసంపోషణ విషయమై యించుక చెప్పవలసియున్నది. బొబ్బిలి కథాంశమును గూర్చి యిదివఱకు వ్రాయఁబడిన నాటకములలో మల్లమాంబ పతిభిక్షపెట్టుమని విజయరామరాజునకు రహస్యముగా సందేశమంపినట్లు కానవచ్చుచున్నది. కాని ధీరస్వాంతయగు నావీరమాత స్వభావనిర్మాణమునం దది యెంతపెద్దలోపమో విశదమగుచున్నది. దిట్టకవి నారాయణ కవిచే రచింపఁబడిన రంగారాయ చరిత్రమును బట్టిచూడ నాసాధ్వీమణి యెన్నఁడట్టి నీచమున కొడఁబడలేదనియు మానసరక్షణార్థమై తుచ్ఛప్రాణములను రవ్వంతయు సరకు సేయలేదనియుఁ దేటతెల్లమగుచున్నది. అంతియుకాదు. వెలమవీరుండును మానధనుఁడునునగు రంగారాయని యర్ధాంగి సాటివాఁడును నాజన్మద్వేషియు మ్లేచ్ఛపక్షపాతియునగు విజయరామరాజును బతిభి

తు పెట్టుమన నెటులసాహసించెనో గ్రాహ్యముకాకున్నది. ఈరెండు కారణములను బట్టియే మల్లమాదేవి పద్మిని, వీరాబాయి, దుర్గావతి, కృష్ణాకుమారి, లక్ష్మీబాయి, రుద్రమదేవి మొదలగు నుత్తమ వీరపత్నులతోఁ దులదూగుచు నాంధ్రమహిళాలలామలకు మేలుబంతియై యలరారుచున్నది.

ఈనాటకము నందలి కొన్నిపద్యము లాంధ్రుల రాజ్యవిస్తారమును, నాంధ్రుల పరాక్రమాతిశయమును, నాంధ్రుల కీర్తివైభవమును వర్ణించుచు నాంధ్రదేశాభిమానము హృదయ సీమలయందు నెలకొల్పుచున్నది.

ఈనాటకము పాపారాయనిర్యాణమని పేరు పెట్టబడినను ఇందలి ప్రధానపాత్రము పాపారాయఁడెయని తోఁచుచున్నను 4, 5, 6, అంకములయందు నతనిఁ బేర్కొనుట కవకాశము లేకుంటయును, వెలమవీరులందఱకును బ్రళయసామ్యమగు యుద్ధసమయమున బొబ్బిలిలో లేకుంటయును నతనిమనోభావములు బొబ్బిలి కోటపైనను మల్లమాదేవి రంగారావులపైనను కేంద్రీకృతములగుటచే నాటకము విషాదముగాఁ బరిణమించుటకుఁ గేవలమతఁడే కారకుఁడుగాకపోవుటయును, మొదలగు కారణములచే నితఁడెకథానాయకుండని నిరూపింప వీలులేకున్నది. ఐనను విజయరామరాజునకును బుస్సి హైదరుజంగులకును హృదయమైక శల్యమును రంగారాయని కాగర్భశత్రువునునగు విజయరామరాజును జంపిన వెలమవీరుని మరణముతో నాటకము విషాదముగ ముగింపఁబడిన కారణమునఁ బాపారాయఁడు ప్రధానపాత్రమని తప్పకయొప్పుకొనవలసియున్నది. అతని కథానాయకత్వమును గూర్చి గుణగ్రహణ పారీణులగు విమర్శకులే చర్చింతురుగాక.

ఇందలిశైలి నిర్దుష్టమై యించుకసులభమై ధారాళముగనున్నది. మనోహరమగు నిట్టిచరిత్రవిషయిక విషాదనాటకమును బౌరకమహాశయుల కందఁజేసిన శ్రీ శేషాద్రిరమణకవు లెంతయు వందనీయులు.

గుంటూరు
6-8-21

ఇట్లు,
చామర్తి రాజశేఖరరావు, ఏ. ఏ.

విజ్ఞప్తి.

రసికులారా!,

ఆంధ్రవీరుల విక్రమాతిశయముఁ దెలుపు నీకథాంశమును బలువురు నాటకములుగ వ్రాసియున్నారు. కథాంశముపైఁగల విశ్వాసమె మమ్మీనాటకరచనమునకు సాహసింపఁ జేసినది. ఈనాటక రచనమున మేము కొన్ని నూతనమార్గములతోఁ గథావస్తువును నవరించి దుఃఖాంతముగ మార్చితిమి. పద్మనాయకాబాలవృద్ధ రక్తధారాపరిప్లుతమగు బొబ్బిలి కథారంగమునఁ బట్టాభిషేకముఁ బెట్టి వీరరసమును శుభాంతముతో సాంకర్యమొనరింప సాహసింపక ప్రధానపాత్రమగు బాపారాయని మరణముతో నీనాటకము ముగించితిమి. కథాసంగ్రహణార్థమై రావువంశీయుల చరిత్రము, రంగారాయచరిత్రము, బొబ్బిలికథ (జంగముకథ), ఆంధ్రకవుల చరిత్రము నాధారముగఁ దీసికొంటిమి. గ్రంథరచనానంతరము శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారు రచించిన "బొబ్బిలియుద్ధ"మను వచనకావ్యముఁ జూచియు వారి సలహా ననుసరించియుఁ గథాంశములు కొన్నిమార్చితిమి.

గ్రంథము రచించి యాఱుసంవత్సరముల య్యెను. కారణాంతరములచే నాటకముఁ బ్రదర్శించుటకును ముద్రించుటకును వీలు కాదయ్యెను. చాలకాలము గ్రంథము నజ్ఞాతవాసముఁ జేయించి, రసికులు భాషాభిమానులు మాతృదేశాభిరతులునగు శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య పంతులువారి యభిమానముచే నిప్పటికిఁ బ్రచురింపఁగలిగితిమి. నాటకము ముద్రణకాలమున మేము స్థానాంతరమునందుంట తటస్థించుటచే ముద్రణ స్ఖాలిత్యములు మిక్కుటముగ దొరలెను. విస్తరింపక యర్థభంగమొనరించు ముఖ్యదోషముల మాత్రము గ్రంథాంతమున వివరించి యున్నారము. బుస్సిభాషణము గ్రాంథికభాషలో వ్రాసితిమి. నర్తకులావశ్యకమును బట్టి యాంగ్లేయములోనికి మార్చుకొనవచ్చును. హైదరుజంగు సంభాషణము తురుష్కపదమిశ్రితమగు గ్రామ్యములో వ్రాసితిమి.

వీలున్నచో హిందీలోఁ బరివర్తనము చేయించికొనినఁ బ్రదర్శనమున కుపయుక్తము. కథానుసారముగ భాషాంతరీకరణము గావించి విజయరామరాజు బుస్సి హైదరుజంగుల యభిప్రాయముల నొకరికొకరికిఁ దెలుపుట యావశ్యకమేని యొక (దుబాసి) ద్విభాషిని రెండవయంకమున జేర్చికొనవచ్చును. ప్రదర్శకుల కింతకంటె విన్నవింపవలసినదిలేదు.

ఈనాటకము నామూలము పఠించి తమయమూల్యమగు కాలము వినియోగించి పీఠికవ్రాసి దయచేసిన మామిత్రులగు శ్రీయుత చామర్తి రాజశేఖరరావు పంతులువారికిఁ గృతజ్ఞులము. రసజ్ఞులీ నాటకమునఁగల గుణలేశమున కానందింపఁ బ్రార్థితులు.

సుధీవిధేయులు,

శేషాద్రిరమణకవులు,

శతావధానులు.

నాటకమునవచ్చు పాత్రలు.

గంగారావు. (బొబ్బిలి ప్రభువు)
వెంగళరావు. (యువరాజు)
పాపారాయఁడు (సర్వసేనానాయకుఁడు)
దామెర దమ్మన్న (రాయబారి)
గూఢచారులు
భటుఁడు
విజయరామరాజు (ప్రతినాయకుఁడు)
బుస్సి
హైదరుజంగు
లాడూఖాను
కాకర్లపూడి వెంకటరాయఁడు
ఇనుగంటి ధర్మారాయఁడు
చెలికాని వెంకయ్య
హసనల్లీఖాన్
చినరంగారావు (రాజపుత్త్రుఁడు)
దేవులపల్లి పెద్దన్న

స్త్రీలు.

చేటి
మల్లమాదేవి (బొబ్బిలిరాణి)

కథానుసారముగఁ గొందఱు యుద్ధభటులు వత్తురు.

శ్రీరస్తు.

నాంది

చం॥ నిరుపమపద్మనాయక వినిర్మలవంశమునన్ జనించి భూ
భరమును బాపరాయుపయి వైచి ద్విజాన్వయు గాము గర్వసం
హారణమొనర్చి ధర్మపథమందు జరింపుచుఁ బ్రేమ మల్లమా
తరుణిపయిన్ వహించు గుణధాముఁడు రాణ్మణి ప్రోచులోకముల్.

ఉ॥ భారతధర్మనిర్వహణ పారగులౌ నరపాలకుల్ రస
స్ఫారకవిత్వతత్త్వ విలసత్తరులౌ విబుధుల్ పరాక్రమో
దారులు యోధవర్యులు సతంబును సేవయొనర్చుచుండఁ జె
ల్వారెడి యాంధ్రమాతచరణాంబుజముల్ మదిఁజేర్చి మ్రొక్కెదన్॥

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—అభిరూపశేఖరులగు నోసభాస్తారులారా! ఆంధ్రదేశ కథాప్రదర్శనముచే మిమ్మునలరింపఁ దలంచితిని. రూపకనామ మేమనుచున్నారా? నటితో నించుక భాషించి కాలానుగుణ్యమగు కథాంశమును నిర్ణయించి నాటకనామము విన్నవింతును. సఖీ! ఒకమాటిటురమ్ము. (స్వ) ఇంకఁ గేశరచనము ముగియ లేదు కాఁబోలు.

నటి—(ప్రవేశించి) ఆర్యపుత్రా! బొబ్బిలి సంగ్రామమునె ప్రదర్శింప నిశ్చయించితిరా? మీతలంపు గణనీయము. ఆంధ్రవీరుల విక్రమ జీవితములఁ బ్రచురించుటలో నీకథ సర్వవిధముల వాసిఁగాంచియున్నది.

సూత్ర—బొబ్బిలి సంగ్రామమునె ప్రదర్శింపఁదలంచితినని నీవెటుల నిర్ణయింపఁగలవు. నేనిదివఱకుఁ దెల్పితినా?

నటి—ఆఁ. తెలిపితిరి.

సూత్ర—నేనేనా? నీతోఁడనా? వినుఁడు సభాసదులారా! నేఁడు బొబ్బిలి సంగ్రామముఁ బ్రదర్శింతుమని వాకొనియున్నాఁడనట. చూచి తిరా నటిమృషావాదము?

నటి—ఆర్యా! ప్రమాదము నాయందేయున్న క్షమింపుఁడు. మీరు పద్మనాయకులను బాపారాయని మల్లమాదేవిని ద్విజవంశాలంకారుఁడగు విజయరామరాజును బ్రశంసించుటచే నేనటుల భావించితిని.

సూత్ర—"ఘుణాక్షరన్యాయము"గనిష్టదేవతాప్రార్థనము బొబ్బిలివీరుల కన్వయించియుండ వచ్చును. సుప్రసిద్ధులగు ననేకు లీ బొబ్బిలి నాటకము రచించిరి. మన మనేకపర్యాయములు ప్రదర్శించి యుంటిమి. క్రొత్తనాటకమేదేని తెలుపరాదా? క్రొత్త వింతగదా?

నటి—ప్రకృతకాలానుగుణ్యముగ విషాదాంతముగ వ్రాయఁబడిన నీ పాపారాయ నిర్యాణమును బ్రదర్శింతమా? ఇద్దిచరిత్ర నాటకమేగదా.

సూత్ర—(నటి వద్దనుండి గ్రంథము దీసికొనిచూచి) ఇది దుఃఖాంతమగు బొబ్బిలినాటకమా? నీయభిమానము ననుసరించి దీనినె ప్రదర్శింపఁజేసెద. గ్రంథకర్తలెవరు?

నటి—శేషాద్రి రమణకవు లను సోదరులు.

సూత్ర—సుప్రసిద్ధులగు నీకవులఁ గూర్చి వేఱు తెలుపఁబని లేదు. గ్రంథ ప్రశస్తి ప్రపంచ ముఖమున నేను వినియె యున్నాఁడ. సభ్యులనీ గానకౌశలముచే నానందపఱుపుము. నేపథ్యమునకుఁ జేరుదము.

నటి—మనోజ్ఞమగు నీఋతురాజమును దనివిదీఱ వర్ణించి జిహ్వఁజరితార్థమొనర్చికొందుఁగాక.

సీ॥ ప్రధనంబునఁ గాయ♦పడిన వీరులమేని
యట్లు రాజిల్లె ర♦క్తాంబుజములు
పగతురబల్లెంపు ♦ బదనువాయివితావ
మోహానంబు గమించె ♦ మొగలిపూలు
శాత్రవసైనిక ♦ శల్యసంచయముల
ట్లలరారసాగెను ♦ భ్రాంబుజములు
విజయలక్ష్మీమహాస ♦ విమలకాంతులరీతి
నిండారె పండువె♦న్నెలలచెన్ను
తే॥ గీ॥ రణమునఁ భూమికొరిగిన♦రాచబంట్ల
కొసఁగ తర్పణవాగి నా♦బొసఁగె ఝురులు
వితతసంగ్రామ నిర్వాహ♦విజయలక్ష్మి
యాకృతినిఁబోలె నీశర♦దాగమంబు॥

సూత్ర—సతీ! నీజవ్వనంబునందుబలె గాత్రమందుఁగూడ నొకానొక నూత్నవికాసము వెల్లివిరియుచున్నది. ఇంతతో నీరణగీతము ముగింపుము. వీరరసావతారులగు పద్మనాయకులు రంగస్థలమలంకరించుచున్నారు. నేపథ్యమున కేగుదము.

నటి—వీరరసావతారు లనుటచేఁ దేఱిచూడభయమగుచున్నది. పోవుదమురండు.

ఇది ప్రస్తావనము.

కాలుఁడెకాదు, తత్ప్రళయ ♦ కాల [illegible]

ల్లు జల్ల ర ♦ క్తాంబుజములు

శ్రీరస్తు.

పాపారాయ నిర్యాణము.

ప్రథమాంకము.

రంగము:— బొబ్బిలి సభా మందిరము.

(రంగారావు, వెంగళరాయఁడు, పాపారాయఁడు ప్రవేశింతురు)

రంగా—నిజాముప్రభు వుత్తరసర్కారులఁ బరాసువారి కొసఁగియుంటచే వారిపక్షమున బుస్సీదొరగారు కళింగదేశమునఁ బన్నులు తీసికొనుటకు దేశమును దమ యాజమాన్యముక్రింద నుంచుకొనుటకు దేశకాలావస్థలఁ దిలకించుటకు రాజమహేంద్రవరమునకు వచ్చియుంటయు మనముదక్క మిగిలిన ఱేండ్రందఱు దర్శనము కేగియుంటయు మీ రెఱింగియే యుందురు. అతని మంత్రి హైదరుజంగు మిగుల వంచకస్వభావుఁడు.

పాపా—అయిననిపుడేమి! నిష్కల్మషులమగు మనకు వెఱపేల!

రంగా—మనకుఁ బ్రబలద్వేషియగు విజయరామరాజు బుస్సీదొరగారియొక్కయుఁ దన్మంత్రియగు హైదరుజంగుయొక్కయు నెయ్యముఁబడసి మనకేదో యెగ్గాలోచించుచున్నట్టుల గూఢచారులెఱింగించియున్నారు.

వెంగ—అన్నయ్యా! తామిందులకై విచారము నొందవలసిన యవసరములేదు. బొబ్బిలిగడ్డపై నొక్కపద్మనాయకుఁడు జీవించియున్నను మన కపాయము వాటిల్లదు.

ఉ॥ వాలును డాలు కేలఁగొని ♦ వచ్చి రణాంగణమందు నిల్చి యా
భీలపరాక్రమంబు గను ♦ పించి మెలంగెడి వెల్మజేనితో
కాలుఁడెకాదు, తత్ప్రళయ ♦ కాల గిరీశుఁడుగాని నిల్వఁగాఁ

జాలఁడు, సంశయింపఁడఁగఁ • జన్నె! యొకానొక మ్లేచ్ఛసూతికిన్॥

పాపా—వెంగళరాయా! కాలమొక్కవిధమునలేదు. విజయరామరాజు మన కనులమూసి యే మాయోపాయముచేసైనను బొబ్బిలి రాజ్యము హరింప వలయునని పట్టుఁబట్టియున్నాఁడు. తగినట్టు లాతనికిఁ బరాసుదొరప్రాపకముఁ గూడ లభించినది. కావుననే యీవిషయమయి యింతగ నాలోచింప వలసివచ్చినది.

వెంగ—అంతటి వికల్పకాలము తటస్థించి విజయరామరాజు పరాసు వారితోఁగలసి మనలఁ బ్రతిఘటింపనేతెంచిన నాఁటికి మనకుఁ గర్తవ్యము శరణ్యము లేకపోవునా? నిర్హేతుకముగఁ బరాసు వారు మనపైఁ గత్తికట్టుదురా!

రంగా—తమ్ముఁడా! మనము చేయునాలోచనలు శరణ్యముకొఱకుఁ గర్తవ్యముకొఱకె. అసూయాపరులు పరుల వంచింప నుద్యమించుతఱి హేతువులఁ గల్పించుకొనలేకపోరు. విజయరామ రాజు పరులవంచించుటలో నసమానుషప్రజ్ఞఁ గలవాఁడు. బుస్సి పరులకులోఁబడుటలోఁగూడ నట్టివాఁడె. కాననె దూరదృష్టికిఁ బాలుపడవలసివచ్చినది.

వెంగ—అన్నయ్యా! విజయరామరాజు కృత్రిమమార్గము నవలంబించునని దృఢముగా నమ్మకమున్నచోఁ దామగూడ బుస్సి సన్నిధానమున కరుగరాదా?

పాపా—వెంగళరాయా! మీయన్నగారు బుస్సిదర్శనమునకుఁ బోకుండుటకుఁ బెక్కులు కారణములుకలవు. బుస్సిదొర సంస్థానముల పైఁ గ్రొత్తపన్నులువిధించి ప్రతిసంస్థానముపైని స్వాతంత్ర్యము తానె వహించుచున్నాఁడఁట. ఇఁక మనముదర్శించిన నిట్టినిర్బంధమునకు లోఁబడవలసివచ్చునేమొ యని యుపేక్షవహించిరి.

వెంగ—ఏమీ! యాంతర్యమిదియా! పద్మనాయకవీరుల పరాక్రమమె వజ్రప్రాకారముగాఁగల బొబ్బిలిసంస్థానముపైఁ బన్నులుపెంచు

టకు యాజమాన్యముమార్చుటకు నీ బుస్సియెవఁడు. అట్టివివ రీతపుమార్పువలని లాభమనుభవింప విజయరామరాజెవఁడు.

సీ॥ శ్రీకాకుళాంధ్ర ల • క్ష్మీనాథు కడకంట
  ననిశమింపొందు ప్రే • మామృతంబు
కాకతీయుల పతా • కలక్రిందఁ దాండవిం
  చిన రాజ్యలక్ష్మి ని • శ్రీప్రసక్తి
ఖడ్గతిక్కన్న యశః • కాంతిలోలీనమై
  కానవచ్చెడి పరా • క్రమరసంబు
శ్రీకృష్ణరాయ ధా • త్రీనాథ విక్రమ
  క్రమ గర్భితంబైన • కౌశలంబు

తే॥ గీ॥ ఆంధ్రశూరవతంసులా • రా? పరాక్ర
  మాధిగత భారతీయులా • రా? రణార్థు
  లింక నేనియుఁ గండని • హెచ్చరింప
  వెలమవీరుండు వెఱచునే • విలయమునకు॥ 2

పాపా—రణరంగమునఁ బద్మనాయకశూరులకుఁ గల చిరకాలాభ్యాసము ప్రపంచమునఁ గొలఁదికాలములో వ్యక్తముకాఁగలదు. కాకతీయ రాజ్యారంభమునఁ బరరాజ్యాకర్షణంబువలన జనియించి స్వతంత్రపాలనవశంబున జ్వాలామాలికాకీలితంబైన యీపద్మనాయకశౌర్యవహ్నికిఁ బ్రతిపక్షకోటి శలభబృందమై తీఱును. ఆంధ్రమాతయు నానుదినముకొఱకె వెలమవీరుల హృదయపీఠమునఁ దపముఁగావించుచున్నది.

మ॥ అనవద్యంబగు నాంధ్రతేజమునకై • యాసించి గెల్పుంగడిం
చినవారెవ్వరు? ఖడ్గతిక్కనయశ • శ్శ్రీభాగ్యముం రుద్రదే
వుని విఖ్యాతపరాక్రమంబును స్వయం • భూదేవ కారుణ్యభా
జనముం గాంచిన వెల్మవీరు మహదై • శ్వర్యంబు సామాన్యమే॥

వెంగ—హృదయపుటమునిండి వెలికుఱుకు మనపరాక్రమములఁ గష్టసాధ్యముగ లోలోననె నిర్బంధించి యరాతులచెంతనుండి సందే

శము తెలియువఱకు శాంతించుదము. అనంతరకర్తవ్యమున కాంధ్రదేశముకలదు. ఆంధ్రవీరులుకలరు.

(నేపథ్యమున) దేవా? హైదరుజంగుసమ్ముఖమునుండి యొక భటుఁడు సందేశముఁగొని ద్వారమున నిలచియున్నాఁడు. ఏమి యాజ్ఞ.

వెంగ—ఓయీ వెంటనే ప్రవేశపెట్టుము.

భటు—(ప్రవేశించి అందఱనుజూచి) దేవా వందనములు. బుస్సిహైదరుజంగుప్రభువులు తమ కీపత్రిక నొసంగి సరియగుప్రత్యుత్తరము వెంటనె తెమ్మనిసెలవిచ్చిరి. చిత్తగింపుఁడు

(రంగారాయునికి జాబునొసంగును)

రంగా—(చూచి ఆగ్రహముతో) ఏమీ! ఉత్తరము వ్రాసినవాఁడు విజయరామరాజా! వ్రాయించినవారు బుస్సియు హైదరుజంగునా? హిందువుల దురదృష్టవశమున నాంధ్రదేశము పరాసువారిచేతిలోనికిఁ బోయినది. పోవుఁగాక. అంతమాత్రమున నే నేల బుస్సియుడుగులకు మడుగులొత్తవలయును. పరాక్రమహీనుఁడు పౌరుషపువిలువ నెఱుంగనివాఁడు పరుల దాస్యమునకుఁ బాలుపడునేమొగాని యీరంగారావుమాత్రము సజీవిగ నున్న నట్టినైచ్యమునకుఁ బాలుపడఁడు. పరాసువారిని వ్యతిరేకించినందులకు నాకు స్థానచలనమా శిక్ష!- ఆంధ్రసామ్రాజ్యస్థాపకులును వీరాహవనిర్వహణప్రతిష్ఠాధురంధరులును శూరచూడామణులు నగు నీవెలమవజీరులు కొనప్రాణముతో నున్నవఱకు బొబ్బిలికోట పరులకు వశముకానేరదు. కాఁజాలదు. బొబ్బిలికోట మేము వారములో విడువవలయునా? లేకున్నఁ గోట బలవంతముగా స్వాధీనముఁగావించి కొందురా! ఓపరాసుదొరా? ఓహైదరుజంగు మంత్రీ! తెలుఁగుఁగత్తుల నెఱుకుఁదనము మీరా రెఱుంగరుకాఁబోలు. రండు ప్రతిఘటింపుఁడు. విజయరామరాజున కీబొబ్బిలిరాజ్యము స్వాధీనమగుట మాటలతో జరుగునదికాదు. ఈయనుచితమగు తలంపున కెడమిచ్చినందులకు బొబ్బిలిరాజ్యలక్ష్మి కెంతభూతబలి కావలయునో అర్ఘాతులారా! ఊహింపుఁడు.

సీ॥ కాంచీపురంపు దు ♦ ర్గములభేదించిన
బ్రహ్మయసేనాని ♦ పౌరుషంబు
ఖడ్గపుత్రికి రణాం ♦ గణమునఁ బెండ్లిఁగా
వించిన శ్రీరుద్ర ♦ విభునిశక్తి
మార్తురబలముల ♦ నార్తిపాల్ జేసిన
బాలచంద్రుకృపాణ ♦ భావుకంబు
అరులరక్తంబుచే ♦ ధరణి భూషించిన
యనపోతనాయకు ♦ నాగ్రహంబు

తే॥ గీ॥ రావువేంకటరంగభూ ♦ రమణహృదయ
పద్మమున నూత్నభావనా ♦ పటిమతోడఁ
బ్రతిఫలించుచునుండెనో ♦ పగతులార
కదనకార్యార్థులై వేగఁ ♦ గదలి రండు॥

పాపా—(రంగారాయునివలన జాబుఁగైకొని) ఇది విజయరామరాజు లిపివలె నున్నదే. విజయరామ భూపాలా! నీయందెట్టి విపరీతాభిప్రాయము లుద్భవించుచున్నవి. పరులరాజ్యమున కాస నొంది నీవుచేయుచున్న మాఱువేసములే యీరూపమునఁ బ్రతిఫలించుచున్నవి. సహజమగు పరాక్రమమె నీకున్నఁ బరుల పంచల పాలగుదువా?

మ॥ విలయప్రాప్తికి హేతుభూతమగు నీ ♦ విద్రోహదుర్బుద్ధి బొ
బ్బిలిపైఁ నేఁటికిఁ బెట్టజూచెదవురా? ♦ వీరుండవేనైన చోఁ
బలకఁ వాలునుదాల్చి మమ్ము నెదిరిం ♦ పఁ రమ్ము; నీబీరవుం
బలముల్ దేలకయుండునే విజయరా ♦ మా! దుష్టకల్పద్రుమా॥ 5

వెంగ—(జాబుచదివి) ఓరీ పరిచారకా! నీవు విజయరామరాజుగారి

పరిచారకుఁడవై మ్లేచ్ఛులకు సందేశముల నడపుచున్నాఁడ వేల! నీప్రభువునకు వలె నీకేదేని దురాశాపాశము తగిలికొఁదగులు కొనలేదుగదా !

భటు—ఈప్రశ్న ప్రకృతవ్యవహారమునకు సంబంధించినయంశము కాదు. పామునోటఁబడి కప్ప పురుగులకై నాలుక సాచునట్లువిజయ రామభూపాలుని వాగురలోఁ బడియు నింక విక్రమింతురేల ! ప్రతికృతియోజింపుఁడు. అభిమానమునిల్పుకొనుఁడు.

వెంగ—ఏమిరా! విపరీతప్రసంగమునకు సాహసించుచున్నాఁడవు. వెలమ వీరుల పరాక్రమము నీవెన్నఁడెఱుంగవుకాఁబోలు. మేము విజయ రామరాజు మాయావాగురలో నెన్నటికిఁజిక్కము. ప్రభు మంత్రోత్సాహశక్తులలో మాకెందునుఁ గొఱంతలేదు. మేమభి మానమునిల్పుకొనఁగలమొలేదొ యాంధ్రదేశమె వీక్షింపఁగల దు. ముందునీవుప్రాణమునిల్పుకొమ్ము.

ఉ॥ రాక్షసజన్ముఁడౌ విజయ ♦ రాముని దాస్యమున్ మదించి, ప్రా
ణక్షయభీతిఁబోవిడచి ♦ న్యాయవిహీన దురుక్తిసంతతిన్
బాక్షికబుద్ధితో నిచటఁ ♦ బల్కిన దోషముశాంతినొందఁగా
శిక్షయొనర్తు, నాలుకను ♦ జీల్చుదు, నాకెవరడ్డువత్తురో॥ 6

(కత్తిఁగొనిపైకిఁ బోఁబోవఁ బాపారాయఁడు వారించును.)

పాపా—వెంగళరాయా! శాంతింపుము. శాంతింపుము. ఈ పరిచార కుఁడు విజయరామరాజు దుర్బోధలచే నిటులఁ బ్రేలు చుండ వచ్చును. మనమితని శిక్షించితిమేని హైదరుజంగు బుస్సిగార లకు మఱింత కోపకారణమగును. కోపమునకు దేశకాలపాత్ర ములుండవుకదా!

వెంగ—అగ్రజా! ఈదురుద్యముఁడు మనకొలువుకూటమున నుండఁ దగిన వాఁడు కాఁడు. వేగ ప్రత్యుత్తరమునొసంగి పంపుట యుక్తము. ఈతని మొగముఁజూచిన దాదిఁ నాహృదయమున

వింతయునరాని కోపాగ్ని రగుల్కొనుచున్నది.

రంగా—ఓయీ పరిచారకా! నీప్రసంగవైఖరిఁజూడ నీవెన్నఁడు రాజ సభలలోఁ బ్రవర్తింపవలసిన ధర్మముల నెఱుంగనివానివలెనో యెఱింగి తిరస్కారభావముఁ బ్రకటించువానివలెనో గానవచ్చు చున్నాఁడవు. నీతో విశేషించి భాషించుటకు నిన్నిట విశేషకాల మునిల్పుటకు మేమంగీకరింపఁజాలము. మావిన్నపము నంతయు నొకదూతునిముఖమున బుస్సి హైదరుజంగులకు నివేదింతుము. నీవీసందేశము మాత్ర మెఱింగింపుము.

సీ॥ కొనప్రాణముండిన ♦ దనుక బొబ్బిలికోట
పరులకీయరు వెల్మ ♦ వారలనుము
పద్మనాయకసుతుల్ ♦ ప్రధనరంగంబన్నఁ
గలనైన భయమును ♦ గాంచరనుము
పరులకు స్వాతంత్ర్య ♦ పట్టాభిషేకంబు
సేయరీ తెలుఁగువ ♦ జీరులనుము
విజయరామునికెగా ♦ దజునకైనను రాజ్య
సంపద వశముకాఁ ♦ జాలదనుము
తే॥ గీ॥ తుచ్ఛపుం బ్రాణములకయి ♦ స్వచ్ఛయశము
పాడొనర్పరు శ్రీరావు ♦ వంశ్యులనుము
కీర్తిశాశ్వతమనుము దు♦ర్వృత్తనంబు
కొలఁదికాలంబునకె గట్టి ♦ కుడుపుననుము॥ 7

ఈసందేశము కేవలము బుస్సినిగూర్చినదియె కాన నాయనకు విన్నవింపుము. మాప్రతినిధివలన బుస్సిదొరగారు వ్రాయించిన లేఖకుం బ్రత్యుత్తరమును బంపుదుము.

పాపా—ఓయీ ! ఈవిరోధమునకుఁ గారయితయగు విజయరామ రాజునకీసందేశమును తాండ్రపాపారాయఁడు పంపెనని తెలియ జేయుము.

ఉ॥ రారా! దురాశయా! విజయ ♦ రాఘవ! బొబ్బిలిరాజ్యలక్ష్మి నిం
డారుకవుంగిటన్ నిను జ ♦ యాంతమునందువరించునో రిపు
క్ష్మారుహ వీతిహోత్రమనఁ ♦ గాఁదగు మామక ముష్టిఘాతసం
స్కారముచేత శుద్ధుఁడవు ♦ కాఁగలవో తెలియంగనయ్యెడిన్॥ 8

వెంగ—ఓరీ! సేవకా! నాసందేశముకూడ విజయరామరాజున కెఱింగింపుము. విజయరామరాజా! బొబ్బిలిరాజ్యమున కాశపడుచుంటివా! వినాశకాలమునకే నీకిట్టి విపరీతపుబుద్ధులు జనించుచున్నవి. నిజముగ నీకిఁక బత్తెముతీరినది.

ఉ॥ విలసితధర్మలౌ వెలమ ♦ వీరుల కౌఁగిటిలోననిల్చి యి
మ్ముల సుఖజీవనంబుగను ♦ బొబ్బిలిరాజ్యరమాపురంధ్రి నిన్
వలచునఁటంచు నెంచకుము ♦ వామపదంబు భవత్ శిరస్థ్సలిన్
నిలుపదు; కానియాసపడి ♦ నీల్గకు దానఁ బరంబు దప్పెడిన్॥ 9

పాపా—ఓపరిచారకా! మా సందేశవాక్యములు యథారూపములుగా మీప్రభువులకు విన్నవింపుము. ఇఁక నీవుగమ్యస్థానమునకుఁ జేరవచ్చును.

భటు—అయ్యా! మీక్షేమమునకేని మీరుపాటుబడుట కర్తవ్యము. కేవలము పరాక్రమమునె నమ్ముకొని ప్రతిఘటించి సంస్థానమును అవస్థలపాలుఁగావింపకుఁడు.

వెంగ—నీచాత్మకా! ఇంకను బ్రేలుచున్నాఁడవా! ఈకరవాలముచే నీయుత్తమాంగమును త్రెళ్ళగొట్టుచున్నాఁడను. కాచుకొమ్ము. (కత్తివిసరివేయును.)

భటు—(స్వ) అన్యాయముగఁ జంప నుద్యమింతురా? ప్రతిఫలముఁ జూపెదనులెండు. (నిష్క్రమించును.)

పాపా—విజయరామరాజా! సరిహద్దులలోనున్న బొబ్బిలిరాజ్యమును నీవిజయనగరసామ్రాజ్యముతోఁ గలుపుకొనవలయునని పరాసుదొరను దేవిరించుచున్నాఁడవా! హైదరుజంగును యాచించు

చున్నాఁడవా! ఇది మాటలతో సాధ్యమగుకార్యముకాదు. భారతమాత యీనెపమున క్షత్రసేనారక్తమెంత పానముజేసి తృప్తిఁగాంచనున్నదో యోజింపవైతివి. దురుద్యమ బద్ధకంకణులగు భవాదృశుల శిరముల సాలభంజికలుగ మొగసాలల కంటఁగట్టుదుముగాని యాత్మీయరాజ్యమును మీకుఁబట్టము గట్టము. ఆత్మనాశనమునకు వెనుదీయము. పరులకు బొబ్బిలిరాజ్యము వశముగానీయము. శ్రీరంగభూపాలుని యాజమాన్యమున్నంతవఱకుఁ బాపారాయఁడు సజీవిగనున్నంతవఱకు స్కంధావారమున నొక సైనికుఁడేని జీవించియున్నవఱకు బొబ్బిలిరాజ్యము పరులకు వశముకాఁజాలదు. పార్థివగుదువేని వృథావాంఛలఁజాలింపుము.

చం॥ పరమ పవిత్రశీలయయి ♦ భాసిల్లు బొబ్బిలిరాజ్యలక్ష్మి సా
దరమొటుసంఘటిల్లు రిపు ♦ ధైర్య సమాహరణప్రశస్తి బం
ధురుఁడగు తాంపప్రాపయఘ ♦ నుండు సజీవిగనున్న దుర్నయా
కరుఁడగు రామభూపతికిఁ ♦ గాలముసాయము చేయకుండినన్॥ 10

వెంగ—అగ్రజా! దూతనుబంపుట మన కవశ్యకర్తవ్యము. కార్యఖడ్గప్రవీణుఁడగు వెలమవీరు నెవనినేని యిందులకు నియోగించుట యుక్తమని నాకుఁదోఁచుచున్నది.

(దామెరదమ్మన్న ప్రవేశించి కోపముతో) ఓవిజయరామరాజా! నీవెంతటి నైచ్యమునకుఁ బాలుపడు చున్నాఁడవు. బొబ్బిలిరాజ్యము నీకొసంగిన పండ్రెండులక్షలరూపికలు హైదరుజంగున కొసంగెదవా! అతఁడీలంచపుఁ గల్లుద్రావి నీకు బొబ్బిలిరాజ్యము కట్టిపెట్టునా? వెలమవీరు లీప్రళయకాలమున నుపేక్షామాత్రశరణ్యులై యుందురా! మంచిది.

మ॥ అరిరాజన్య వరూధినీదళన లీ ♦ లాభీల బాహాబలా
కర రూఢోత్తమజాలపాలితము, రం ♦ గారాయ భూమాడలే

శ్వర సంరక్షిత తాంధ్రపావయ ధరా ♦ పాలాగ్ర్య నిర్వ్యాఘ్ర దోః
పరిఘావేష్టితమైన బొబ్బిలిని నీ♦వా? కోరి జీవించుటల్॥ 11

విజయరామరాజా!. దురాశాపాశ బద్ధుఁడవగు నిన్ను వధింప నీ దామెరదమ్మన్న యొక్కఁడె చాలునుఁగాని యింతవఱకు రాజాజ్ఞకొఱకు నిరీక్షించితిని. ఇఁక నీయాయువు కొలఁదికాలములో నున్నది. (ముందునకుఁజూచి) అపుడె రాజసమ్ముఖమునకే తెంచితినే! కోపావేశమునఁ బ్రకృతము మఱచుచున్నాఁడను. (రాజువైపునకు మఱలి) వినయముతో రాజా! విజయరామరాజొనరించు దుండగముల వినుచుంటిరిగదా!

రంగా—ఆఁ వినక యేమి. ప్రపంచముఖమున సర్వము నెఱింగియే యున్నారము.

వెంగ—దమ్మన్నగారూ! విజయరామరాజు హైదరుజంగునకు లంచమొసంగి బొబ్బిలిరాజ్యముఁ బడయనున్నాఁడా! ఇదికొ్రత్త వార్త. దీనిని మీకెవరెఱింగించిరి?

దమ్మ—ఇప్పుడె గూఢచారులవలన విని మీకెఱింగించి ప్రతిక్రియ కలదేమో యోజింపవచ్చునని వచ్చుచున్నాఁడను.

పాపా—దుర్మార్గా! విజయరామరాజా! నీకెట్టి విపరీతపుబుద్ధులు పుట్టుచున్నవిరా! బొబ్బిలిరాజ్యము మాకనులమూసి హైదరుజంగు నీకెటుల నర్పించునో నీవెటులఁ బాలింతువో కాంచకపోను.

సీ॥ వేంకటరంగభూ ♦ విభువిఖడ్గకుమారి
కదనంబునఁ శాంతిఁ ♦ గాంచలేదు
వెలమవీరుల బాహు ♦ బలకీర్తిచంద్రికల్
ప్రౌఢభావం బెడఁ ♦ బాయలేదు
బొబ్బిలిశూరుల ♦ భూరిపరాక్రమ
సూర్యుఁడస్తాద్రికిఁ ♦ జొచ్చలేదు
నెంగళరాయు దో ♦ ర్వీర్యవహ్నిజ్వాల
కడలల్లికొని నివు ♦ ర్గప్పలేదు

తే॥ గీ॥ రండు వైరినృపాలులా ♦ రా? త్వదీయ
సైనికబలంబు నుగ్గునూ ♦ చముగఁ గాఁతి
హైన్యముగ, నామరూపాది ♦ శూన్యముగను
భస్మముగఁ జేయుదుము రణ ♦ ప్రాంగణమున॥ 12

వెంగ—బావా! ఇది విలంబమొనరించుటకుఁ దగినకాలముకాదు. ముందు ప్రతిపక్షుల సమ్ముఖమునకు దూతను బంపుటయుక్తకార్యము.

రంగా—దమ్మన్నగారూ! గూఢచారు లింకనేమేని విశేషముల నెఱింగించిరా?

దమ్మ—విన్నవించుచున్నాఁడను. మనరాజ్యమునుండి విజయనగరరాజ్యములోనికిఁ బాఱుచు నారాజ్యము ఫలవంతముగఁ జేయు గొండవాఁగులకు మనమానకట్టలఁగట్టి మనదేశమునఁ బాఱించి విజయరామరాజును నష్టపఱచితిమఁట. అదిప్రధానకారణముగ మనల ద్వేషించుకొఱకు దన శక్తినంతయు వినియోగించి యనేకవిధముల దుర్బోధలగావించి విజయరామరాజు బుస్సిని లోఁబఱచికొనెను. హైదరుజంగును లంచమొసంగి వశము గావించుకొనెను. ఈ స్థితిలో నొకవంచకుఁడు రంగారావు జాఫరల్లీఖాన్ మొదలగు ద్రోహులతోఁ గలసి రాజద్రోహబుద్ధితో నుండెననియు నందువలననె దర్శనమునకు రాలేదనియును మొఱఁగెను. విజయరామరాజు పదివేలసేనతో బుస్సిదర్శనమునకువచ్చెను. కాన నాతనిదుండగము తనంతనె బహిరంగమగుచున్నది. దీనికనుగుణముగ నారాయణదేవుఁడు నరసరాజు మొదలగువారు తలలూపిరి. ఇవిగూఢచారులవాక్యములు.

రంగా—ఔరా! విజయరామరాజెంతటిపాపమునకుఁ బరవంచనమునకుఁ బాలగుచున్నాఁడు. స్వబలము లేని వాఁడు పరులవలన లభ్య

మైన భాగ్యము నెంతకాలము వశమున నుంచుకొనఁగలఁడు; మిత్రభేదము గావించు నీ విజయరామరాజు బాగుపడిననాఁటికిఁ జూచెదఁగాక! దమ్మన్నగారూ! బుస్సిదొరగారివద్దనుండి మాకొకవార్తవచ్చినది. చిత్తగింపుఁడు.

దమ్మ—నాయనా! నీవేపఠింపుము. నేను సావధానముగా నాలకింతును.

వెంగ—(జాబు చదువును) మహారాజశ్రీ రావు రంగారావుగారికి.

మీరు ఉత్తరసర్కారులపై సర్వస్వాతంత్ర్యములుగల మమ్ము దర్శింపరాకుంటయె కాక పలువురను రాజద్రోహమునకుఁ బురికొల్పుచుంటిరి. మీకీవిషయమున సహాయకారియగు శ్రీకాకుళపు నవాబ్ జాఫరల్లీఖానును సాధింపనున్నారము. మమ్ము వ్యతిరేకించినందులకు స్థానచలనమే మీకుశిక్ష. ఈ లేఖను మీకుఁ జేరిన వారముదినములలోఁగ బొబ్బిలికోటనువిడచి ప్రతిఫలముగ మేము చూపినస్థలమున కరుగవలయును. అందులకియ్యకొనరేని బలవంతముగ మీకోటస్వాధీనముఁ గావించికొని బొబ్బిలిరాజ్యము విజయరామరాజునకుఁ గవులొసంగఁగలమని నమ్మవలయును.

(లేఖకుఁడు విజయరామరాజు) ఇట్లు, బూసి. హైదరుజంగ్

దమ్మ—ఔరా కాలమహత్వము. ప్రభువులు దూరదృష్టిలేని వారయినపుడు పైయధికారులు లంచపుఁగొండులయినపుడు ధర్మమునకు నిలువనీడదొరకునా!

మ॥ జననీ బొబ్బిలిరాజ్యలక్ష్మి! నిను నీ ♦ చస్వాంతుఁడొక్కండు తీ
అనికామంబునఁగోరినాఁ డతనిపై ♦ రాగంబువాటించి నీ
తినివర్జించెదవో? జగద్విదిత పా ♦ తివ్రత్యరుబ్మండలా
శనిచే భస్మముఁ జేసెదో? యిదె నమ ♦ స్కారంబు నీకీశ్వరీ॥ 13

పాపా—దమ్మన్నగారూ! తాము రాజకీయ వృత్తాంతముల నన్నింటి నెఱింగియున్నారు. విజయరామరాజు దుస్తంత్రములు పెచ్చు

పెఱిఁగి బొబ్బిలిరాజ్య వినాశన హేతుభూతము లగునేమోయని మనము భయపడవలసిన దినములు వచ్చుచున్నవి. బుస్సిదొర హైదరుజంగులచే విజయరామరాజు వ్రాయించిన జాబు మీరు వినియెయున్నారు. ఈ వికల్పసమయమున విశ్వాసనీయుఁడు అనుభవజ్ఞుఁడు నగు నొకదూతను బరాసుదొరపాలికిఁ బంపుట కర్తవ్యము. ఈకార్యము నిర్వహించుటకు సంధిఁగూర్చుటకు మీరలెయోగ్యులు. ఉత్తమ పద్మనాయక వంశజులగు తామీపని కియ్యకొని రాజ్యమునకు క్షేమముఁ గల్గింపవలెనని ప్రార్థన.

దమ్మ—పాపారాయా! నేను దౌత్యమునకు సంతోషపూర్వకముగా నంగీకరించుచున్నాఁడను. నేనంతటి యుత్తమ కార్యము సమర్థింప నర్హుఁడఁగానని సంశయపడుచున్నాఁడను గాని వేఱుగాదు. నాజీవితము నీయుత్తమకార్యము నిర్వర్తించి పవిత్రముఁ జేసికొందును.

చం॥ తెలిపెద బుస్సిగారిదఱి ♦ దేవరవారలపల్కులెల్ల మీ
కలఁతలఁ నన్నిఁటిన్ లయముఁ ♦ గాంచఁగఁ జేసెద రామరాజుకో
ర్కుల నశియింపఁజేసెద వి ♦ రోధములేదనిపించెదన్ మదు
క్తులచట సాగవేని యని ♦ కోసమురమ్మని పిల్చివచ్చెదన్॥ 14

ప్రభుభక్తిపరాయణుఁడగు నీదమ్మన యింతటిస్వల్పపుఁ బని నెఱవేర్పఁ జాలఁడా? రాజా మీసందేశము నెఱిఁగింపుఁడు. వేగమె దూతకృత్యము నిర్వహించెద.

తే॥ గీ॥ ఖడ్గపుత్రికిఁ గదనరం ♦ గంబునందుఁ
పెండ్లిపేరంటములను గా ♦ వింపవలయుఁ
ద్వరితముగ మీరలెల్ల స్నా ♦ తకులుకండు
పద్మనాయకులార! ధీ ♦ సద్ములార॥ 15

రంగా—దమ్మన్నగారూ! బుస్సిగారితో సమయోచితముగ భాషించి వెంగళరాయని వివాహకార్యమున, రంగారావు ప్రమత్తుఁడై యుంటచే మీసమక్షమునకు రాలేదని విన్నవింపుము. దాని

తో వారు శాంతించిరేని యవకాశముఁ గల్పించుకొని నేను దర్శనమున కేగుదును. అందుల కియ్యకొనక బొబ్బిలిరాజ్యమె కావలయునని భల్లూకపుఁబట్టుఁ బట్టిరేని

సీ॥ ఇటుసూర్యుఁడటు లుద ♦ యించిన బొబ్బిలి
విజయరామునకు న ♦ ర్పింపఁబోము
వెలమవీరులు ప్రాణ ♦ ములతోడ నున్నంత
దనుక రాజ్యంబు సా ♦ ధ్యంబుగాదు
పద్మనాయకులపైఁ ♦ బగదాల్చి బ్రతికిన
ఘనుఁడు మందున కేని ♦ కానరాఁడు
ప్రాంసువారలకైన ♦ బరదేవతకునైనఁ
దెలుఁగుఫౌజులు వెను ♦ దీయఁబోవు

గీ॥ బుస్సియును హైదరేకాదు ♦ మూఁడునూర్ల
మందిబుస్సులు హైదరుల్ ♦ మార్కొనినను
ఆంధ్రవీరులు చలనంబు ♦ నందబోరు
కదలిరమ్మను మరులను ♦ గదనమునకు॥ 16

మ॥ కదనస్థానము వైరిభూరమణ ర ♦ క్తస్విన్నముల్ సల్పి, దు
ర్మద రాజన్య కపాలమాలికలచే ♦ రాజ్యంబుభూషించి, య
స్మదుపాస్యల్ జయలక్ష్మి నాంధ్రధరణీ ♦ సర్వంకష ప్రాభవల్
ముదితాత్మల్ బొనరింతునంచు నరిభూ ♦ పుల్ మందలింపందగున్॥

కం॥ సంగరమున వెఱవఁడు క్షణ
భంగురమగు ప్రాణమునకు ♦ వాంఛింపఁడు శ్రీ
రంగవిభుఁడనుచు హైదరు
జంగుదళుల్ బుస్సిదళిఁ బ్ర ♦ సంగింపఁదగున్॥ 18

ఈహితబోధకంబు విజయరామరాజు దుర్బోధయే రుచించెనేని వెలమవీరుల కరవాలములె విరోధులఁ జక్కఁగాఁ బరామర్శింపఁ గలవు. పోయిరండు.

పాపా—దమ్మన్నగారూ! బుస్సిహైదరుజంగులకుఁ బ్రభువొసంగిన ప్రత్యుత్తరంబె చాలును. సర్వవిషయము లాసూత్రప్రాయవాక్యములయందు గర్భితములై యున్నవి. న్యాయవేదుల కంతకంటె నెక్కుడు బోధఁజేయ నవసరములేదు. ఈవిద్వేషమునకుఁ గారకుఁడగు విజయరామరాజుతో మాత్రము నామాటగ నిటుల సెలవీయఁ బ్రార్థించెదను.

మ॥ రణమేనిశ్చయమేని త్వద్రుధిరధా ♦ రాసారణిన్ వైరిమా
రణ విఖ్యాత పరాక్రమక్రమ సమి ♦ ద్రంగప్రచారుండు భీ
షణశాతాసి నికృత్త విద్విషదధీ ♦ శవ్రాతుఁడౌ పాపరా
ణ్మణి శ్రీబొబ్బిలిధారిణీస్థలమునన్ ♦ బాటించు రామాహ్వయా॥ 19

ఇప్పటి కీసందేశము చాలును. దైవవశమున యుద్ధమె యగునేని మిగిలినసందేశము నేను స్వయముగ విజయరామభూపాలున కెఱింగించెదను.

దమ్మ—వెంగళరాయా! నీకేమేని సందేశమున్న నెఱింగింపుము.

వెంగ—నేనుగూడ విజయరామరాజున కొక సందేశమును బంపవలసియున్నయది. దమ్మన్నగారూ! సావధానులై చిత్తగింపుఁడు.

కం॥ కరవాలధారచే, నీ
శిరమును జెండాడ వెలమ ♦ సేనానాథుల్
పరతెంతురు, బొబ్బిలిలో
మరణింపకు విజయరామ ♦ మానవనాథా॥ 20

ఇంతియ నాసందేశము. శూరవర్యా! మీరింకఁ దడయక రాజమహేంద్రవరమునకుఁ బ్రయాణము కావలయును. మీ సంధి విషయ మేరీతిగ ఫలించునో తెలియనిది మేమేమియుఁ జేయువీలు కలుఁగఁజాలదు.

దమ్మ—రాజా! పాపారాయా! వెంగళరాయా! ఇంక నాకాజ్ఞ నొసంగుఁడు. నాశక్తినంతయు ధారఁబోసి యెటులేని బుస్సిచెంతఁ

బరిచయమును గల్పించుకొని విజయరాముని దుస్తంత్రములు హైదరుజంగు లంచగొండితనములు నివేదించి మన కభిముఖు నిగఁ జేసెద. అయ్యది యొనగూడదేని కాఁగలకార్యములు మీ రందరెఱింగినవె.

సీ॥ విజయరాఘవుఁడు క ♦ ల్పించిన దుష్కృత్య
పుంజముల్ బుస్సికి ♦ బోధఁ జేసి
లంచంబుఁ జేకొని ♦ వంచించు హైదరు
జంగుచేష్టలను ర ♦ చ్చలకు నీడ్చి
పరరాజ్యమున కాస ♦ పడ నధర్మంబంచు
విజయరాముని చెంత ♦ విన్నవించి
అన్యుల స్వాతంత్ర్య ♦ మపహరించుట రాజ
ధర్మేతరమని యం ♦ దఱకుఁ దెలిపి

గీ॥ సంధిసూత్రమ్ములను గాఢ ♦ బంధనమున
వైరికులమును బంధించి ♦ వచ్చువాఁడ
సామ దానమ్ము లచ్చట ♦ సాగవేని
సంగరంబున నన్నియుఁ ♦ జక్కవడును॥ 21

ఉ॥ సంధికి నా ప్రయత్నములు ♦ సాగక యుండిన విక్రమించి ద
ర్పాంధుల మార్తురన్ రణవి ♦ హారము సల్పఁగఁ బిల్చివచ్చెదన్
బంధుర యోధజాల పరి ♦ పాలిత బొబ్బిలిరాజ్యలక్ష్మి సం
బంధమె కాక యున్నఁ బ్రతి ♦ బంధమె కాంతురుగాక శాత్రవుల్॥

పాపా—దమ్మన్నగారూ! రాయబారమునఁ గూడ బొబ్బిలి వెలమబిడ్డ యని యనిపింపవలయును సుండీ! మనము ప్రత్యర్థుల యాచింపవలసిన యవసరము లేదు.

దమ్మ—మిత్రమా! ఆవిషయమై మీరు చెప్పవలసిన యగత్యము లేదు. సహజమగు విక్రమమె యుండవలయునుగాని యది దాఁచినను దాఁగునది కాదు. విరోధులు నాహితోక్తులు వినక ప్రతికూలిం

తురేమొ, మీరు సేనల సిద్ధపఱచి బొబ్బిలికోట జాగరూకతతోఁ దిలకించుచుండుఁడు. నేను సెలవుఁ బుచ్చుకొనెదను.

రంగా—(సింహాసనము దిగి) మంచిది. మీ రాకకొఱకు నిరీక్షింతుము. పోయిరండు. ఉభయుల భావముల సమన్వయించు కార్యము దూతయం దెకలదు.

చం॥ మనమునఁ బక్షపాతమును ♦ మాని, హితంబు హితేతరంబు రో
జాకమొనరించి, నీమదికి ♦ సమ్మదమౌగతి, రాట్సభాంగణం
బున వచియించి, మార్తురకు ♦ బొబ్బిలికిన్ బ్రణయ ప్రధానబం
ధనము ఘటించి జన్మముఁ గృ ♦ తార్థముఁ జేయఁగదయ్య నెయ్యమా॥

పాపా—శూరశిఖామణీ! సంధివిధాన మంతయు నీ లౌక్యమున బద్ధమై యున్నది.

మ॥ కరవాలంబులు శాంతిఁ గైకొనవు సం ♦ గ్రామంబునన్, వెల్మవా
రరిరాజన్య శిరోధి ఖండనము జే ♦ యన్ జంకఁ గాఁబోరు, మా
ర్తురు నిర్వేలసమిత్కళావిదులు దు ♦ ర్బుద్ధుల్ తటస్థుల్ ప్రజా
భరమున్ దీర్పకుమంచు బుస్సిదొరకున్ ♦ వ్రాయుచ్చఁగాఁ గోరెదన్॥

వెంగ—ఓ పద్మనాయకాగ్రేసరా! అరాతులు యుద్ధమునకే మురియుదురేని సాధ్యమైనంతవఱకు వెంటఁబెట్టుకొని రమ్ము. ఆవలి విషయముల మేము సమర్థింతుము.

ఉ॥ కత్తులతోడఁ గాఁదగిన ♦ కార్యము మాటలతోడఁ గాదు, దు
శ్చిత్తుల కాత్మనాశనము ♦ జేకురుదాఁక గుణంబు రాదు, నీ
వెత్తఁదనంబుఁ జూపక స ♦ మీహిత వైరివిదారణక్రియా
యత్తుఁడవై విరోధి నృపు ♦ లందఱఁ దోడ్కొనిరమ్ము పోరికిన్॥

దామె—శూరవర్యులారా! మీ యిష్టానుసారముగ వర్తించెద. సెలవుఁ బుచ్చుకొనెదను.

మ॥ అరులం గైవసమాచరించెద! వసా ♦ ధ్యంబైనచో, సామవా
క్పరిణామమ్ములతోడ నీతిపథముల్ ♦ వ్యాకుచ్ఛేదర్, దానమా
ర్తురు శాంతంబువహింపకున్న ఘనశ ♦ త్రువ్రాత విచ్ఛేదనా
చరణ ప్రాభవ హేతిఘాతములచే ♦ సర్వంబుఁ జక్కంబడున్॥ 26

(నిష్క్రమించును)

పాపా—విజయరామరాజు చెంత లంచపుఁగసవుమేసిన హైదరుజంగు బుస్సిని సంధికంగీకరింపనీయఁడు. దమ్మనగారి కార్యనిర్వాహణములో నెట్టిలోప ముండనేరదుగాని పగతురుమాత్ర ముచితానుచితజ్ఞానశూన్యులు. ఫలితాంశ మచిరకాలమున ఘోర సంగ్రామ సంఘటనమె యనితోఁచుచున్నది.

వెంగ—(విసుగుతో) అట్లైన దమ్మన్నగారిచే సందేశము నేలపంపవలయును?

రంగా—తమ్ముఁడా! మనము శక్తికొలఁది పాటుపడుదము. అదృష్టము దైవాధీనము. పాపారాయా! పరాసుదొరగారి వద్ద నుండి యైకమత్యవార్త వచ్చువఱకు మనము వృథాగఁ గాలక్షేపముఁ జేయఁదగదు. యుద్ధపరికరముల నాయత్తపఱచి దూరస్థలములనున్న సైన్యమును రప్పించి బురుజులఁ గోటల బాగుచేయించి యుద్ధమునకు మనమందఱము సర్వసిద్ధముగ నుండవలయును. ఈసంక్షోభ సమయమున వెంగళరాయుని వివాహము నాపుటయె యుక్తధర్మము.

పాపా—కాలము నమ్మఁదగినస్థితిలో లేదు. విరోధు లెపుడు మోసముగఁ బైఁబడుదురో మనము కాచికొనవలయును. వివాహము నాపుటయె నాకభిమతము.

వెంగ—అన్నయ్యా! ఇపుడు వివాహము ముఖ్యముగా నాపనగును. ఏలయన

చం॥ లలితగుణాభిరామ జయ ♦ లక్ష్మి స్వయంగ్రహ యోగ్యశీలవై
యలరుచునుండె; నాయువిద ♦ హస్తముఁ గైకొన రామరాజెదర్
దలఁచుచునున్నవాఁడు నను ♦ దక్కఁ మఱొక్కని స్వీకరింపదా
చెలువ, వివాహకార్యమును ♦ జేయఁగవచ్చు రణాంతమందునన్॥

రంగా—సోదరా! నీయభిమతమునకు దైవ మనుకూల మగునుగాక. నీయూహ ఫలవంతమగుఁగాక. మనము మిగుల జాగరూకులమై ప్రవర్తింపవలసినయదనిదియె. నీవు కొందఱు గూఢచారులను రాజమహేంద్రివరమునకు విరోధుల రహస్యములఁ దెలిసికొని వచ్చుటకుఁ బంపి సైనికులందఱును సాయంకాలమునకుఁ గోట చెంతకు వచ్చునటుల నాజ్ఞాపింపుము. మేమింతలో నాయుధశాలలు కోటబురుజులు చూచి వెంటనె వచ్చెదము. పాపారాయా! పోదమురమ్ము.

పాపా—రాజా! దయచేయుఁడు. ముం దీయాయుధశాలలోనికిఁ బోవుదము.

(అందఱునిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

శ్రీరస్తు.

పాపారాయనిర్యాణము.

ద్వితీయాంకము.

(విజయరామరాజు ప్రవేశించును.)

విజ — ప్రయత్నము చేయఁగఁజేయఁగ నిప్పటికి బొబ్బిలివారిని సాధింప నవకాశము చిక్కినది. బొబ్బిలివారిపై నాకుఁగల క్రోధము మితిమీఱినది. వారలొనర్చిన తిరస్కృతులు, సాహసములు, దుండగములుసహించి నాయాగ్రహమింతవఱకుఁ జంపుకొంటిని. బొబ్బిలిసంస్థానమునకంటె నాసంస్థానమన్నివిధముల నభివృద్ధిలో నున్నది. నేనెప్రతిఘటించి బొబ్బిలిరాజ్యముపైకి సంగ్రామమునకు సిద్ధపడువాఁడనెగాని నేఁటివఱకు దేశమునంతయు మహమ్మదీయులు పాలించుచుంటచేతను, సామంతులతగవు ప్రభువులే తీర్పవలయునను నియమముంటచేతను ఇంతవఱకు నాసంకల్పము నెఱవేఱదయ్యెను. ఇపుడుత్తర సర్కారులు ఫ్రెంచివారి వశమైనవి. వారిపక్షమున సర్వాధికారముఁ బడసి బుస్సియు హైదరుజంగును వచ్చియున్నారు. ఏసంస్థాన మెటుల దగులఁ బడిపోయిననేమి? ఏరాజెటుల నశించిననేమి? వారలకుఁ గావలసినది ధనముమాత్రమె! కావుననే లంచమపేక్షించి హైదరుజంగు బొబ్బిలి నెటులేని నాకు వశముఁగావింతునని వాగ్దానముఁ జేసియున్నాఁడు. బుస్సి హైదరుజంగునతిక్రమించి పోవువాఁడు కాకపోవుటచే నాసంకల్పము ఫలించినది. ఎంతశ్రమమైనపడి బొబ్బిలినిజయించి విజయనగరరాజ్యముతోఁ గలుపవలయును. విరోధి బలవంతుఁడై సరిహద్దులలోనుండఁగ నుపేక్షింపరాదు. బొబ్బిలిని గారణాంతరములు కల్పించి ముట్టడించువారును, తదనంతరము నాకొసంగువారును పరాసువారుగాన

నాకీర్త్యపకీర్తులువారివి. ఫలితము నాయది. రంగారావు బుస్సిదొరవారిదర్శనమునకు రాకపోవుటయే నా ప్రయత్నమునకు సహకారియైనది. బొబ్బిలికిఁ బంపఁబడిన పరిచారకునివలన నేమి వార్తవచ్చెనో తెలిసికొని యనంతర కర్తవ్యము నిర్ణయింతుఁగాక. (ప్రకాశముగ) ఎవరురా! అక్కడ! హైదరుజంగునవాబుగారివద్ద కేగి నేను దర్శనమునకై వచ్చితినని మనవిఁ జేయుము.

(నేపథ్యమున) చిత్తము[illegible]లె యొనర్చెదను.

విజ — మహమ్మదీయులు స్తోత్రప్రియులు. ఎంతస్తోత్రమొనర్చిన వారంత వశమగుదురు. కార్యార్థి కిదియొకమార్గము.

(నేప) దేవా! దర్శనమునకు రావచ్చునని సెలవిచ్చిరి.

విజ — మంచిది. నీపనికినీవుపొమ్ము.

(నిష్క్రమించును)

---

* రంగము — హైదరుజంగు సభాభవనము. *

(భటుఁడు, విజయరామరాజు ప్రవేశింతురు)

హైద — ఐతేబొబ్బిలిగడి యిస్తామన్ని నీకీవాంళ్లు శెప్పారూలేదూ.

భటు — మీయాజ్ఞాపత్త్రిముంగాంచి రంగారావు ఆగ్రహోదగ్రుఁడై కన్నులనిప్పులుకుఱియ బొబ్బిలికోటను బొందిలో బ్రాణమున్నంతవఱకుఁ బరులకు వశముచేయమనియుఁ దుచ్ఛప్రాణముల కాసనొంది యన్యులకు దాస్యము చేయమనియు మీరందఱొక్కపెట్టున మమ్ముల ముట్టడించినను లక్ష్యములేదనియు మేఘగంభీరస్వరంబున దిక్కులుమారుమ్రోయ కత్తిజళిపించుచు వాకొనసాగెను. ఇది తగదని రంగారావుగారిని మందలింపఁబోవ వెంగళరాయఁడు కత్తిఁగైకొని నన్నుఁ జంపవచ్చెను. పాపారా

యుఁడు వారింపకున్న నీసరికి గతించియుందును. అంతతో శాంతింపక వెంగళరాయఁడు బొబ్బిలిరాజ్యము బుస్సికి హైదరుజంగులకు వశముఁగానీయము. నీ విటనుండఁదగదు పొమ్మని కత్తి విసరివైచెను.

హైద—వెంగళరాయడు బోత్ బహాద్మాష్ వుండాడు. ఆయనికి యుద్దెంలో శిచ్చచేశి నౌకరిసేపిచ్చాలా! ఆయన్కి మాది తాఖీద్ అంటె యేమిలక్షెంలేకుండావుంది. సచ్ బోలో! కోట మాకీ హుకుంశూచీ యిస్తాం అన్నారూలేద్నూ? యియ్యకపోతే తగినపని అవుతుందీ అనిచెప్పావూలేదూ! క్యా.

భటు—కోటను విడువమని గట్టిగ తాయిగ్రుద్దిచెప్పిరి. విజయరామరాజుగారన మీారన బుస్సిదొరగారన వారలకించుకేనియు లక్ష్యములేదు. మీాయాజ్ఞను వారు మాటలతోఁబాటించెదరా! మీారలనిన వారలకేమేని లక్ష్యముకలదా?

హైద—లక్షెంగిక్షెం బైటికితెప్పిస్తా దెఖో. హైదర్ జంగ్ పేరు శెప్తే బొబ్బిలివాండ్లు గడగడ వనికిస్తా శూడు! బొబ్బిలికోట యిజయరాంసాబ్ కి యియ్యకపోతే యేమివుంది? తెలింగీదేషం అంతా మాదీసర్కార్ క్రిందవుంది. మాకి స్వతంత్ర జాస్తీవుంది. జబర్దస్తీ చేస్తాం. మాకీ అడ్డం యేమివుంది. యిజయరామసాబ్ రావాలా యిపారణ శెయ్యాలా! (చూచి) బోత్ ఖుషి యిజయ్యరాంసాబ్ వస్తావుంది. బైటో మహారాజ్ బైటో.

విజ—(కూర్చుండి) పరిచారకా! బొబ్బిలి వృత్తాంతములెవ్వి? కోటను రంగారావు మొదలగువారు విడచి మనకు వశముఁ జేసెదమనిరా? లేదా?

భటు—కోటను ముమ్మాటికి విడువమనిరి. అంతతోఁబోక సందేశమేల తెచ్చితివని దురుక్తులాడిరి. వెంగళరాయఁడు నన్నుఁజంపఁబైకివచ్చెను.

విజ—ఔరా! బొబ్బిలివారల యహంకార మింక నంతరింపలేదా! ఈ పరిచారకుఁడు విజయరామరాజుగారి బంటనియు బుస్సిదొరగారి ధూతయనియు నెఱింగియే వెంగళరాయఁడు చంపఁబోయెగా! ఏమి కాలవిపర్యాసము. ఇవి యంత్యకాలపుబుద్ధులు.

ఉ॥ పొంగకు పొంగకోయిమది ♦ బొబ్బిలిరాజ్యము సుంతలో నమి
ద్రంగమొనర్చెదర్, విజయ ♦ రామనృపాలుని శక్తినీవు చూ
డంగల వేలరిత్తగ జ ♦ డత్వముఁదాలిచి పూన్కిఁజూపెదో
వెంగళరాయ! నీవు విల ♦ పించుదినంబులు రాకపోవునే॥ 1

హైద—(కోపముతో) పౌజు లడాయికి తయ్యార్ శెయ్యాలా! నాకీ హుకుం జవాన్కి హుకుం లక్షెం శెయ్యకుండా బొబ్బిలివాండ్లు బేఫికర్ మీాద వుండారు. వాళ్లది కోట మట్టీకిమట్టి దుమ్మూకు దుమ్ము శేసి నాది తడాఖా శూపిస్తా. వాళ్ళకి సంగతి బుస్సి మహారాజ్ కి శెప్పి జైలుకీపెట్టిస్తా! తమాషా దేఖో.

భటు—మీారీతప్పునకు క్షమించిన బొబ్బిలివారలు మనల నిలువనీయరు. మీాచిత్తము.

హైద—నువ్వు మాకీ శెప్పాలావద్దు. బొబ్బిలిగడీకి మాదీ షైన్నెం జల్దీపడుతుంది. వాంళ్ళకి గమ్మత్తు శేస్తాను. తెలింగీ దేషం సయినా బుస్సిమహారాజ్కి అధికారం మస్తావుంది. బుస్సీ నాదీమాటలో వుండాడు. జవాన్! ఈసంగతి హుజూర్ బుస్సి దొరకి చెప్పిజావ్.

భటు—చిత్తము. సెలవుపుచ్చుకొనెదను. (నిష్క్రమించును)

విజ—చూచితిరా! బొబ్బిలివారి స్వాతిశయము. తాము వచ్చిన సంగతి విని దర్శనమునకు రాకపోవుటయుఁ బ్రత్యర్థులతోఁగలసి రాజద్రోహమునకుఁ బాలుపడుటయుఁ గాక మనపరిచారకుని బంపినను బొబ్బిలిరాజ్యము మాకు వశముఁజేయవలయునని

తెలిపినను రంగారావింతవఱకు వచ్చియుండఁడు. ఔరా! ఎంత తిరస్కారస్వభావుఁడు.

హైద—తిరస్కారం గిరస్కారం హైదర్ జంగ్ సాహెబ్ తెప్పిస్తాడు దేఖో. విజయ్‌రామంసాబ్! రంగారావుకీ యింతా హామీవుంది వాడ్కి సైన్నెం ఎంతావుంది. గడీయెంతపెద్దావుంది.

విజ—స్వామీ! బొబ్బిలికోటనల్గువైపులలో నెటుచూచినను నాలుగువందల గజములు పొడవుగలది. నాలుగువైపుల నాలుగు బలవంతములైన బురుజులు దృఢములగు ద్వారములుకలవు. చుట్టును మిక్కిలిలోతుఁగల యగడ్తకలదు. ఆకోటనెప్పుడు గాలకింకరులకుఁ దీసిపోని నాలుగువేలమంది వీరభటులు రక్షించుచుందురు.

ఉ॥ నాలుగువేలసైనికులు ♦ నాలుగు వైపులఁగాచియుండ ని
ర్వేలసమిత్కళావిదుఁడు ♦ వెంగళరాయఁడు వైరినారి పాం
చాలుఁడు పాపరాయఁడును ♦ సౌఖ్యముఁగూర్పఁగ రంగరాయభూ
పాలకబాహుపాల్యమయి ♦ పేసిలు బొబ్బిలిగెల్వ శక్యమే॥ 2

హైద—యిజయరాంసాబ్ తుం దివానావుండావు. నీది మనస్సులో ధైర్యం నిలవటాన్కి జోటులేదు. నాలుగుయేలాసైన్నెంకీ భయంపడ్తావు యెందుకు. తాండ్రపాపయ్యా యెంత్తావస్తాడు వుండాడు. బొబ్బిలిగడీ యెంతపెద్దా వుంది. రంగారావుకీ బలం యెంతావుంది. మనకీ ఫర్వాలేదు.

విజ—తామటుల సెలవీయకుఁడు. బొబ్బిలి నాలుగువేల సైనికులుగల సంస్థానముగదాయని చులకనగాఁ జూడఁదగదు. అంతకు నాలుగురెట్లు పెద్దసంస్థానముఁ గలవాఁడనయ్యు నంతకు నాలుగురెట్లు సైన్యముఁ గలవాఁడనయ్యు సరిహద్దులలోనుండి వారల బల పరాక్రమ పౌరుషాదు లామూలమెఱింగి యుంటచేతనే నేఁటివఱకు వారొనర్చిన ద్రోహమునకు శాంతించితిని. ఇంతియగాక మఱియొక విశేషముఁగూడఁ గలదు.

సీ॥ వైరిమత్తద్విప ♦ పంచాననుఁడు చెలి
కాని వెంకయ్య. కా ♦ లూనినిలువ
అరిరాజతిమిర మా ♦ ర్తాండుండు వెంగళ
రాయుండు కదనవి ♦ క్రమముఁజూప
విద్విషజ్జలధర ♦ విలయానిలుఁడుదమ్మ
నాహ్వాయుం డతులశౌ ♦ ర్యంబునెఱపఁ
బరిపంథి శంబర ♦ పటల శార్దూలుండు
తాండ్రపాపయ రణ ♦ స్థలి వసింపఁ

తే॥ గీ॥ బ్రథిత రిపుసైన్య జలనిధి ♦ మధన పృథుల
మందరాద్రియనందగు ♦ మహితమూర్తి
రంగరాయండు కదనభా ♦ రము వహింపఁ
బ్రతిఘటింపఁగ శక్యమే ♦ భవునకైన॥ 3

హైద—విజయ్యరాంసాబ్ తుం బడాపిఱికివాఁడూ వుండావు. నీకీ ధైర్యం లేదు. శౌర్యం లేదు. బొబ్బిలివాంళ్లకి బయంపడ్తావ్ యెందుకు. హైదరుజంగు సాహెబ్ నీకి ఉప్పర్ ఉంది. నువ్వు పిచ్చివాఁడూవుండావ్. ధైర్యం జరా తెచ్చుకో.

విజ—మీరిటులఁ జెప్పుచున్నను బొబ్బిలివారిని జయించుట మన కసాధ్యమని నాకుఁ దోఁచుచునేయున్నది. కాననే యింతవఱకు నేనీప్రసక్తిఁ బెట్టుకొనఁజాలనైతిని. రంగారావు నాకంటె ధనమెక్కుడొసంగి మిమ్ముసత్కరించినచో నన్నుఁ బరిత్యజింతురేమో! అప్పుడు నాప్రయత్నము విఫలమగునేమో యనిసంశయించుచున్నాను.

హైద—మహారాజ్ తురకబిడ్డకి నాల్కవహాటివుంది. రెండులేదు. దేఖో పెమాణంశేస్తా (కత్తిముట్టుకొని) మాఅల్లాతోడు నీకియిడిచిపెట్టితే వుంది. సైతో సువర్ కాఘోష్ తిన్నట్టూవట్టూ వుంది. నాదీ తాఖీద్ శూడక నాదీదర్శనం శెయ్యాలి నాదీ జవాన్కి సంపబోయిన బొబ్బిలివాంళ్లపైకి నాదీ దయ యట్లా

వస్తుంది. నీకీ ఆషందేహాంవద్దూ భాయి. ఆంధ్రదేశం పైనా మాకీ సాతంత్రం అంతావుంది. మాకీ అడ్డంలేదు.

విజ—దేవా! తొనఁ దప్పవద్దు. మీరు విరోధుల కింమకేనియుఁ జనుపీయవలదు. అది రాజనీతికి విరుద్ధము. తప్పకరంగారావో లేకదూతయొ రాకపోఁడు. అపుడు మీరు గంభీరము వహించిన నన్నియు సాధ్యమగును. (ముందునకుఁజూచి) ఎవఁడో యోధుఁడు వచ్చుచున్నాఁడు. బహుశః రంగారావుగారి ప్రతినిధి కావచ్చును. మీదర్శనమునకె వచ్చుచున్నాఁడు.

హైద—ఎవఁడో కొత్తమనిషీ వుంది.

(దామెరదమ్మన్న ప్రవేశించి) అకటా! ఆంధ్రదేశమున కెంతటి దురవస్థపట్టినది. రాజులకైకమత్యములేదు. జాత్యభిమానము లేదు. పౌరుషాగ్ని చల్లారినది. మాతృదేశమంతయుఁ బాశ్చాత్త్యుల హస్తగతమైనది. మనము వారలచేతి కీలుబొమ్మలమె. ఇఁక నెక్కఁడి స్వాతంత్ర్యము. ఎక్కఁడి విక్రమము. సర్వము మాఱిపోయినది.

శా॥ చాళుక్యావనినాథ విక్రమకళా ♦ జాజ్వల్యమాన ప్రభా
జ్వాలామాలిక తగ్గెఁగాకతి మహీ ♦ శ ప్రాజ్య సామ్రాజ్య ల
క్ష్మీలీలావిభవంబు శాంతిలెఁ, ద్వదం ♦ ఘ్రిద్వంద్వ స్మసేవన
వ్యాలోలాత్ముల నాంధ్రపుత్రుల మదం ♦ బా! యెట్లురక్షించెదో॥ 4
దేశీయుల జీవితములు పరహస్తగతములైనవి. ఇఁకఁ బూర్వ విచారముతో నేమిపని. నాసందేశకార్యము నిర్వర్తింతుఁగాక (హైదరునుజూచి) ఆదాబ్. సర్కార్!

హైద—మీది యేషంస్థానం. మాకచ్చేర్కి యెందుకు వచ్చావు. క్యాకాం.

దమ్మ—అయ్యా! విన్నవించు చున్నాఁడను. బొబ్బిలి సంస్థానాధీశ్వరుఁడు తమకొకసందేశమును బంప విన్నవింపవచ్చితిని. బొబ్బిలి

వారి దూతుఁడను. (విజయరామరాజునుజూచి) విజయరామరాజా! నీకును దాంద్రపాపారాయఁడు వెంగళరాయఁడ్డుగారలు వేఱొకసందేశమంపిరి.

విజ—ఔరా! రంగారాయని సాహసము. బొబ్బిలి రాజ్యవినాశనకాలముదాపరించినను రంగారా వింతవఱకు మేలుకొనకయున్నాఁడు. ఇంకను సందేశములతోఁ గార్యములు సానుకూలమగునని తలంచెను గాఁబోలు. ఆతరుణము తొలంగిచాలకాలమైనది.

దమ్మ—విజయరామరాజా! బొబ్బిలి రాజ్య వినాశవకాలము దాపరించినదా! ఒకవేళనంతటి ప్రళయమె జరుగునేని విజయనగర రాజ్య నాశనకాలముఁగూడ దాపరింపకపోదు. ఊఱక ధర్మము తొలంగి భాషింపకుము.

హైద—బొబ్బిలిదొరా! మీకీ మీకీ లడాయియెందుకు షంగతిశెప్పు.

దమ్మ—(తనలో) లంచపుఁ గసవుమేసిన యీహైదరుజంగు విజయరామరాజు పక్షము నవలంబించుటలో నాశ్చర్యమేమున్నది. ఈదురాత్ముఁడు సంధికుదురనీయఁడు. విజయరామరాజును బద్మనాయకవీరులు ప్రాణములతో విడువరు. ఇపుడు నాసందేశము దెల్పఁజనదు. (ప్రకాశముగ) మారాజుగారు తమసందేశమును బుస్సిదొరవారిముం దెఱింగింపుమనిరి. స్వతంత్రబుద్ధియు నధికారము గూడ నాయనకెకలదుగదా!

విజ—అదిగో? బుస్సిదొరగారు వచ్చుచున్నారు. సందేశముఁ దెల్పమొదలిడుము.

దమ్మ—విజయరామరాజా! నీకేల యీయప్రస్తుతప్రసంశ. తటస్థముగ నుండలేవా!

బుస్సి—(ప్రవేశించి పీఠముపై నాసీనుఁడగును.)

దమ్మ—అయ్యా! సలాములు.

బుస్సి—(చూచి) ఎవఁడవునీవు. ఇచటికేలవచ్చినాఁడవు.

దమ్మ—నేను బొబ్బిలివారి దూతను. వారు తమసన్నిధిలోఁ గొన్ని సంగతుల విన్నవింపుమని చెప్పిపంపిరి. విన్నవింప వచ్చితిని. తమదర్శనమునకు రాకుంటచే రంగారాయని మీరలు స్వతంత్రునిగ భావించితిరి. అదిమిక్కిలి యక్రమము. వారు నేటికిని మీకు విధేయులె.

బుస్సి—మీకు విన్నపములతోఁ బనిలేదు. మాదర్శనమునకు రంగారావు రాక యెప్పుడుమానెనో త్రిలింగదేశముపై సర్వస్వతంత్రముఁగల మమ్మ నాఁడె తిరస్కరించినటుల భావించితిమి. మాపరిచారకు నెపుడు తిరస్కరించెనో యపుడె మాయుద్దేశము స్థిరపడినది. బొబ్బిలికోటను మీప్రభువు విడచెనా? ఇంకను విడువలేదా!

విజ—మాటలతో విడతురా! నువ్వులునూనె నిమ్మనిన నిచ్చునా!

దమ్మ—స్వామీ! ఆవిషయమె రంగారావుగారు మనవిచేయు మనినది.

సీ॥ అనుజ వివాహకా ♦ ర్యమగుట వీఁడాదుద
ర్శనమున కేనురాఁ ♦ జాలననియె
వలసినయంత క ♦ ప్పమొసంగెదముగాని
పురమును విడనాడి ♦ యరుగమనియె
విజయరామాఖ్యు బొ ♦ బ్బిలిక్ష్మధీశుని జేయఁ
దమపాటివారికిఁ ♦ దగనిదనియె
బూర్వార్జితములైన ♦ భూముల విడనాడి
పొమ్మనుటలు మీకుఁ ♦ బోలదనియె

తే॥ గీ॥ ఓరువఁగలేక యెవఁడో యే ♦ దోవచింప
నాలకించుట మీకు న ♦ నర్హమనియెఁ
గొలఁది తప్పున కింతటి ♦ కోపమంద
నేల? మాలోపముల క్షమి ♦ యింపుమనియె॥ 5

ఇదియె రంగారాయని విజ్ఞాపనము.

విజ—పనిలోని పనిగ నన్నుఁగూర్చి పాపారాయఁడు వెంగళరాయఁడు తెలిపిన సంగతులుగూడ వాకొనుము, ప్రత్యుత్తర మవసరమేని యొసంగుదును.

దమ్మ—యుద్ధమేయగుట నిశ్చయమేని పాపారాయఁడు నీరక్తమును బొబ్బిలిరాజ్యములోఁ బ్రవహింపఁజేసెదనని చెప్పుమనెను. వెంగళరాయఁ డీదురాశకు లోనై ప్రాణాపాయమును గల్పించుకొనకుమని నీతి గఱపెను.

విజ—ఈపాపారాయని బెదరింపులకు వెంగళరాయని ధర్మశాస్త్రములకు నేను వెఱచువాఁడనుకాను. ఇదియే నావాండ్రసందేశము.

బుస్సి—బొబ్బిలివారిని క్షమింపవీలులేదు. మఱచితిమి. మాయాజ్ఞోల్లంఘన మాచరించుటయెగాక మాదూతుని పరాభవించిన వారల మేము క్షమించునంతటి సమర్థులమా?

దమ్మ—దూతను పరాభవించుట రాజధర్మవిరుద్ధమని మాబొబ్బిలిప్రభు వెఱుంగనివాఁడుకాఁడు, దూతుఁడేమేని వాక్పారుష్యము వెల్లడింప వెంగళరాయఁడు దుడుకుతనముఁ గనఁబఱచెనేమో. రంగారావు మీయాజ్ఞోల్లంఘనము నాచరించువాఁడు కాఁడు. దేశము స్వాధీనము నందుంచుకొనుటయుఁ గప్పములఁ దీసికొనుటయు మీనియతకృత్యము. ఈయుభయ నిబంధనములకు మేము లోఁబడెదము. మమ్ము మన్నింపుఁడు.

బుస్సి—మీయందు మాకు ద్వేషముఁగలిగిన కారణము లిదివఱకె వాకొని యున్నాఁడను. కావుననే మాకు విధేయుఁడైయున్న

విజయరామరాజునకు బొబ్బిలిరాజ్యము కొలునకొసంగెదనని వాగ్దానముఁ గావించియున్నాఁడను. ఇఁక సంధివాక్యము లిట బని లేదు. మాయాజ్ఞప్రకారము రంగారావు బొబ్బిలికోటను విడచి పెట్టినా లేదా!

హైద—హుజూర్ సాబ్ రంగారావు జాఫరల్లాకి స్నేహం శేసిమన్ది అధికారాన్కి మోసంశెయ్యాలా అని బడాబడా ఖుషి శేసి వుండాడు. మీకీయాద్ లేదూ!

దమ్మ—(స్వగతము) సంధి సర్వవిధముల భగ్నమైనది. నేనిఁక శాంతము వహించిన ఫలములేదు. ఇఁక రక్తనాళముల నుడి కిఁమచు హృదయమున నాగక విజృంభింపనున్న నాసహజ పరాక్రమము ప్రకటింపవలయును. (ప్రకాశముగ) బుస్సిదొరా! పూర్వార్జితమైన బొబ్బిలికోటను రంగారావుగారేలవిడచిపెట్ట వలయును.

బూసి—ఏలయన, విజయరామరాజునకుఁ బట్టాభిషేకము చేయుటకు.

దమ్మ—ఏమీ! బొబ్బిలి రాజ్యమునకా! విజయరామరాజు నా! పట్టాభిషిక్తుని జేయుటయా! బాపురే! యేమిసాహసము. బొబ్బిలి గడ్డపై నొకపద్మనాయకవీరుఁడు కొనప్రాణముతోడ నున్నను కలనైన యీకార్యము సాధ్యముగాదని తలంచుము.

మ॥ అరిరాట్కంధర నిర్గళ ద్రుధిర ధా ♦ రాసార సంపూర్ణమై
ధరణీమండల మొప్పలేదు, రిపుకాం ♦ తా బాష్ప ధారావళుల్
ఝురులై పాఱఁగలేదు, సర్వదిశలున్ ♦ సంక్షోభముం జెంద లే
దరరే బొబ్బిలి రామభూపతికి మీ ♦ రర్పింతు రేముఱదుగన్॥ 6

విజ—బొబ్బిలిని సాధించుటనిజముగ నీవుచెప్పినటులదుర్ఘటమె. అగు గాక. మేముమాత్రమేకదీక్షతో మీకోటవశముఁ జేసికొనక మానము.

దమ్మ—అసహనశీలా! విజయరామనరపాలా! నీయసంగతాలాపముల ముగింపుము. నీబుద్ధులు నీదశకు స్థితిగతులకుఁదగినవి కావు. కాన నావిజ్ఞప్తి వినుము.

చం॥ యవనపరాసు సైన్యనివ ♦ హంబులరక్తము క్షత్రసైనిక
ప్రవరుల మాంసఖండములు ♦ ఖండనభూమిని బొఱజల్లి భూ
తవితతిఁ దన్పనెంచితిమి ♦ ధైర్యముఁగల్గిన బంటువేని మా
యవసరమందుఁ దోడుపడు ♦ మా! సుకృతంబగు రామభూపతీ॥

విజ—ఓయీ! పొంగి పడకుము. నీగర్వోక్తులకు, బొబ్బిలి రాజ్యమునకు, నవసానదివసములు సమీపించినవి. మావంటయింటి కుందేలువయ్యు మీజీవితములు మాయుఱచేతిలోనున్నవని యెఱింగియు నేల యనవసర పారుష్యములకుఁ బాల్పడెదవు. ఇది విజయరామరాజుతోఁ బ్రతిఘటించుటకాదు. దేశదేశము లాక్రమించి యాంధ్రరాజ్యమున బావుటాయెత్తిన పరాసువారితోఁ బోరాటమని తెలిసి భాషింపుము. మహమ్మదీయుల సామంతులమైనపుడాడిన యాటలనన్నింటి నిపుడుగూడ నాడఁ దలంచుచున్నారు కాఁబోలు. ఆయాటలు సాగుదినములుపోయి చాలకాలమైనది.

ఉ॥ సంగరరంగభాగముల ♦ క్షత్రియసైనికులాక్రమించి, కో
వెంగళరాయ నిల్వుమిట, ♦ వేంకటరంగనృపాల పోవకం
చుంగరవాలధారలను ♦ జూపెడికాలము వచ్చుచుండెఁ గ
త్తిం గొని యెవ్వఁడడ్డుపడి ♦ తీరుచునోకదనంబు చూచెదన్॥ 8

దమ్మ—ఛీ! అన్యైశ్వర్యాసహిష్ణు భావా! విజయరామా! నీవు వంచకస్వభావుఁడవు నీలంచవుఁగనవున కానవడిన హైదరుజంగు మాయామయుఁడు. మీమొగంబులఁజూచి మాటలాడుటకంటె ననుచితము వేఱుండనేరదు. (బుస్సివైపునకు మరలి) దేవా! నావిజ్ఞాపనముఁ జిత్తగింపుఁడు. బొబ్బిలికోట విజయరామరాజున కొసంగవలయునని మీకుఁదలం పున్నయెడ విజయనగరమువారి

కిని బొబ్బిలివారికిని యుద్ధమునియమించి గెలిచినవారల కోడిన వారు రాజ్యమునొసంగునటులఁ జేయుఁడు. ఇదిధర్మమార్గము. మీరొక వేళ బలవంతముగ బొబ్బిలిరాజ్యము విజయరామ రాజున కొసంగినను బద్మనాయకవీరు లాతనికిఁదక్కనీయరు.

హైద—నీదీ మాటా బడా ఝూటామాటా వుంది. విజయ్యారాంసాబ్ తప్పాకెయ్యకపోయినా లడాయి చేయించాల శేస్తావ్. నీది మాటా కానూకాదు.

బుస్సి—విజయనగరము వారికి బొబ్బిలివారికి యుద్ధముల్గల్పించి వినోదములఁ జూచుటకు మేము రాలేదు. మాకువిధేయులు గాని నృపుల వెడలఁగొట్టి దేశము స్వాధీనముఁజేసికొన్నటయందు మాకు సంపూర్ణస్వతంత్రముకలదు. ముందు బొబ్బిలికోటను విడచి రంగారావును మేము చూపినస్థలమునకుఁ బొమ్మని చెప్పెము. పరులతోఁగలసి రాజద్రోహము చేయనెంచుటయు, సామంతుఁడయ్యుఁ గప్పము నొసంగకపోవుటయుగాక దర్శనము నకు సైతము రాకుండుట, మాభటుని పరాభవించుట లోనగు దోషములు గావించిన రంగారావును క్షమింపవీలులేదు. నేను బలవంతుఁడనని రంగారావు విఱ్ఱవీగుచున్నాఁడు. ఆబల మేమో కనుగొనువఱకు కీపట్టుదల నేను వదలఁ జాలను. ఇపు డేని కోటవదలకున్నచో సంస్థానమును రూపుమాపెదము.

దమ్మ—(చెవులుమూసికొని) ఎంతటి కఠినవాక్యములు వినఁగలిగితిని. (తనలో) ఈబుస్సిదొరయు హైదరుజంగుతోఁబాటు విజయ రామరాజు వలలోఁ బడినాఁడు. వీరిరువురు బొబ్బిలిరాజ్యము విజయరామరాజునకుఁగట్టిపెట్ట సిద్ధసంకల్పులై యున్నారు. వెలమ వీరులు వీంద్రబెదరింపులకుఁ బ్రాణముబాయుటకు జంకువారు కారు. అక్కటా! భావికార్యవిధు లెటుల జరుగనున్నవియో నే నింకను శాంతమును వదలఁదగదు. (ప్రకాశముగ) దేవా! బుస్సిదొరా! తాము పక్షపాతము వహించుట యుక్తముకాదు.

మనవివినుఁడు. సర్కారునకొసంగవలసిన పన్నులన్నియు నేఁడె యొసంగుదుము. మిమ్ముదర్శింపని హేతువు నకారణముగ రంగారావుగారు నివేదింపనున్నారు. మహమ్మదీయులతోఁగలసి మేము కుట్రలుచేయుచుంటిమనునది యసత్యము. మాశ్రేయస్సునుజూడలేని స్వార్థపరాయణు లెవరో యిటులనివేదించియుందురు. విజయనగర సంస్థానమువారికిని మాకును జిరకాలము నుండి వైరముకలదు. తరతరములనుండి యది యవిచ్ఛిన్నముగఁ బెఱుఁగుచున్నది. మావైరికి సంస్థానముగట్టిపెట్టి మాను మము తొలగింపనేలయత్నింతురు! ఒకవేళ బొబ్బిలిరాజ్యము బలవంతముగ మీరు విజయరామున కొసంగినను బొబ్బిలిగడ్డపై నొకవెలమవీరుఁడేని సజీవముగనున్న నాతనికిఁదక్కదు. ఇది విజయరామరాజు మరణమునకై వచ్చినదేయని యాలోఁ చును మీరు గ్రహింపకుంట చిత్రముగనున్నది.

చం॥ పరహిత పద్మనాయక నృ ♦ పాలక పౌరుషతైలధారచే
స్ఫురదురు కాంతిమంతమగు ♦ బొబ్బిలిరాజ్య సమాఖ్యదీప మ
బ్బురపడి రామరాజశల ♦ భంబు గ్రసింపఁగనుండెఁ దావకా
దరపరిణామమే విధివి ♦ ధానముగాఁ బురికొల్పుచుండఁగన్॥ 9

ఆర్యా! మఱియొకవిజ్ఞాపనమును సావధానులై చిత్తగింపఁ గోరెదను.

తే॥ గీ॥ వలసినంత ధనంబిత్తుఁ ♦ గలము మమ్ము
సైపుఁ డదిగాకయున్నచోఁ ♦ జాలినంత
విత్తమిత్తుము మీరలు ♦ విజయనగర
రాజ్యమొసఁగెదరే రంగ ♦ రాయపతికి॥ 10

విజ—ఓరీ పరవంచనప్రవీణా! విజయనగరరాజ్యమున కాసపడుచుంటివా? ఆత్మనాశనమునకు విచారము నొందుటకు మారు పర రాజ్యమునకుఁ బ్రయత్నించుచున్నాఁడవు. ఈ యనుచితసందేశముఁ దెచ్చిన నిన్నుఁజెండాడినఁగాని నాకోపము చల్లారదు.

ఉ॥ బంధుర భోగభాగ్య విభ ♦ వప్రభవంబగు నాదురాజ్య సం
బంధముఁ గోరువంచకునిఁ ♦ బ్రాణములోఁ జననిత్తునే? భవ
త్కంధరనాశముం గాదునిమి ♦ ఖడ్గకుమారికి వెల్మరక్తపుం
గంధముఁ జూపి దోర్యుగికిఁ ♦ గల్పనఁ జేయుదు విక్రమాంకముం॥

(కత్తిఁ ద్రిప్పుచుఁ బైకిఁ బోవును)

దమ్మ—బొబ్బిలిరాజ్యమున కానపడి యనుచితభాషణము లాడినపుడె వీనినిఖండింపవలసియుండ సందేశభంగమగునేమో, యని యప్పుడూరకయుంటిని. ఇప్పటి కాయనుమానముఁగూడ తీఱినది. కావున స్వతంత్రముగ విజయరామరాజును మందలించి నా పరాక్రమము బుస్సీకి హైదరుజంగునకుఁ జూపుదునుగాక.

మ॥ అతులక్రూరశితాసిపాతమునదు ♦ ష్టా! నిన్ను ఖండించిమ
ద్వ్రతసంపూర్తినొనర్చి, బొబ్బిలికిఁ గ ♦ బ్రాప్తింపఁగానున్న దు
ర్గతినిం బాపెద; విక్రమాఢ్యుఁడగు శ్రీ ♦ రంగావనీభర్తకుం
గుతుకంబుం ఘటియించెదం నిలువుమా ♦ కుక్షింభరాగ్రేసరా॥

(కత్తివిసరుచుఁ బైకిఁబోవును)

బుస్సి—(చూచి) ముదుసలివాఁడైనను దమ్మన్న విజయరామరాజును వెనుకంగ వేయించుచున్నాఁడు. ఇప్పుడు నేనుపేక్షించితినేని విజయరామరాజు గతించుటయే నిశ్చయము. (ఇరువురకడ్డముపోయి) రాజసభలో యుద్ధమ్ములా! ఆగుఁ డాగుఁడు.

విజ—మీరు క్షణము సేపు సహించిన నీదమ్మన్నను స్వర్గమునకుఁ బంపియుందును.

దమ్మ—విజయనగరరాజ్యరమ వైధవ్య మనుభవింపక మున్నె!

విజ—నిన్నాప్రసంగమె చేయవద్దనినది. జాగరూకతతో మెలంగుము.

దమ్మ—ఛీ, పరులచాటునఁ జేరి ప్రేలుదువేల ? బయటికిరమ్ము.

హైద—మీకీ, మీకీ లడాయివద్దని మహారాజ్ సాబ్ శెప్పాడులేదూ.

మీకీ శెవికిపెట్టర్ ఎందుకు. కోడిపుంజులు వుండారు. మీకీ హుజూర్ మాట లక్షింలేదు.

దమ్మ—(తనలో) బుస్సిదొరవారు హైదరుజంగు విజయరామరాజు పక్షములోని వారని తెలినది. ఏకాకినగు నేను మిన్నకుండక చేయునదేమున్నది. (ప్రకాశముగ) ధర్మమార్గవిదా! బుస్సిదొరా! బొబ్బిలివారి ననుగ్రహింపఁదలున్నచో నాప్రార్థనఁ బరిగ్రహించి క్షేమకరమగు ప్రత్యుత్తరము దయచేయుఁడు. నేను సెలవుఁ బుచ్చుకొనెదను.

బుస్సి—మేము రెండు మాట లాడువారముకాము. విజయరామరాజునకు బొబ్బిలిరాజ్యము పట్టాభిషేకము చేయవలసినదె. రంగారావు బొబ్బిలికోట విడచి పోవలసినదె. మాదర్శనమునకురాక పన్నానంగక రాజద్రోహమున జోక్యముఁగలిగించుకొనినందులకుఁ బ్రతిక్రృతిఁ జేసితీఱుదుము. ఇఁక మార్పుజరుగదు.

హైద—మహారాజకీ బాత్ భోత్ అచ్ఛావుండింది.

దమ్మ—ఆర్యా! తగినంత తప్పులేనిది పరుల వంచింపఁదగదు. మాటలతో బొబ్బిలి కోట వశముకాదు. ఏల నిష్కారణముగా నుభయసేనాప్రళయకాలమును గల్పించెదరు. నాప్రార్థనము నంగీకరింపుఁడు. బొబ్బిలివారిని క్షమింపుఁడు.

బుస్సి—మేము నీతో సంధివిషయమై మాటలాడము. ఆతరుణము తప్పినది. ఏదేనియుద్ధవిషయమై చెప్పవలసియున్నఁ జెప్పుము. లేదా వచ్చినత్రోవనుబొమ్ము. అనవసరప్రసంగముతో మాకుఁ బనిలేదు. మేమును బనిపాటలులేక తీఱికూర్చుండలేదు.

హైద—దమ్మారాయ్యాసాబ్! మహారాజాసాబ్ అడిగేటిది ఒకమాటివుంది నీవుశెప్పేది వకమాటివుంది. బేపర్వాపాలించి హుజూర్కి సవాల్కి జవాబ్ బోలో!

దమ్మ—(స్వగతము) ఔరా! యీముక్కిడి తురుష్కునకు విజయరామునిపై నింతయనరాని యభిమానముకలదు. కానిమ్ము. కాలమునకు బద్ధుఁడనై మానావమానమును సహించితీఱవలయును. (ప్రకాశముగ) ఆర్యా! బొబ్బిలివారిని క్షమింపరా? అనుగ్రహింపరా!

బుస్సి—(కోపముతో) మరల నీప్రసంగమును దెచ్చిన నిన్ననుగ్రహింపను, క్షమింపను.

దమ్మ—(స్వగతము) ఔను! ఎటుల క్షమింతురు! పైత్యరోగికిఁ బంచదార రుచించునా! ఆంధ్రదేశీయుల సర్వైశ్వర్యములు హరింప మరిగిన మహానుభావులకు రాయబారములు ధర్మపరిపాలనములు రుచింపవు. వారికిఁ గావలసినది భేదనీతి యొక్కటియే. దానితోనే ఖండాంతరములనుండి వచ్చి పాదుకొనఁగలిగినది. (ప్రకాశముగా) ఓ విజయరామరాజా! నీపైన నావిజ్ఞప్తి నాలకింపుము. నీకుఁ బరాసువారి యాశ్రయము మహాపాయకరమైనది. మనలో మనకెన్ని యంతఃకలహములున్నను బరులకు గుట్టు తెలియనీయరాదు. నేఁడు పరాసువారి సహాయముతో నీవు బొబ్బిలిని జయింతువు. దానివలన నీబలాబలములు వారెఱింగి రేఁ పెద్దాపురమువారితోనో కలసి విజయనగరము ముట్టడింతురు. అపుడు నీగతి యేమికావలయును? చిక్కినంతవఱకు దేశము నాక్రమించుకొనుటయే గాని పరాసువారెవరిని బాగుచేయలేదు. నిన్నును బాగుచేయరు. మహామహులగు నవాబులనే వారు పకీరులఁ జేసిరి. కాన పరాసువారి యాశ్రయము వదలుము. బొబ్బిలి విజయనగరములనుకూలముగనున్న సృష్టికర్తయేని మనకు వ్యతిరేకము చేయఁజాలఁడు. నీవు గోదావరి సరిహద్దుఁ జేసి కటకమువఱకున్న యాంధ్రమండలమును నేకచ్ఛత్రముగఁ బాలించుచున్నాఁడవు. పరాక్రమశాలివి క్షత్రియవంశ్యుఁడవు. ఏల నీకీభావదాస్యము — చేతిమీఁదుగ నాంధ్ర

దేశమును బరులపాలు చేయకుము. నామనవివినుము. నీసోదరుఁడగు నాంధ్రుఁడు పాలించుచున్నంతవఱకు బొబ్బిలి నీవు పాలించుచున్నటులే! ఏలమనకీభిన్నాభిప్రాయము.

విజ—దమ్మన్నగారూ! మీవచనములు యుక్తియుక్తములె. కాని కార్యము మిగిలినది. ఈశాంతము మీకిదివఱకే యున్న బాగుండెడిది, ఇఁక మార్పుఁజేయ వీలుకాదు. బొబ్బిలికోట వశముఁజేసికొనవలసినదె. రానున్నచిక్కుల నావల సవరించుకొనవలసినదె!

దమ్మ—(స్వగతము) దురాశాపీడితుఁడగు విజయరామరాజునకు నా పలుకులు రుచింపవు. హైదరుజంగుతో నించుక మాటలాడిచూచెద (ప్రకాశముగ) ఓ మహమ్మదీయా! బొబ్బిలిసంస్థానమును గరుణించుట యుక్తము. ఖండాంతరమునుండి వచ్చినను భరతఖండమున స్థిరవాసమేర్పఱచుకొని మీరు భారతీయులైతిరి. హిందువులలోఁ గొందఱు పవిత్రమగు తమ మతధర్మమునేని పాటింపక జాత్యైక్యముఁ ఘటించి చిరకాలమునుండి పాదుకొనియున్న యంతర్వైరములఁ బోకార్చి మీతో బాంధవ్యములు సైతముఁ జేసియున్నారు. మాకవులు మీకుఁ గృతులనొసంగియున్నారు. ఈపరిచయము మఱచి మమ్ము పరాసువారిచేఁ జంపింతువా! నీవాంధ్రదేశమునఁ దరతరములనుండి జీవించుచుంటివి. పరాసువారో జలగ రక్తముదొరికినంతవఱకుఁ బీల్చి మడుగులోఁ జేరినటుల భరతఖండమును నిస్సారముఁ జేయువారేగాని బాగుచేయువారుకారు. కాన నాంధ్రదేశమునకు నాయకమణియనఁదగు బొబ్బిలిగడ్డను పరాసువారి స్వాతంత్ర్యములోనికిం జేర్పకుము. ఈధర్మరహస్యమును గ్రహింపుము. ఇదియె నాయంత్యవిజ్ఞాపనము. పైనిమీచిత్తము.

హైద—నేనూఏంశయ్యాలా! బొబ్బిలిపైకి బుస్సీ తయ్యారుపడ్డాడు. మీకీమీకీ స్నేహం తక్వావుంది. విజయ్యారాంసాబ్ బొబ్బిలి

పైన కన్నాయేసి వుండాడు. లడాయ్కి మేము తయ్యార్ వుండాము. పావురానియి. బత్కారానీయి. యీదభా యిలాలూ లేదూభాయి. మమ్ము కమిచ్చాలా! నీదీమాటా యాదీవుంచి ముందూముందూ తెల్వీకి తెచ్చుకొంటాం. నువ్వు అచ్చాబాత్ శెప్పావు.

దమ్మ—(తనలో) ఔరా! నే నెంతవినయము వహించుచుంటినో వీరంద అంత వ్యతిరేకము వహించుచున్నారు. భావికార్యవిధు లెటులజరుగనున్నవి యెుగాని వీరు బొబ్బిలికోటను ముట్టడింప సిద్ధసంకల్పులై యున్నారు. నాబోధయిం దెవరికి రుచింపలేదు. ఇఁక శాంతోక్తుల నాపి యాచరణీయముం దెలిపెదను. (ప్రకాశముగ) బూసిదొరా! మీరు యుద్ధముచేసి మమ్ము గెలువవలయునని మురియుచున్నారు. కావున నావచనము లించుక యాలకింపఁ గోరెదను. మిత్రభేదముఁ గల్పించి యుద్ధమునకు సన్నద్ధమొనరించినచోఁ బోరున దాంధ్రసైన్యమె! ఈనష్ట మనుభవించు నదాంధ్రదేశమెయని విజయరామరా జింతవఱకు గ్రహింపకున్నాఁడు. చంద్రవంశీయుల రక్తధారలచేఁ దండ్రికి దర్పణాదులొసంగిన యనపోతానాయకుని శరీరమున బ్రవహించిన పరాక్రమరక్తధారలు రంగరాయని హృదయమునఁ బ్రవహించుచునేయున్నవి. నేనింతవఱకుఁ బరాక్రమహీనుల రక్షింపుమని మిమ్ము యాచింపలేదు: దేశనాశన హేతుభూతమగు సంగ్రామము మాన్పుఁడని మిమ్ముఁ గోరితిని. ప్రతిఘటించితిరి. ఫల మందఱనుభవింపవలసినదె. కాన మా వేంకటరంగారాయ నృపాలశిఖామణి యుద్ధమునకే యియ్యకొన్న మీకుం దెలుపుమనిన సందేశము విని మామనోనిశ్చయము లాలకించి బొబ్బిలిరాజ్యమునకు బయలుదేరిరండు.

సీ॥ ఇటుసూర్యుఁడటు లుద ♦ యించిన బొబ్బిలి
విజయరామునకు న ♦ ర్పింపఁబోము

వెలమవీరులు ప్రాణ ♦ ములతోడ నున్నంత
దనుక రాజ్యంబుసా ♦ ధ్యంబుగాదు
పద్మనాయకులపైఁ ♦ బగగాల్చి బ్రదికిన
ఘనుఁడు మందువకేని ♦ గానరాఁడు
ఫ్రాంసువారలకైనఁ ♦ బరదేవతకునైన
దెలుఁగుపౌజులు వెను ♦ దీయఁబోవు
తే॥ గీ॥ బుస్సియును హైదరేకాదు ♦ మూఁడునూర్ల
మందిబుస్సులు హైదరుల్ ♦ మార్కొనినను
ఆంధ్రవీరులు చలనంబు ♦ నందఁబోరు
కదలిరమ్మను మరులను ♦ గదనమునకు॥ 13

బుస్సి—మీమనోనిశ్చయముకూడ మాతలంపుల కనుకూలముగ నున్నది.

దమ్మ—ఇంకను మీరు దుర్మతమును విడువకున్నారు. గీతలలోఁ గృష్ణభగవానుఁడు ధర్మమున్నచోట జయముండునని చెప్పినాఁడు. మీవిక్రమమంతయు నధర్మగర్భితము. మీయధర్మ సంరంభమే మీకపజయము నాపాదింప నున్నది. పద్మనాయక వీరుల పరాక్రమము విజయరామరాజునకుం దెలిసినటుల మీకుం దెలిసియుండదు. ఎఱింగియున్న నిటుల సంగరాభిముఖులు కారు. ఈవాక్య మవగతముఁ జేసికొండు.

సీ॥ వెలమవీరులు రణ ♦ స్థలినిల్చి నిశితాస్త్ర
ములచేత మిమ్ముఁ గ ♦ ప్పూటకున్న
అరులొక్కమొగి పయి ♦ కుఱికిమీసేనల
నన్నింటినురుముసే ♦ యక యున్న
దమ్మన చేయుబో ♦ ధలఁ జెవిఁజొచ్చనీ
యక పోతినంచు నెం ♦ చక యున్న
విజయరామునిమాట ♦ విని దుర్దశాప్తిచే
స్రుగ్గితిమని తలఁ ♦ చుటకున్న

తే॥ గీ॥ మీదుదుష్కృత్యములె మీకు ♦ మేటరముగ
స్వబలనాశనమును జొన ♦ ర్పకయమున్న
తెలివిమై యనిపై నాశ ♦ తొలఁగుమయ్య
పరవచోలోల ♦ ఓ. బుస్సిధరణిపాల॥ 14

బుస్సి—నీప్రసంగములతో మాకవసరములేదు. త్వరలో మిమ్ము గెలువ వచ్చుచున్నారము.

దమ్మ—అకటా! అశేషదుర్జన సమావృతంబగు నీధరాచక్రంబున ధర్మమను సూక్ష్మవస్తువు నిలువ నెలవులేక పోయెనుగదా! పంపెంగపూవును జూచిన తుమ్మెదవలె లంచగొండినిఁగాంచిన ధర్మదేవత చాటుమాటులఁ బడితీయును. ఇఁక బుస్సికి మనస్సు తిరుగదు. పద్మనాయకులు జీవితసర్వస్వము గతించినను విరోధుల మన్నింపరు. ఈకారణమున బొబ్బిలిరాజ్యము నిరంకుశ నిర్మల యశస్సుధాకిరణునిచే భరతఖండమును కలధౌతసన్నిభ చంద్రికాసాంద్రంబుఁ జేయనున్నది. ఇంతియె చాలును.

మ॥ పరబోధారతులెల్ల తేంద్రయిరి, పా ♦ పవ్యాపకుల్ మంత్రులై
రి రసాభాస దురుద్యమావృతులు శా ♦ స్త్రీయార్థ నిర్ణేతలై
రి రణప్రాభవశూన్య దుర్మదులు దో ♦ ర్వీర్యాఢ్యులై రీనిరం
తర భారంబెటులన్ భరించెదవొ మా ♦ తా! ఆంధ్రసామ్రాజ్యమా॥

విజ—ఓరీ! దమ్మన్నా! నీప్రగల్భములఁ జాలించి నావిక్రమసూక్తుల నాలకింపుము. వెలమవీరులకుఁ బ్రపంచమంతయు వెఱచుదినములు గతించి చాలకాలమైనది. ఎపుడాంధ్రదేశము పరాసువారి హస్తగతమయ్యెనో నాఁటనుండియే మీతేజ మంతరించినది. మీవిజృంభణములు శాంతించినవి. ఇఁక మీవిక్రమములు సాగిరానేరవని గట్టిగ నమ్ముము.

చం॥ అరులకు వెన్నుఁజూపని ని ♦ రంతర విక్రమ భాసమానులౌ
తురకలు, గర్వసంభరిత ♦ దుస్తర వైరివిదారణక్రియా

పరులగు ప్రాంసుసైనికులు, ♦ పౌరుషరూపులు రాచబంటులున్
బోరిఁగొనసున్నవా రెటుల ♦ బొబ్బిలికోటను గాచికొందురో॥ 16

దామె—ఈవిజయరామరాజు వాక్యంబులన్నియుఁ ద్రాఁగుబోతువాని భాషణములవలెఁ దిరస్కరించుచున్నాఁడ. ఈతని వాక్యము లాలకించఁ దగినవి గోడలె. ఓబుస్సినరపాలా! సంధి కరుదెంచిన నన్ను దిరస్కరించుచున్నారు. పిమ్మటఁ బశ్చాత్తాపము నొంది ఫలములేదు. ఇపుడె మీహృదయముల నాలోచనమునకుఁ బ్రేరేపుట యుక్తధర్మము. నేను సాత్వికముపయోగించితి ననియు బొబ్బిలివెలమవీరు లందఱిట్టివారే మోయని భ్రమించుచున్నారేమొ! ఆవ్యర్థభ్రాంతియే మీకంత్యకాలముఁ గల్పించి దీఁటును. మీకును మాకును జాతిమతభేదములుకలవు. మాదురదృష్టవశమున మాతృదేశమునకు మీరధిపతుకుంటి. కాననే మా కష్టసుఖముల యోజింపరైతిరి. పరరాజన్య శిక్షాచరణంబునకు మేము గలనైన జంకముగాని దేశీయవధయనిన మాహృదయములు కంపించును. ఖడ్గములు చంచలించును. ఏల మీరీపాపకార్యమున బాలుఁ బంచుకొందురు. ఏకామిష వాంఛచే నేల బొబ్బిలిని విజయనగరమును నంతమొందించెదరు?

సీ॥ బేతాళుపైకి ద ♦ ర్పించిదూఁకిన చెవ్వి
రెడ్డి విక్రమ మంత ♦ రించ లేదు
వైరికిఁ బ్రాణముల్ ♦ పణముఁజేసిన బ్రహ్మ
న్నేని శౌర్యంబు క్షీ ♦ ణించ లేదు
రాజరక్తమునఁ ద ♦ ర్పణము సల్పిన యన
పోతభూపు ప్రశస్తి ♦ పోవ లేదు
తురకభూపతుల నె ♦ త్తుట క్రీడసల్పిన
మాదనాయకు శక్తి ♦ ప్రగ్గ లేదు

తే॥ గీ॥ పద్మనాయక నరపాల ♦ భావవీధి
పూర్వవిఖ్యాతి వాసనల్ ♦ పోవ లేదు

వెలమవీరులముందు మీ ♦ బలము లెంత
చావు కొనితెచ్చికొనకుఁడో ♦ శత్రులార॥ 17

హైద—నీకీ మాకీ సంబంధం లేదు. హుజూర్ నీదీమాటా యినుటానికి ఖుషి లేకుండా వుండాడు. నీదిమాట సాలించి నీదీదోవ నీవు శూస్కో. జావ్ జావ్.

విజ—దమ్మన్నా? పాపము పెద్దవాఁడవు. ఉపన్యసించి ఉపన్యసించి యలసితివి. ఇఁక నీవృథా కంఠశోష ముగించి యలసటఁ దీర్చి కొనిపోఁబట్టుము.

దమ్మ—ఏమీ! పరిహాసము లాడుచున్నాఁడవా! నీవు మాకతిథివై నవుడు సగౌరవముగ స్వస్థానమునకుఁ బ్రయాణము చేయింతును.

మ॥ లలితప్రాభవ భాసమానులు గుణా ♦ లంకారులౌ వెల్మవీ
రులు నీరాకకు స్వాగతంబొసఁగి కో ♦ ర్కుల్ దీర్చిమన్నింత్రు బొ
బ్బిలికిన్ రమ్ము నృపాల.

ఓహైదర్ జంగుమంత్రీ! బుస్సిదొరా! మిమ్ముఁ బిలువలేదనుకొనకుఁడు
మీరిరువురున్ ♦ వేవేగనే తెండు ని
శ్చలదోర్వీర్యులు పద్మనాయకులు కాం ♦ క్షల్ గూర్తు్రయుద్ధంబునన్.

విజ—ఇఁక నీచాతుర్యోక్తులఁ గట్టిపెట్టుము. ముందు బొబ్బిలి రాజ్యము వినాశనము గాకుండఁ బద్మనాయక సైన్యము రూపుమాయ కుండఁ గాపాడుకొమ్ము.

దమ్మ—కుబుసము విడచిన గోడ్రాఁచు బాముతో నాటలాడునటుల నాముందు దురహంకారోక్తుల బయటపెట్టుచున్నాఁడవా! సందేశము భంగమగునేమో యని నిన్నింతవఱకు క్షమించితిని గాని శక్తిహీనుఁడనై యూఱకుండలేదు. క్షత్రియరక్తమును మా వెలమకత్తులు పానము జేసి చాలకాలమైనది. నాఁడనపోతు నాయకుడు తనతండ్రికిఁ దర్పణాదులనొసంగుట కినుగుర్తిదుర్గ సమీపమున నూటొక్క క్షత్రియులగంఠనాళములఁ ద్రెంచి భూత

తృప్తిఁ గావించెను. నేఁడు మరల రాజ్యలక్ష్మికిఁ దర్పణాదులొసంగుటకు వేంకటరంగారాయఁడా వ్రతమును బురశ్చరణ గావింపనున్నాఁడు. భారతీయుల రక్తముతో భగతమాత నెటులఁ బూజింపవలయునో తెలియక నవనాగరకులు నిన్ను రణరంగమునఁ బరిత్యజించినను బూర్వాచారపరాయణుల మగు మే మా వీరవ్రతము నియమబద్ధముగ నొనరించి భూతప్రేతపిశాచాదులఁ దనుపఁగలము.

మ॥ పరబాధాచరణాను భావులగు నీ ♦ పాశ్చాత్యులన్ గూడి, దు
ర్భర సంగ్రామ నిబద్ధమానసుఁడవై ♦ రాకుండ నీ శీర్షమి
త్తఱిఁ జెండాడి మదీయ మాతృధరణీ ♦ దైన్యంబు వారింతు ని
ల్వర శ్రీతాంధ్ర కులాబ్ధిచంద్రుఁడగు బా ♦ పారాయఁడౌనౌనన్
(విజయరామరాజును గత్తితోఁ బొడిచి బుస్సి హైదరుజంగులఁ గాంచి) ఓ అరాతులార!

ఉ॥ పోరగ శక్తియున్న యెడ ♦ బొబ్బిలికోటకు రండు, రిత్తగా
బీరపుమాటలాడినను ♦ ప్రేలిన లాభము లేదు, విక్రమా
కారులు పద్మనాయకులు ♦ గత్తులనూరుచున్నవారు దు
ర్వైరి చమూసమూహమును ♦ స్వాగతమిచ్చి బహూకరింపఁగన్॥

దమ్మ—(తనలో) ఇప్పటికి వచ్చినపని తీఱినది. సంధి సర్వవిధముల భంగమైనది. యుద్ధమె నిశ్చయమని తేలినది. ప్రాణములతో బొబ్బిలికోటకుఁ జేరి యిచ్చటి విపరీతపరిణామములన్నియు నట నెఱింగించువఱకు నేనీ విరోధిబృందమునకుఁ జిక్కకుండ జాగరూకత వహింపవలయును. కావున నే నిట నిలుచుట యుక్తము కాదు. (పోఁబోవును)

హైద—అరే! కిదర్ హైరే, లాడూఖాన్, జానూఖాన్, సిద్దిబిలాల్, మాహమ్మద్ హుసేన్, దమ్మన్నసాబ్ పోతూవుంది. పట్కో పట్కో. జేగీ. జేగీ.

దమ్మ—ఈశూరంమన్యుఁడు నన్నెదిరింపఁజాలక సేనానాయకులఁబిల్చుచున్నాఁడు. వాండ్రు నన్నెంతవఱకు వెంబడింతురో యెటులఁ బ్రతిఘటింతురో చూచెద.

(దామెరదమ్మన్న నిష్క్రమించును)

విజ—(కత్తిఁదీసికొని) ఏఁడీ. దమ్మన్న. యెటుపోయినాఁడు. కానరాఁడేమి?

శా॥ గర్వాతీతవిరోధిభూరమణహృ ♦ త్కీలామిషాస్వాదనా
ఖర్వప్రాభవ భాసమానమగు మత్ ♦ ఖడ్గంబుచేఁ జెండి, నా
దుర్వారోగ్ర పరాక్రమానలమునం ♦ దుగ్ నిన్ను వేల్తుగ్ శ్రమః
పర్వంబుగ్ బొనరింతు మామకయశః ♦ ప్రఖ్యాతి దమ్మాహ్వయా॥

(లేవఁబోవును)

(దిక్కులఁజూచి) ఎచ్చటకుంబాఱిపోయె !కానరాఁడేమి ! దమ్మన్నా! దమ్మన్నా!ఈవ్రేటునుగాచుకొమ్ము. నీశిరమీవ్రేటుతోఁ బడితీఱును.

హైద—దమ్మన్నాసాబ్ బొబ్బిలికీపోయిందీ ! ఇంకా ఆయనపైనా నీకి కోపంయెందుక్కు. ఆయన వస్తాదువుండాడు. కోపం మస్నీవుండాడు.

బుస్సి—దాఁటిపోయినవానింగూర్చి పరోక్షమున భాషించుట యుక్తముకాదు. విజయరామరాజా ! నీకేమి గాయములు తగులలేదుగద ! బొబ్బిలివారు ద్రోహులవలె నున్నారు.

విజ—మీయనుగ్రహమువలన నాకుఁ గాయము తగులలేదు. కాని కొద్దిగఁ గత్తి గీచుకొనిపోయినది. బొబ్బిలివారు తమప్రాణములనేని లక్ష్యపెట్టరనియు నెంతవారలనేని దిరస్కరింతురనియు ఁదమ కిప్పటికి బోధపడియుండును. కేవలము బరాక్రమమును విశ్వసింపక ప్రాణాపాయమునకు వెఱవక యుక్తాయుక్త

విషయములలో సైతము స్వబుద్ధి వినియోగింపక విజృంభించు నీపద్మనాయకు లవశ్యము శిక్షార్హులు.

హైద—బొబ్బిలివాండ్లకి మంచీసాహసం వుంది. వాండ్ల ప్యాణం తీపి లేదు. దమ్మన్నసాబ్ ! ముసిలివాడు అయ్యిగూడ బాతీఆడినట్లు ఆడాడు. అచ్ఛా.

బుస్సి—విజయరామరాజా ! ప్రాణములకేని తెగించివచ్చిన దమ్మన్నతో నీవు వాగ్వాదములుగావించుట గొప్పదోషము. ఇంకనతఁ డనుభవజ్ఞానముఁగల యోగ్యుఁడుగాన నూఱకుండెను. లేకున్న నెంతటి సాహసకార్యమునకేని జొచ్చియుండును.

హైద—హుజూర్‌సాబ్ ! నీదిబాత్ సచ్‌వుంది. అచ్ఛామాట శెప్పావు.

విజ—ఏమో మిగిలినదానింగూర్చి ప్రసంగించిన లాభములేదు. ఇఁక ముందేని బొబ్బిలివారిని నిర్బంధింప మనమందఱము సిద్ధపడవలయును. ఓ బుస్సిప్రభూత్తమా ! బొబ్బిలివారి యహంకారమును జిత్తగించితిరికదా ! ఎవఁడో యనపోతానాయకుఁడఁట. క్షత్రియవంశము నిర్మూలముఁగావించెనఁట.ఇటులెమనల నిర్మూలింతురఁట. ఈముచ్చటలతోనే మనముపద్మనాయకుల యందు నేఁటికాలమునఁగూడ ననపోతనాయకునినాఁటి ప్రతిభ కలదని భ్రాంతిపడుదుమా? ముందు పద్మనాయకవీరుల బంధీకృతులఁ గావింపవలసినదే? తద్రాజ్యము వశముగావించుకొనవలసినదే. బొబ్బిలివీరులు యుద్ధమునకు సన్నద్ధులు కాకముందె మనము హఠాత్తుగ ముట్టడించినచో నిరంకుశముగ రక్తపాతములేకుండ జయింపఁగలము.ఇంతియగాక

సీ॥ రావు వేంకటరంగ ♦ రాయుని, మామక
సేనావిధేయునిఁ ♦ జేయవలయు
బొబ్బిలి సంస్థాన ♦ మును, బద్మనాయక
పాలనమున కెడఁ ♦ బాపవలయు

ఆంధ్రపాపారాయు ♦ దర్పంబు క్షత్రియ
వీరవశంబుఁ గా ♦ వింపవలయు
వెంగళరాయు దో ♦ ర్వీర్యంబు శాత్రవ
సైనికబద్ధంబు ♦ సలుపవలయు
తే॥ గీ॥ విజయరామావనీశ్వర ♦ నిజభుజాప్ర
సంగమును లోకమందెల్ల ♦ సాఁటవలయు
బుస్సినరపాల! దుర్వైరి ♦ పుంజహరణ
సాధనమునకు యత్నంబు ♦ సలుపుమయ్య॥ 22

బుస్సి—బొబ్బిలివారిని మన్నింపము. నాదర్శనమునకు రాకపోవుటయె గాక సంధిపేరఁబెట్టి దమ్మన్నను ద్రోహకార్యమునకుఁ బ్రేరేపిన రంగారావు దండనార్హుఁడె. బొబ్బిలిరాజ్యము వెలమవారి యాజమాన్యమునుండి తొలంగించినగాని నాయాగ్రహము చల్లారదు. హైదర్‌జంగుసాహెబ్! మనము బొబ్బిలికోటను శీఘ్రముగా ముట్టడింపవలయును. రంగారాయని వశపఱచుకొనవలయును. నీయభిప్రాయమెద్ది?

హైద—వాండ్లకి మనం సిచ్చ శెయ్యకపోతే మనకీవాండ్లుప్రాణం తీస్తారు. లడాయ్కి పోవడం నాకి భోత్ ఖుషీవుంది. (చూచి) ఎవరో వస్తూవుంది.

విజ—లాడూఖానువలె నున్నాఁడు (చూచి) అగునాతఁడే.

లాడూ—(ప్రవేశము) ఆదాబ్ సర్కార్

హైద—ఏమీ! నీకిద్రేహం నెత్తుర్ అయిందివుంది. నీకీ దెబ్బతగిలిందీ లేదూ.

లాడూ—మహారాజ్ శెప్తాఁ దమ్మన్న ఘుఱ్ఱంకీ యెక్కి బొబ్బిలీకి దోవాపట్టి శుక్కాపొయ్యేటట్టు పోతావుండాడు. ఆయన్కి పట్టుకోవాలాఅని హసనల్లీ, సిద్దీబిలాల్, జానూఖాఁ నేను పోయి పట్టుకుంటే అందర్కి నెట్టిగడబిడాశేసి నాకీకొట్టి

పొయ్యాడు. నేను దమ్మన్నకి కసరత్ మీాదకత్తితో కొట్టానుజీ!

విజ—తక్కినవారల కాదమ్మన్నవలన నెట్టిగాయములు కలుగలేదుకద!

లాడూ—వాండ్లకు తోడా తోడా తగిలింది మహారాజ్. నాకీ బాగా తగిలింది. దేఖో(గాయములు చూపును)

బుస్సి—మీారలందఱు గాయములకు మందు లుపయోగించుకొని సేనలకు శిక్షలొసఁగుచుండవలయును. కొలఁదిదినములలో బొబ్బిలికోటపైకి దాడి వెడలవలయును.

లాడూ—అచ్ఛా ఆదాబ్ మహారాజ్. (నిష్క్రమింపును.)

హైద—బొబ్బిలి అద్మీలు షాలా షాహసంవాంళ్ళు వుండారు. హుజూర్కి మాట అంటే వాంళ్ళకీ తిరష్కారంవుంది. విజయరాం సాబ్‌కి సంపాలాఅని వాంళ్ళకి వుంది. మనము ఊర్కావుంటే సంపీయేసీ తీర్తారు. మనము బొబ్బిలికీ షాదూశెయ్యాలా! తీరలా!

విజ—దేవా! నావిజ్ఞాపనము నవధారుఁడు.

ఉ॥ పోటుఁదనంపుబీర ముడి ♦ వోనికడిందిని బొబ్బిలిన్, నిరా
ఘాట పరాక్రమక్రమము ♦ గస్పఁడ బాడొనరించి, విక్రమా
ర్భాటముఁజూపి మూర్ఖులగు ♦ రావుకులీనుల దాస్యకర్మకి
చ్చోటికిఁ బట్టితేవలయుఁ ♦ జూచి సహింపఁగరాదు మార్తురన్॥

బుస్సి—విజయరామరాజా! నీవు కోరినదొక దుస్తరకార్యము కాదు. బొబ్బిలివారి సాధించుట మీాకంటె మాకవశ్య విధాయకము. మేము వీరిని సహించినచో నితరరాజులు కప్పము లొసంగుదురా! దర్శనమునకువత్తురా! ఈవిషయమై సందేహముపెట్టుకొన నవసరములేదు. ఒక్కఫిరంగిదెబ్బతో బొబ్బిలికోటకూలఁగలదు! హైదర్‌జంగ్! సేనలు యుద్ధమునకు సిద్ధముగనున్నవా!

హైద—మనదీ షేనా అంతయెక్కావలేదు. నాలుగుయేలసైన్నెం ఐదు వందల్కి పరాస్‌వొర్లువుండారు. బొబ్బిలిపైకి పోవడానికి యీా సైన్నంసాల్దు. సాల్దు.

విజ—అటులైన నావెంటవచ్చిన పదివేలసైన్యమును గూడ మీాకు

సహాయమునకొసంగి నేనును యుద్ధమునకు వచ్చెదను. అవసర మైనచో విజయనగరమునుండి యింకఁ బదివేలసైన్యమును దెప్పించెదను. మనకు సేనకేమికఅవు.

బుస్సి—ఇఁక నాలసింప వక్కఅలేదు. సేనల విభాగముఁజేసి వాంద్రకుఁ బ్రయాణముఁ జెప్పవలయును. విజయరామరాజా! నీకా బొబ్బిలి కోట కెన్నియగడ్తలున్నది, ఎన్నిబురుజులున్నది, సైన్య మెచట యుండునది తెలియునా?

విజ—నాయొద్ద బొబ్బిలిరాజ్య స్వరూపపటము కలదు. దానిని బరిశీలించిన నన్నివిషయములు బోధకాఁగలవు. బొబ్బిలికోట యొక్క బాగోగులు రహస్యవృత్తాంతములు తెలిసిన సైనికులు సైతము నాయొద్దకలరు. అడవులలోనుండి యొరుల కంటఁబడకుండ బొబ్బిలికిఁ ద్రోవఁదీయఁగల సూర్యనారాయణరాజను నొకక్షత్రియుఁడు నా సంస్థానము నందున్నాఁడు.

బుస్సి—నీవీవిషయమునఁ దగినప్రయత్నములో నున్నాఁడవుకావున నిది యొక దుస్తరకార్యముకాదు. నీయాంధ్ర సైన్యమునకు నీవధిపతిగ నుండుము. నలుగురు పరాసుసర్వసేనానాయకులను కొన్ని యాయుధములను నీకు సహాయమొసంగుదును.

హైద—ఆలస్యం. అమృతంకీయిషంఅని తెలింగే శాస్త్రంవుంది. పోదాంరాండి బొబ్బిలికోటకి చూర్ణంకీ చూర్ణంశెయ్యాలా.

విజ—మీరు తలంచిన బొబ్బిలికోట సాధించుట యొకలెక్కా.

బుస్సి—రండు పోవుదము. ముందు సైన్యమును జూడవలయును.

నిష్క్రమింతురు
ద్వితీయాంకము
సంపూర్ణము.

(7)

శ్రీరస్తు.

పాపారాయనిర్యాణము.

తృతీయాంకము.

(రంగారావు, వెంగళరాయఁడు, కాకర్లపూడి వెంకటరాయఁడు, ఇనుగంటి ధర్మారాయఁడు, చెలికాని వెంకయ్య, తాండ్ర పాపారాయఁడు ప్రవేశింతురు.)

రంగా—మిత్రులారా! దమ్మన్నగారింక సంధికార్యము నిర్వహించి గాకుంటకేది కారణము? మనప్రత్యర్థులేమేని దుశ్చింతమునకుఁ బాల్పఁడియుండరుకదా! ఆయనవలనఁ బర్యవసానము తెలియువఱకు మిన్నకుండవలసినదే!

శా॥ అన్యోన్యంబుగనున్న యాంధ్రనృపులం ♦ దంతర్విరోధక్రుధా
విన్యాసంబుజనింపఁజేసి భరతో ♦ ర్వి౯సంగ్రహింపంగ దా
ర్జన్యంబు౯బొనరించుచుండిరి విదే ♦ శక్ష్మావిభుల్ — రామరా
జన్యుండీ విషయంబెఱుంగఁడె యప ♦ స్మారుండో యున్మత్తుఁడో॥

వెంగ—సంధి సంగ్రామముగా మాఱునేమో!

చెలి—మాఱినను మాఱియుండవచ్చును. ప్రత్యర్థులేమేని రంగారాయప్రభునివిషయమైగాని బొబ్బిలివిషయమైగాని యనుచితప్రసంగ మొనర్చిరేని దమ్మన్నగారిశాంతకవచము పగిలితీఱును. అప్పుడు దమ్మన్నగారు తానుదీయరని నావిశ్వాసము.

ఇను—ఒక దమ్మన్నగారేకాదు. ఇంగితవేదియగు నేపద్మనాయకుఁడైన మనల దూషించిన వాని నెట్టివిపరీతావస్థలోనేని మన్నింపఁడు. మాతృదేశద్రోహము నాచరించు బాపాత్ములను సహించుటకు బద్మనాయకులు సమర్థులా?

కాక—ఇదిగో? దమ్మన్నగారు వచ్చుచునేయున్నారు. (తేఱిచూచి)

చం॥ కనులను గెంపుచెన్నలరఁ ♦ గాయమునిండను నెత్రుచాలికల్
కనుబడ, నెమ్మొగంబుపయి ♦ క్రౌర్యముశాంతము కందళింపఁగాఁ
దనగతిఁదానెఱుంగని వి ♦ తంబునదమ్మనగారు శూన్యచే
తనులయిమేఁగుదెంచెడి క ♦ తంబునునారయుమయ్య నెయ్యమా॥

ఇను—(చెలికాని వెంకయ్యతో) మిత్రమా ? కార్యముమిలిగినటులున్నదె. లేకున్న దమ్మన్నగారింత యుద్రేకముతోమైమఱచి యేతెంతురా?

చెలి—నాకునటులనెతోఁచుచున్నది.

(నెత్తురుగుడ్డలతో దమ్మన్న గారుప్రవేశింతురు)

పాపా—ఔరా! దమ్మన్నగారూ! ఏమీ యీప్రళయము. ఏమి యీ విపరీతము. నీమేన నెత్తురుచాలిక లగుపడుచున్నవే! ఇది విరోధులకృత్యమేనా?

శా॥ ఔరా! వైరినృపాలులార! మిము దా ♦ త్యార్థంబు ప్రశ్నింపగాఁ
జేరన్ వచ్చిన వీరవర్యు నిశితా ♦ సిన్ నొచ్చ జేయంగనౌ
నే! రాజన్యులుకారె! ధర్మము విడన్ ♦ శ్రేయంబె? గర్వంబు చే
కూర్చన్ జేయునె సద్యశశ్చటలు మీ ♦ కున్ గష్టముప్టింపచుల్॥ 3

రంగా—దామెర వంశ భూషణా! ఎట్టి దురవస్థకుఁ బాల్పడితివి.

ఉ॥ వైరముమాన్పి సంధి సలు ♦ పంగలవాఁడనటంచు నేగి యీ
తీరున నొచ్చినావె? దుర ♦ దృష్టవశంబున వైరిరాజిచే
కూరిమికాఁడ; నిన్నుగను ♦ గొన్న, హృదంతరజన్యవిక్రమ
స్ఫారతరాగ్నిహోత్రము ప్ర ♦ శాంతి వహింపక ప్రజ్వలించెడిన్॥

దామె—రాజా! ఇది దురదృష్టమని యెఱనీయకుఁడు. నాయవస్థకు మీరుకారకులుకారు. నేను నిశ్చయముగ శిక్షార్హుఁడనే. ఎటులనఁ జిత్తగింపుఁడు.

శా॥ సంధింగూర్పఁగ జాలనైతినని నీ ♦ చంబైన దేహంపు సం
బంధంబున్ విడనాడనోడితి, న ♦ నల్పప్రాభవోపేత గ

ర్వాంధీభూతమనస్కులీ పురముపైఁ ♦ బ్రజ్ఞాబలాహంక్రియా
స్కంధావారము నిల్పనుండి రెటులీ ♦ కాలుష్య మీక్షించెదన్॥ 5

పాపా—ఏమీ! సంధిప్రయత్నములు వ్యర్థమయ్యెఁగా. ఔను బుస్సి హైదరుజంగులు సంధికియ్యకొందురా? ఇయ్యకొనిన విజయరామ రాజుఆజ్ఞకొననిచ్చునా? విజయరామ భూపాలున కంత్యకాలమునకె యీదుర్బుద్ధులుపుట్టుచున్నవి. ఓవిజయరామా?

చం॥ మొఱకుతనంబు పెంపెసఁగ ♦ బొబ్బిలికోటను ముట్టడింపఁగాఁ
దరియఁగవత్తువేని, నిను ♦ దారుణహేతిని గూల్పకున్న నా
కరముకరంబె? నీయురము ♦ గాఢహతిన్ విదళింపకున్న నా
శరము శరంబె? నిన్ బెనఁగి ♦ చంపక యుండిన వెల్మబిడ్డనే॥ 6

వెంగ—పరాక్రమములు పరామర్శములు తరువాతఁ జూచుకొందము. మీ సంధినియమములు ప్రతిపక్షుల కెటు లెఱింగించితిరి. వారేమని ప్రత్యుత్తర మొసంగిరి.

చెలి—మిత్రమా! ఆమూలాగ్ర మెఱిఁగింపుము.

దమ్మ—ఎఱింగింపక చేయునదేమున్నది. నేను సంధినియమముల నెఱింగింప రాజమహేంద్రవరమునకుఁ జనకమున్నె మీకడ శిక్షితుఁడైన పరిచారకుఁడు హైదరుజంగునకు బుస్సిదొరవారికి లేనిపోనివి నివేదింప వారు కోపఘూర్ణితమానసులై యుండిరి. విజయరామరాజుసందర్భములోఁ గొన్ని యీర్ష్యాజనకవాక్యముల బోధించెను. ఇంతలో నేను సందేశమును దీసికొని వారి చెంతకుఁ జేరితిని.

ఇను—మీరు రాయబారమొనర్చునపుడు బుస్సిదొరవారొక్కరె యున్న కార్యము శతవిధముల ఫలించెడిది. ఆయన చాలయోగ్యుఁడు. పిమ్మట యేమిజరిగినది.

దమ్మ—(రంగారాయనిద్దిక్కై) తామును వెంగళరాయఁడును బాపారాయఁడున్ను వచించిన వాక్కులలోని యర్థము బుస్సి, హైదరు

జంగు, విజయరామరాజులకు తెలియఁజేసితిని. హైదరుజంగు, బుస్సికి వంచనోక్తుల బోధింపసాహసించెను. అపుడు బుస్సిదొరవారు కనులెఱ్ఱఁజేసి రంగారాయుఁడు విరసుఁడనియు, మమ్ము నలక్ష్యమొనరించెననియుఁ జెప్పుచు బొబ్బిలిరాజ్యము విజయరామరాజున కొసంగెదను. మీరాజు బొబ్బిలిగోటను విడచిపెట్టెడినా? యనియడిగెను.

రంగా—తరువాత నేమిజరిగినది.

కాక—ఏమీ బొబ్బిలిరాజ్యము విజయరామరాజున కొసఁగునా? ఒసఁగువాఁడు బుస్సియా? అనుభవించువాఁడు విజయరామరాజా? ఎంతవింత! ఏమియాగడము.

చం॥ గుడులుగ వైరిభూపతుల ♦ కుత్తుకలఱ్ఱబడ రాల్చి పౌరుషా
స్పదులయి పెల్మవీరులు, ప్ర ♦ శస్తతరంబుగ యుద్ధపద్ధతుల్
ప్రిదులఁగఁ జేయువేళఁ గను ♦ పించును కూబల విక్రమాది సం
పద లిపుడేల వ్యర్థవువి ♦ వాదములో పరిపంథిభూపతుల్॥

దమ్మ—బుస్సిదొరవారు బొబ్బిలికోట విడువుమనుట కేను సహింపక యుద్రేకముచే నోడలుమఱచి విజయరామరాజు వికటభ్రుకుటీక్రూరాళుఁడై నన్నుఁదిలకించుచుండ హైదరుజంగు కనులనిప్పులొలయ నామొగము పైఁగ్రూర నిరీక్షణంబులఁ బ్రసరింపుచుండ బుస్సినిజూచి వలపినంతపన్నొసంగెదము గాని బొబ్బిలికోటను విడువమనియుఁ గోరినంతరొక్కము మీకొసంగినచో విజయనగరరాజ్యము మాకొసంగెదరా యనియు వాకొంటిని.

రంగా— మిత్రమా! నీవాక్యము లాదరణీయములు. తరువాత తరువాత.

కాక—మీవాక్యములు విజయరామరాజునకు వాగ్బంధన మొనరించియుండును. దీనికి బుస్సిదొరవా రేమిప్రత్యుత్తర మొసంగిరో వినఁగోరెద.

దమ్మ—బుస్సిదొరవారు నామాట పాటిసేయక రంగారావు బొబ్బిలికోట విడచిపెట్టి పోవలసినదె! విజయరామరాజునకు బొబ్బిలిరాజ్యము కొలుపకొనఁగవలసినదె యనివాకొనసాగెను. విజయనగరరాజ్యమును గోరెదవాయని విజయరామరాజు పండ్లఁ బటపటఁగొఱుకుచుఁ బైకిఁ గత్తిఁగొనిదూఁకె.

చెలి—ఓరీ! విజయరామరాజా! పరులరాజ్యముపై నీకెంతయాసగలదో నీరాజ్యముపైఁగూడఁ బరుల కంతయాస కలదనుకొనుము. నేఁటి బుస్సి ప్రాపకము జీవితాంతమువఱకు స్థిరమైనది కాదు. తరువాత నీకు రక్షకుఁడెవఁడు.

ఉ॥ బొబ్బిలిరాజ్యమేలుదని ♦ పొంగుచుఁ బొర్లుచునుంటి వద్దినీ
యబ్బ గడించినట్టిధన ♦ మా!యొకఁడిచ్చెడియాతఁడా ? ఒకం
డబ్బెనటంచు బావుకొన ♦ నర్హుఁడ చాలును రామరాజ త
బ్బిబ్బులు, విక్రమించి గరు ♦ వించి స్వరాజ్యముఁ గోలుపోకుమా॥

తాంద్ర—ఆపిమ్మట నెటులఁబరిణమించెను ?

దమ్మ—విజయరాముని యకృత్యములు చూడ నాకును సాహసమతిశయించి సంధి సర్వవిధముల విఫలమయ్యెనని నిర్ధారణముఁ గావించి కొని కరవాలముతో విజయరామరాజును బ్రహారముఁ గావించి గృహాభిముఖుడనై వచ్చుచుండ నన్నుఁ దుష్కులు చుట్టుముట్టి గాయములుజేసిరి. ఎటులేని మీకీ వార్త నెఱింగించి ప్రాణముల మాతృభూమిలో విడచుట యుక్తమని మిమ్ముదర్శింప నేగుదెంచితిని. సంధి సర్వవిధముల ఫలరహితమయ్యెను. యుద్ధమునిశ్చయము. ఇఁకమీచిత్తము.

రంగా—(కోపముతో) ఓయీ! విజయరామరాజా! నీయందెట్టి విపరీత భావము లుత్పన్నము లగుచున్నవి. పరుల దాస్యమునకుఁ బాలుపడుటయె గాక పరులరాజ్యమునకుసైత మాసించి కఱవరాని గడ్డికఱచి పట్టరానివాండ్ర కాళ్లుపట్టుచున్నాఁడవా! నీవెంత

రాజాధిరాజువైననేమి. అదృష్టశాలివైననేమి. ఎంత సద్వంశ్యుఁడవైననేమి! నీబుద్ధుల బట్టిచూడ నెంతటి నీచదశకేని యర్హుఁడవనితోఁచుచున్నది. ఈ రంగారాయని కంఠనాళమున నాయువుండువఱకుఁ బద్మనాయక సైన్యమున సంగవికలుఁడై ఆరోగ్యశూన్యుఁడై యొక్కసైనికుఁడేని ప్రాణముతో నుండువఱకు బొబ్బిలిసంస్థానము విరోధులకు వశము కానేరదు. కానీయము. పరరాజ్యమును విజయరామరాజునకుఁ గట్టిపెట్ట విజృంభించిన బుస్సిదొరయు, లంచపుగడ్డిమేసి పరలోకమున్నదనియెనిఁ దలంపని హైదరుజంగుమంత్రియు మాకోపానలమునకుఁ జెదలుపురుగులు కావలసిన వారె! ముఖ్యముగ విజయరామరాజె శిక్షార్హుఁడువధ్యుఁడుఁ గూడ నాతఁడే!

సీ॥ క్షత్రియ రక్తపం ♦ కమునందు జయలక్ష్మి
విజయార్థమై తాండ ♦ వించుకొఱకు
పద్మనాయకవీర ♦ పౌరుష తేజంబు
పృథ్వీస్థలమున వ్యా ♦ పించుకొఱకు
రావువంశీయుల ♦ రక్తనాళంబులు
మాతృదేశప్రీతి ♦ మనుచుకొఱకు
వెలమశూరుల చరి ♦ త్రలు భారతీయుల
ప్రాంచితకీర్తిఁ బ ♦ డించుకొఱకు
తే॥ గీ॥ ఆత్మసంస్థాన సంరక్ష ♦ ణార్థమై ప్ర
పంచమున కాయువుల సమ ♦ ర్పించుకొఱకు
పంచభూతాదికంబు లీ ♦ క్షించుచుండ
కరమునం దాల్చుచున్నాఁడ ♦ ఖడ్గమిపుడు॥

పాపా—ఓరాజా! ఇక సహింపవీలులేదు. సోమకుల పరశురాముండగు ననపోతనాయుడు ఆంధ్రదేశమున సామ్రాజ్యముస్థాపించుతఱి నేదేవి నుపాసించెనో రావుపెద్దనాయుఁడు బొబ్బిలిసంస్థానము స్థాపించునపు డేదివ్యస్వరూపిణిని ధ్యానించెనో యాపంచాక్షరీ మంత్రాక్షరవిభాసినిని దేశమాన్యను భారతమాతను మనమంద

ఱము స్మరించి రణార్థులము కావలయును. ఓపద్మనాయక వంశభూషణులారా! విరోధి రాజన్య సంహారప్రాభవాకరులారా! విక్రమ ప్రాప్త నిర్వ్యాజ కీర్తిమూర్తులారా! లెండు. ఖడ్గముల ధరింపుఁడు. మాతృదేశమును నిష్కళంకమగు భక్తితోఁ దల్లియని సంబోధింపుఁడు. కరవాలములకు మెఱుఁగుబెట్టుఁడు. మీ దేశభక్తియు రాజభక్తియుఁ బ్రకటింపుఁడు.

ఉ॥ చూచెదరేటికో వెలమ ♦ సోదరులార! విరోధిబృందముల్
బీచముడంచుఁడీ! తెలుగు ♦ బిడ్డల నెత్తురుతోడ వీరల
క్ష్మీచరణాంబుజంబుల నృ ♦ జింపుఁడు లత్తుక, ఆంధ్రతేజముల్
లోచనగోచరంబుగ వె ♦ లుంగఁగఁజేయుఁడి, విక్రమింపుఁడీ॥ 10

ఓపరాక్రమైకధనులారా! ఓప్రభుభక్తి పరాయణులారా! మఱియొక విజ్ఞప్తి.

సీ॥ వచ్చుసేనలకడ్డు ♦ పడి వినాశనముఁగా
వింప సైనికులఁ బం ♦ పింపవలయుఁ
బరిఖలపైనుండి ♦ వచ్చుమార్గంబుల
నన్నింటి తీసివే ♦ యంగవలయు
దగినయోధులకాయు ♦ ధములిచ్చి కోటగో
డలపైని బాఱుగా ♦ నిలువవలయు
సాహసస్ఫూర్తికై ♦ సమరడిండిమముల
నెడ తెగకుండ మ్రో ♦ యింపవలయు
తే॥ గీ॥ అరులవృత్తాంతముల నెల్ల ♦ నరయుకొఱకు
యోగ్యులగు చారులకు నాజ్ఞ ♦ యొసఁగవలయు
క్షణము రిత్తగఁ జనుపఁగాఁ ♦ జనదు వెలమ
శూరమణులార! మీపని ♦ చూచుకొండు॥ 11

ఇను—పాపారాయాగ్రణీ! మీవీరవాక్యములు పద్మనాయక యోధులకు బ్రోత్సాహము నెలకొల్పుచునె యున్నవి. సంధివిషయ మింత

విపరీతముగఁ బరిణమించెను. కావున విరోధులు హఠాత్తుగ నేయర్ధరాత్రిముననో మనపైఁ బడకమానరు. కావున మన మాత్మసంరక్షణమునకు నాత్మరాజ్యసంరక్షణమునకు బాలుపడ వలయునుగదా! పెచ్చుపెఱిగి విచ్చలవిడిగ మనపైఁబడనున్న విరోధిసేనాముద్రమునకుఁ జెల్లెలికట్టగ నేరినేని నియమించుట యుక్తము. దానివలన నరాతుల విజృంభణము నశించును.

వెంగ—ఈమహాత్కార్య నిర్వహణమున కేరో యెట్లుపనికివత్తురు రాజ్యమర్మ విజ్ఞానియు విపులతర పౌరుషవిభ్రాజియు విరోధి సేనా భూమిరుహ సమూహ నిర్మూలన కర్మఠఝంఝా మారుత సదృశుండునునగు పాపారాయవీరుఁడే యిందుల కర్హుఁడు. అగ్రజా! ఏల సందేహింతురు. పాపారాయు నియోగింపరేల?

రంగా—తమ్ముఁడా! నేనింతకుమున్నె విరోధిసేనల నిరోధింపఁ బాపారాయుని సైన్యముతోఁబంప సంకల్పించితినిగాని ముందు జరుగనున్న యుద్ధమునఁ బ్రధానసేనానాయకభారము నెవరు వహింతురా యని యోజించుచు నాలసించితిని. ఇపుడాసందేహమున కేటులో సమాధానము నిర్ణయించుకొంటిని. మిత్రమా! పాపారాయా! పద్మనాయక సంస్థానమునకు బ్రాప్తింపనున్న యవస్థనుగూర్చి నీకుఁ బ్రత్యేకించి చెప్పవలసినదిలేదు. సర్వము నీవె నిర్వహించుచుంటివికదా! నావిజ్ఞాపన మించుక యాలింపుము.

మ॥ అరిరాజన్యులు సైన్యసంభరితులై ♦ యాత్మీయ సంస్థాన ని
ర్భరభోగమ్ములనెల్లఁ జూఱఁగొనఁగా ♦ రానుండి రెల్లేని మా
ర్గుర మార్గంబున నడ్డగించిసమదా ♦ స్తోకారి సంఘాత సం
హరణప్రాభవ శక్తిఁ జూపఁగదవ ♦ య్యా! పాపారాయాగ్రణీ॥ 12

ఉ॥ పోరునకీవుజొచ్చునెడ ♦ బొబ్బిలికోటకు నెట్టికీడు చే
కూర్పదు వైరిసంతతికిఁ ♦ గూడదొకించుక బాగు, నీదు దో

స్సారపయోధి నీదుటకు ♦ శక్యమె బుస్సికి రామధారుణీ
దారుసకుఁ దురుద్యమని ♦ తాంతుఁడు హైదరుజంగుమంత్రికిన్॥

పాపా—రాజా! విరోధులు ముట్టడింప నేతెంతురను మాట స్పష్టమైనది. మనమందఱము ప్రాణములకుఁ దెగింపవలసినదె! అభిమానము నిల్పుకొనవలసినదె! ప్రాణమున్నంతవఱకు నైహికసంబంధములగు తుచ్ఛసుఖంబుల కాసింపక విక్రమించి విరోధి సేనాబృందమును జెండాడి వీరమరణమును సాధింతము. కీర్తి గడించుదము. లోకమున నవ్యాహత కీర్తిచంద్రికలఁ బ్రసరింపఁ జేసి బద్మనాయక పౌరుషచరిత్రములఁ గవుల రచనాంచములఁ దాండవింపఁజేయుదము. ఆంధ్రవీరుల మనోదర్పణముల బ్రతిబింబింపఁజేయుదము. వీరమాతల హృదయముల నటింపఁ జేయుదము. (యోజించి) విరోధులు మనపైకి దాడివెడలునెడ రాజాంకోట మీఁదగనె వచ్చి తీఱవలయును. కావునఁ గతిపయ సేనాసహితముగ నాకోటలో నేను గాచియుండి బొబ్బిలిరాజ్యమును గాపాడఁగలనుగాని యుద్ధసమయమున జన్మభూమిని త్యజింప వలసివచ్చెనే యని విచారమగుచున్నది.

చం॥ వినుతగుణాఢ్యులౌ వెలమ ♦ వీరులపాలిటి కల్పవల్లి, పా
వనతరమూర్తి రంగనర ♦ పాలవరేణ్యుని గన్నతల్లి, అ
ర్థినికర కష్టసంతతులఁ ♦ దీర్పఁగఁజాలిన పాలవెల్లి నాఁ
బొనరు మదీయభాగ్యనిధి ♦ బొబ్బిలిరాజ్యము వీడశక్యమే॥ 14

ఇను—పాపారాయా! యోధాగ్రేసరుండవు. దేశభక్తశిఖామణివియగు నీవు యుద్ధాంతము వఱకుబొబ్బిలి కోటను విడువదగనిమాటయే యథార్థము. విరోధిసేనల మార్గమధ్యమున నడ్డగించుట మనకవశ్యాచరణీయము. ప్రతిపక్షుల వంచించుట కిది ప్రధానోపాయము. ఇందులకు సర్వవిధముల నీవెయర్హుఁడవు. కాన నీప్రయాణ మావశ్యకము.

కాశ—తాండ్రకులాభరణా! బొబ్బిలిరాజ్యలక్ష్మివియోగమునకై జిం తనొందవలసిన యవసరములేదు. బొబ్బిలిపరిసరభూముల విడచి పోవ నప్పుడట్టివిచారమున కెడమెక్కడిది? జన్మభూమియం దంతటి గౌరవ ముంచదగినది గాన ప్రయాణము మానరానిది.

చం॥ మహితులు పద్మనాయకకు ♦ మారులు పెక్కురు ధైర్యధుర్యులై
విహరణమాచరించెదరు ♦ వీరరణాంగణమందు యుద్ధస
న్నహనము నీశిరంబువయి ♦ నగల రెట్లయినన్ స్వరాజ్యభూ
ర్వహుడవుగమ్ము మార్తురను♦బైకొనఁబొమ్ము! ప్రీతాపభూషణా॥

వెంగ—బావా! ప్రత్యుత్తరము నొసంగవేల? మౌన మర్ధాంగీకార మనియా!

పాపా—అర్ధాంగీకారము కాదు. పూర్ణాంగీకారమె. యుద్ధసమయ మున మాతృభూమిలో వెదఁజల్లవలసిన యీరక్తము పరిసర భూముల పాలుఁగావింప వలసివచ్చెననియె విచారపడుచున్నాఁ డను. మాతృక్షేమంకరమగు నేదుర్ఘటకార్యమందేని నాయుసు రులు వీడ సిద్ధసంకల్పుడనై యున్నాఁడను. అరాతుల వెచ్చని నెత్తురుతో వీరలక్ష్మిచరణముల నభిషేకముఁజేయు భాగ్య మీవెలమవీరు లందఱకుఁ గలదు. నేనె యదృష్టదూరుఁడను గాన రాజాంకోట కేగవలసివచ్చినది.

మ॥ రణరంగంబుననిల్చి బొబ్బిలిపురీ ♦ రక్షార్థమై రక్తసా
రణిఁ బాఱించు నదృష్టమీగి యెటనో ♦ రాజాముదుర్గాంతరాం
గణమందున్ వసియింపఁ దోడుపడె నా ♦ కర్మంబు మత్తేభదా
రణ పారాయణ వీరకేసరిని ని ♦ ర్బంధించె దైవంబహా॥ 16

చెలి—మిత్రమా! నీవెచ్చటనున్నను బొబ్బిలిపై నీపరాక్రమానలము ప్రసరింపకపోదు. అగ్నిహోత్ర మధోముఖముగ నున్నను ఊర్ధ్వజ్వాలల విడువకపోదు. రంగారాయుని అవలంబన

మున్నంతవఱకు బొబ్బిలిరాజ్యమున కెట్టి యు
ంమఱియు నధర్మాధిక్యములేనిది అపజయమ

కం॥ ఎట ధర్మముండునో య
చ్చటనే విజయంబుగూడ ♦ సంధిలు, ?
బెట దొలఁగునో యపజయమ
చ్చటఁ గనుపడు "ధర్మమేవ ♦ జయతి"

పాపా—రాణ్మణీ! నీయాజ్ఞ శిరసావహించి వైరులఁ జె. కోట కరుగనున్నాఁడను. నావిజ్ఞాపనముఁ జిత్తగింపు నాయకులారా! మీకిదియె విజ్ఞప్తి,

శా॥ వేయింపుండు విరోధిరాజ హృదయో ♦ ద్భిన్నైకసంధాన ?
రీయవ్యూహము, వైరిసేన కదనో ♦ ర్వీన్ గూలయోధావళిన్
డాయింపుండు ఇలబద్మనాయకుల శౌ ♦ ష్టత్వంబు నిండారఁగాఁ
జేయింపుండు రణంబు విక్రమకళా ♦ జేగీయమానాత్ములై॥

ఓపద్మనాయక కులాభరణులారా? సంగరనిపుణులారా? రాజాంకోటకుఁ బ్రభునియాన శిరసావహించి యేగనున్నా మీరలందఱు బూర్వ పద్మనాయకవీరుల పరాక్రమ జీవిత సంస్మరించి సంగరరంగ మలకరింపవలయును. ఆంధ్రదేశ మీకీర్తి చిరస్థాయిగఁజేయవలయును. మీజీవితము లాత్త శార్థమ్మె విడువవలయును.

సీ॥ స్మరియింపుడీ వైరి ♦ జన విఖండన పటి
స్థాత్ముఁడౌ బ్రహ్మనా ♦ యకుబలంబు
భావింపుడీ ఘన ♦ ప్రత్యర్థిసంహారి
బాలచంద్రకుమారు ♦ పౌరుషంబు
పఠియింపుడీ వైరి ♦ పటల మర్మచ్ఛేది
భేతాళనాయకు ♦ భీషణంబు
నర్ణింపుడీ సోమ ♦ వంశ మూలధ్వంసి

యునపోతనాయుకు ♦ సతిశయుంబు

వింపుఁడీ వెల్మ ♦ వీరవర్య
దాయ సద్యశః ♦ కావ్యగీతి
నుకులార నీ ♦ వ్యత్ ప్రతాపు
ఽగ్రామ భారవా ♦ హకులుకండు॥ 19

ొబ్బిలిరాజ్య వియోగసంతాప తప్తుఁడనగు నాకు సెల
ఓపద్మనాయక వీరశిఖామణులారా యుద్ధాంతమున
ృష్టమున్నఁ గలసికొందము సెలవు.

—(సమీపించి) మిత్రమా? పాపారాయ! మనస్థితి మిగుల
శోచ్యావస్థలోనున్నది. ఈజన్మమునఁ బునర్దర్శనభాగ్యము
లభింపనున్నదో లేదో ఒక్కమారు గాఢాలింగనమొనరింపనిమ్ము.
(కౌఁగలించికొని) అధీరవచనములతో నేమిపని?

కం॥ రాజాముకోటకరిగి ప
రాజితులు గ నరులసల్పి ♦ రావయ్యా! నీ
కే జయముచేకూరుత రిపు
రాజీ రాజీవహంస ♦ రాజమ చనుమా॥ 20

పా—ప్రభుసత్తమా! సెలవు పుచ్చుకొనుచున్నాఁడను. వెంగళరాయా
సెలవు ఉత్తమపద్మనాయక సత్తములారా నేను నిర్గమించు
చున్నాఁడను. ఆజ్ఞయిండు (ముందునకు నడచి) అకటా మాతృ
దేశ మెటుల బాఁటెద.

మ॥ జననీ! వెంకటరంగరాయనృపునా ♦ జ్ఞాశృంఖలాబంధితుం
డనురాజాముననేగుచుంటిఁగృపతో ♦ డఁబంపుమా శత్రురః
క్తనితాంతార్ద్రవిచ్ఛిత్రవస్త్రసదలం ♦ కారంబుతోనున్ననిఁ
గననేతెంచెదసంగరాంతమునఁ బ్రా ♦ ణంబున్నఁగంఠంబునః॥ 21

(ఇంచుకనడచి) బొబ్బిలిరాజ్య రమా సపర్యకు ధూరగుఁడనగు

చుంటిఁగదాయని నాహృదయమున సం
మున్నది. ఐనఁ జేయునదేమున్నది.

మ॥ భవదీయాంఘ్రి సమర్చనారతుఁడు పా ♦ పా
దవుకారుణ్యఫలంబుఁగోరి రిపుసై ♦ న్యవ్రాత ః
స్తవవీయాహవ భారనిర్వహణముఁ ♦ సాధింప
మ్మవలోకింపఁగదమ్మ బ్రోవఁగద ♦ మ్మా ఆంధ్ర

శా॥ రాజాంకోటను గావఁబోవలెనిఁకః ♦ రారండు వీ
రా? జన్యంబని జంకఁబోకుఁడు శరీ ♦ రంబుల్ తృణప్రా
రాజిల్లున్ శర హార హీర నిభనీ ♦ రంధ్రాచ్ఛ కీర్తిచ్ఛట
వ్యాజేందుప్రభ— వెల్మవీరమణులా ♦ రా? లెండు లెండీయికః
ఇదిగో! నేనుగూడ వచ్చుచున్నాఁడు. (నిష్క్రమించును

వెంగ—(నేపథ్యముఁజూచి) అన్నయ్యా అదిగో పాపారాయఁ
రాజాముకోటకు సేనాసహితముగఁ బ్రయాణమగుచున్నా
ముందు మనము విరోధులఁ బ్రతిఘటించుటకు యుక్తధర్మ
యో యోచింపుఁడు.

రంగా—కర్తవ్యమును యోజించుచునే యున్నాఁడను. ముందు
ధుల నెదిరింపఁ బాపారాయుని సైన్యసహితముగఁ బంపితిమిగ
ఇక్కార్యమువలన నాగంతుక ప్రమాదము లంతరించితీరు
ఇఁక భవిష్యత్కాల పరిణామములఁ గూర్చి యోచింపఁ
యును. విరోధు లిపుడేమి చేయనున్నది యుద్ధమున కెపు
వచ్చునది వారలకు మూలబల మెంతయున్నది తెలిసికొనినఁ
గాని మనమేపని చేయ వీలుండదు. సర్వమిదివరకె సిద్ధమై
యున్నది. చారులవలన నేమేని రహస్యములు దెలిసెనేని
యనంతర విధాయకముల నిర్వర్తించి యుద్ధరంగమునకుఁ బ
గెత్తుదము.

కాక—అదిగో! గూఢచారులు వచ్చుచున్నారు. వారల ముఖ

వినియోగింపకున్నఁ జెడుదుము. మీపౌరుషవిక్రమములు విరోధులపైఁ బ్రసరింపఁజేసి శాశ్వతయశముఁ గడింపుఁడు. సర్వసేనానాయకుఁడగు పాపారాయఁడిచటనున్న సంగ్రామిక భారమంతయు నాయన వహించువాఁడు. ఇపు డాభారము నాపైఁగలదు. సేనల విభజించి యుద్ధమునకుఁ బురిఁగొల్పవలయును. పరరాజ్యమున కాసించినందులకు బుస్సిహైదరుజంగుల ప్రాణములఁదీయవలయును. విరోధిసైన్యమును జెండాడవలయును. విజయరామరాజును వధించి తద్రక్తముచే రాజ్యలక్ష్మి చరణాంబుజంబుల నలంకరింపవలయును.

శా॥ లెండీ! బొబ్బిలియోధులార! రిపుపా ♦ లీక్లేశ సంధాన దో
శ్చండత్వంబును జూపుఁడీ; వెలమవం ♦ శ్య ప్రాజ్య కీర్తిచ్ఛటా
పాండుచ్ఛాయల భూనభోంతరములన్ ♦ బ్రాకించి విద్విణ్ణృపా
ఖండోద్రేక మడంచుఁడీ! కదన రం ♦ గంబింక భూషింపుఁడీ॥ 26

ఇను—రాజా! తాము సర్వసేనాధిపత్యము వహించిన నింక నసాధ్యమేమున్నది. తామొనరించిన సేనావిభాగముల ననుసరించి యుద్ధరంగమునకేఁగ మేముసర్వసిద్ధముగా నున్నారము. మీపై మాకుఁగల భక్తిఁ గృతజ్ఞతారూపమున వెల్లడింపవలసిన సుకృతము లభించుటచే మాజీవితములు పవిత్రములైనవి. మాఘటములలోఁ బ్రాణవాయువు లున్నంతవఱకు, విరోధులఁ గోటలోని కడుగుఁబెట్టనీయము. బుస్సి విజయరామరాజున కెటుల బొబ్బిలిరాజ్యముఁ గట్టిపెట్టునో తిలకించితీరెదము.

మ॥ కరవాలంబులఁ బూని వైరిశిరముల్ ♦ ఖండించి, తద్రక్తపూ
ర్ఖురముల్ బొబ్బిరాజ్యమధ్యమున, రా ♦ జద్వార సీమావనిన్
బరిఘాతోయములన్ బిరానఁ బ్రవహిం ♦ పన్ జేసి వీరవ్రతా
చరణీయంబుల నిర్వహించెదను రా ♦ జా! నన్నుఁ బంపింపుమా॥

చెలి—ధరణీనాయకా! పరాక్రమజ్వాలలు హృదయమున నాగక, భావము దగ్ధమొనరించుచున్నవి. విరోధుల వధించువఱకు

కోపానలము చల్లారదు. హృదయసంతాప ముపశమింపదు. కదనరంగమునఁ బద్మనాయకవీరతేజముఁ బ్రసరింపఁజేయ నను జ్ఞాపింపుఁడు. వీరపదవి సాధింతుము. లేదా వీరమరణము సాధింతుము.

చం॥ రణమున వైరిభూపతుల ♦ రక్తముతోడఁ ద్రిశుద్ధిగాఁగఁ ద
ర్పణమొనరించి మాన్యయగు ♦ భారతమాతను దన్పువాఁడ భీ
షణ కరవాలధారకు విజాతినృ ♦ పాలక రక్తధార భూ
షణమొనరించువాఁడ నను ♦ సంగరభూమికిఁ జేర్పఁగోరెదన్॥ 28

కాక—నృపాలమణీ! విరోధిరాజ ఖండన చణుఁడగు నీకాకర్లపూడి వేంకటరాయఁడు కదనోత్సాహము వారించుకొనఁజాలక విన్నవించు విజ్ఞప్తి నాలింపుఁడు.

చం॥ కదనము ప్రేతభూమియయి ♦ కన్పడ, వైరులయుత్తమాంగముల్
మెదడులు, కండలున్, దొడలు ♦ మేనులు రాసులు రాసులై భయం
బొదవఁగఁ జేయువైఖరిని ♦ యుద్ధమొనర్చెద, విక్రమక్రమా
స్పదవిభవంబుఁ జూపెదను ♦ పంపుము నన్ను దురంబుఁ జేయఁగన్॥

దమ్మ—రాజవతంసా! విరోధుల యుద్ధమునకు రమ్మని పిలిచివచ్చితిని కానఁ బ్రతిఘటింప నేగుట నాకుఁ గర్తవ్యము. నాకరవాలమునకు విరోధులహృదయములకుఁ గల పూర్వపరిచయము మఱలఁ గ్రొత్తజేయ మనసగుచున్నది. కదనరంగమున విరోధుల వక్షస్థలములఁజీల్చి రాజ్యలక్ష్మి కభిషేకము గావింపవలయును.

మహాస్రగ్ధర.

ప్రళయోద్యద్ద్రావకీలా ♦ ప్రచయతులితమా ♦ బాణసంఘంబుచే వై
రులకంఠంబుల్ విదల్తున్ ♦ రుధిరమయముగా ♦ రోదసిన్ జేయువాఁడన్
నిలుమోరీ రామరాజా ♦ నిలునిలుహోయిదర్ ♦ నిల్వుమా బూసియన్ బ
ల్కులు బ్రహ్మాండంబునిండన్ ♦ గుటిలరిపు శిరః ♦ కోటిఁ జెండాడువాఁడన్॥

రంగా—మిత్రులారా! మీస్వాభిమానమునకు దేశభక్తికి సంతసించితిని. మీరలందఱు యుద్ధమునకు బ్రయాణోన్ముఖులు గండు. విరోధులు కోటదగ్గఱకు రాకమున్నె వ్యూహములఁబన్ని సైనికుల సమరమునకు సర్వసిద్ధముగనుంపుడు. రాజానుచారమ్మున రాజ్యాభిషేక మెవని కేని జేయనిది రాజు యుద్ధమునకు బయలు దేరరాదు. కావునఁదమ్మునకు బట్టాభిషేకము జేసి నేనును యుద్ధమునకువచ్చెదను. మీరలు నియతధర్మములయం దప్రమత్తులై వర్తింపుఁడు. మీరు సజీవులైయున్నంతవఱకు బొబ్బిలికోటలోనికి విరోధుల నడుగుఁబెట్ట నీయకుఁడు. పూర్వవిఖ్యాతి స్మరింపుఁడు. దేశభక్తి బ్రకటింపుఁడు. ఆత్మరాజ్య రక్షణమునకుఁ బ్రయత్నించినటుల విజయరామరాజ వధావిషయంబునకుఁగూడ నేకముఖముగఁ బ్రయత్నింపుఁడు. ఆయువుచంచలము. సత్కీర్తియేస్థిరము.

మ॥ అరిరాజన్యవధావిధాన నియత ♦ వ్యాసంగులై వెల్మసో
దరులారా! వచియింతు మీకిదియ క ♦ ర్తవ్యంబు, ప్రాణంబు సం
గరరంగంబునవీడి వీరపదవిన్ ♦ గైసేయుఁడీ లేక మా
ర్తురఖండించి స్వకీయరాజ్యగత వి ♦ ద్రోహంబు వారింపుఁడీ॥ 31

("బొబ్బిలి రాజ్యలక్ష్మి!జయజయ" యనుచు రంగారావు ,వెంగళరాయఁడుదక్క మిగిలినవారందఱు నిష్క్రమింతురు.)

వెంగ—అగ్రజా! నేనుగూడ యుద్ధమునకు వచ్చెదను. నాకేల యీపట్టాభిషేకము?

రంగా—తమ్ముఁడా! పట్టాభిషిక్తుఁడవైనను అవసరమైనపుడు నీవుఁగూడ యుద్ధమునకు రావచ్చును. పూర్వాచార మవిలంఘనీయము కాన నిటులొనరింపనున్నాఁడను.

(నేపథ్యమున భేరీయములు మ్రోగును.)

వెంగ—అన్నయ్యా! సమరమనిన నుత్సాహమగుచున్నది. రణరంగమునఁ బద్మనాయకవీరులతోఁ బాటు నాశిక్షాలాఘవముఁగూడఁ

జూప వేడుకపడుచున్నాఁడ. అదిగో వెలమవీరులొనరించు కోలాహలము నాలకింపుఁడు. అదిగో వెలమసేనా నాయకుల వెనువెంటనేగు తెలగ బలిజె ఫౌజులయుత్సాహము జూడుడు. తూరణదుందుభుల నిస్వనము నా యుద్రేకము నతిశయింపఁజేయుచున్నది. మఱియు

మ॥ తతనిర్ఘాత పృథుస్వనోపమితమై ♦ ధాణంధణధ్వాన సం
యుతమై వైరిచమూసమూహ రచిత ♦ వ్యూహ వ్యథాకారియై
వితతస్వాన చలీకృతాఖిల ధరా ♦ విఖ్యాత జీవౌఘ హృ
ద్గత ధైర్యాహరణప్రవీణమయి మ్రోఁ ♦ గన్ సాగె భేరీచ్ఛటల్॥

రంగా—తమ్ముఁడా! నాకడ్డముఁ జెప్పక పట్టాభిషిక్తుఁడవు కమ్ము.

వెంగ—(విచారముతో) చిత్తము.

పరిచారకుఁడు (ప్రవేశించి)—దేవా తమదర్శనమునకు హసనల్లీఖాన్ అనుమహమ్మదీయుఁడు వచ్చి ద్వారమున వేచియున్నాఁడు. ఏమి సెలవు?

రంగా—(స్వగతము) ఇతఁడు మనప్రతిపక్షుల దూతయని తోఁచుచున్నది. ఎట్టివార్తనైన వినవలసినదేకదా (ప్రకాశముగ) శీఘ్రముగఁ బ్రవేశపెట్టుము.

హస—సలాం సర్కార్ రంగారావుసాహేబ్

రంగా—(ఎదురేగి పీఠముఁజూపి) మీరు బుస్సిదొరవారి సైనికులలోనివారని తోఁచుచున్నది. ఏమి విశేషములు? సెలవిండు.

హస—మహరాజ్! మీరు లడాయ్కి బాజాబజాయించారని మాహుజూర్ హైదర్ జంగుసాహెబు యిని ఆపిమెయ్యమనిన్నీ బొబ్బిలికోట యిడ్చిపెట్టిపొమ్మనిన్నీ చెప్పమన్నాడు. ఆపిమెయ్యకపోతే లడాయిజరిగితీర్తుందిఅంట.

వెంగ—మీమహారాజుగారిపుడెచటనున్నారు?

హస—బొబ్బిలికోట పట్టుకోవాలా అని పైస్నెంతో వచ్చి దేవుల్ పల్లికి దగ్గ వున్న తోట కాడ లష్కర్ తో వుండాడు. ఈయాల సాయం కాలం వచ్చాము.

రంగా—మహమ్మదీయా! మనలోనిమాట. పూర్వము నుండియు యుద్ధములలో మాకుఁ బౌరుషచిహ్నాగ నుపయోగింపఁబడు నీభేరి నిపుడేల ప్రయోగింపకుండవలయును. ఇటులఁ జెప్పుటకు మా పైఁ బ్రతిఘటించిన మీహుజూరున కెట్టియధికారమున్నది. మేము యుద్ధమునకు సర్వసిద్ధముగానున్నారము. బొబ్బిలికోటను విడచిపెట్టిపోము. ఈవర్తమానము మీప్రభువున కెఱింగింపుము.

హస—అదిమా హుజూర్కి నిర్లవ్వం శెయ్యటం అని శెప్పమన్నాడు జీ.

వెంగ—మీప్రభువును మేము నిర్లక్ష్య మిపుడు చేయుట యేమి. విజయరామరాజు దుర్బోధనవిని మాపై కెప్పుడుకత్తి కట్టెనో నాడె నిర్లక్ష్యమొనరించితిమి. ప్రాణములకుఁ దెగించిన మాకీ హితబోధలతోఁ బనిలేదు.

శా॥ ముష్టాముష్టినిబోరి మ్లేచ్ఛనివహం ♦ బున్ బట్టిబంధించి, వి
స్పష్టాహంకరణాతిరేక వితత ♦ ప్రజ్ఞాబలప్రాభవా
వష్టంభంబులఁజూపి, వైరులను జం ♦ పఁగా జావనున్నార మే
కష్టంబేనియు లక్ష్యపెట్టము సురుల్ ♦ కంఠస్థమైయుప్పచోన్.

రంగా—రణభేరి నాపమనియు యుద్ధమునకు సిద్ధముగ నుంటిమనియు బుస్సిహైదరు జంగులకు దెలుపుము. సర్వము వ్యతిరేకించిన సిమ్మట రాయబారము లేల.

హస—మహారాజ్-ఏంశస్తాం హుజూర్లకి ప్యాణం దివాన్లకి చేతుల్లో వుంది. దివాన్లకి ప్యాణం లచంలో వున్నది. నేను ఏంశస్తాన్ జీ వాంళ్లకి యిష్టం మీకీయిష్టం.

వెంగ—మారాజ్యమునకు మేము సర్వస్వతంత్రులమనియు నిట్టిసందేశ

ముల లక్ష్యపెట్టమనియు మీప్రభువులకుఁ దెల్పి చేతనైనపని చేయుమనుము.

హస—అచ్ఛా అట్టాగె శేస్తాము. ఆదాబ్ సర్కార్.

(నిష్క్రమించును).

రంగా—సోదరా! రేపటి సూర్యోదయమునకు దప్పక విరోధులు మనకోటముట్టడింతురనియు, దాపునకు వచ్చిరనియు యుద్ధము జరిగితీరుననియు హసనల్లిఖానుని వాక్యములవలన స్పష్టమైనది. నీకు బట్టాభిషేకము ముందొనరించి పాపారాయునిరమ్మని వార్తఁబంపి నేనుయుద్ధరంగమున కరుగవలసియున్నది. పోదము రమ్ము.

వెంగ—పాపరాయునికి వెలచి విరోధులు దొంగత్రోవలఁ జూచికొని యుందురు. రాజాంకోటమీదుగావచ్చి రేని విరోధిసేన్యయిదివఱకె నామమాత్రావశిష్టము గావలసినదే. విజయరామరాజు తను గలిగి మెలఁగుచున్నాడు. ఇఁక రాజాముకోటను గాచియుండనవసరములేదు. విరోధులు సమీపమునకు వచ్చిరిగానఁ బాపారాయని బలముతోఁ బిలిపింపవలయును.

(నిష్క్రమింతురు.)

తృతీయాంకము.

సంపూర్ణము

శ్రీరస్తు.

పాపారాయనిర్యాణము.

చతుర్థాంకము

రంగము. బొబ్బిలికోట.

చెలికాని వెంకయ్య—(ప్రవేశించి) వెంగళరాయనికి పట్టాభిషేకముఁ జేయుచుండి కాఁబోలు శ్రీరంగరావుగారింకను యుద్ధభూమి నలంకరించియుండరు. విరోధులు జయభేరులు వేయుచున్నారు. ఫిరంగులు కోటగోడకు గుఱిచేయుచున్నారు. సైన్యమునకు నియతస్థలము లేర్పఱచుచున్నారు. పద్మనాయకసైనికులు విరోధులపై కుఱుకనున్నారు. ఉభయసేనా సమయుద్ధమున కొకత్రుటికాల మంతరాయమున్నది. అదిగో పద్మనాయకసేనానాయకులు బలముగూర్చుకొని దిక్కుల నరికట్టుచున్నారు. ఇఁకఁ బ్రభువర్యుని యనుజ్ఞయే యవశిష్టము (చూచి) అదిగో; రంగారాయనృపుఁడు వచ్చుచున్నాఁడు. ఆయన సెలవందిగాని సైనికుల యుద్ధాభిముఖులుగఁ జేయవీలుండదు.

రంగా— (ప్రవేశించి) మిత్రమా? యుద్ధవిశేషము లేమేనికలవా?

చెలి—పరాసుసైనికులు వ్యూహములఁదీర్చికొని మనపైకి రానున్నారు. సేనానాయకులు మీయాజ్ఞకొఱకునిరీక్షించుచుమీరాక కెదురు చూచుచున్నారు.

రంగా—మిత్రమా! విరోధులు మనపైకి వచ్చినవెంటనే భారతమాతకు వందనములొనరించి మనసేనానాయకులను కదనరంగమునకు సిద్ధపడుమని తెల్పుము. నేనీయున్నతమగు బురుజెక్కి సర్వసైన్యమును దిలకించుచుందును.

చెలి—చిత్తము సెలవుఁ బుచ్చుకొందును. (నిష్క్రమించును)

రంగా—బుస్సిదొరవారు బొబ్బిలికోటను బట్టుకొనుటకు నాలుగువేల కుంఫిణి సిపాయిలతోడను ఐదువందలమంది యూరోపియనుల తోడను వచ్చెననియు బదివేలసైనికుల విజయరామరాజు సహాయముగా నొసంగెననియు నేనువినినమాట యథార్థము. ఇంత సేనను స్వల్పసంఖ్యాకులగు మనసైనికు లెటులనిర్జింపఁగలరో చెప్పఁజాలను. తమసైన్యమును నాలుగుభాగములుగఁ జేసి యొక్కొక్కసేనాభాగమునకు గొన్నిఫిరంగులు కొన్నియాగ్నేయాస్త్రములు చొప్పున బంచి బుస్సిదొరవారు సమరముచేయించుచున్నారు. అకటా! ఎంత ప్రళయసమర మగుచున్నది. (ముందునకుఁచూచి) ఓవీరవర్యులారా! ఓపద్మనాయకులారా! మీ నియతస్థలంబుల గడుజాగరూకతతోఁ గాచి కొనుఁడు.

మఱియు.

సీ॥ దామెరదమ్మన ♦ ధరణీశ! తూరుపు
బురుజుచెంతకు సేన ♦ మఱలనిమ్ము
కాకర్లపూడి వెం ♦ కటరాయ పడమటి
దిశకుసిపాజును ♦ ద్రిప్పికొమ్ము
చెలికాని వెంకయ ♦ క్షితినాథయుత్తరం
బునకు సీదళమును ♦ జనఁగనిమ్ము
ఇనుగంటి ధర్మయ ♦ జనపాల దక్షిణం
బునకు నీసైన్యంబు ♦ జోవనిమ్ము
తే॥ గీ॥ పద్మనాయకులార! నల్ ♦ వైపులరసి
అరుల మొగ్గరములను జెం ♦ డాడుఁడయ్య
శాత్రవులు విక్రమించిరి ♦ సత్వరంబు
సైనికాగ్రణులార! పై ♦ కొనఁగరండు॥ 1

(నలువైపులజూచి) ఓయోధాగ్రేసరులారా! మీసాహసము శ్లాఘనీయము. మీపరాక్రమము వర్ణనీయము. మీప్రభుభక్తి ప్రశంసనీయము.

మ॥ రణరంగంబున విక్రమాధిగత సం ♦ రంభంబు జూపించి, భీ
షణ శాతాసికిఁ గంఠనాళములతో ♦ సఖ్యమ్ము వాటించి, వీ
క్షణ వహ్ని ప్రసరంబుచేత నరులన్ ♦ నయ్యాటలాడించి, నా
రణభారంబు వహించు వెల్మజనులా ♦ రా? మిమ్ము శ్లాఘించెదన్ 2

(కొందఱు విరోధులు త్రాటినిచ్చెనలతో బురుజులెక్కుదురు).

రంగా—యోధాగ్రేసరులారా! విరోధులు త్రాటినిచ్చెనలతో గోట పై కెక్కనున్నారు ప్రతిఘటింపుడు. మెలకువ వహింపుఁడు. ప్రతిషేధింపుఁడు.

సీ॥ పొంగులు పలుమాఱు ♦ పొంగగాచిననూనె
వైరులపై బోయ ♦ వలయు నిపుడు
బాఱుటీ లెలఁగొని ♦ పై కెక్కగానున్న
పగతుర బొడువగా ♦ వలయు నిపుడు
చండహేతుల చిత్త ♦ జల్లుగా నొకమాఱె
పరులపై గురిపింప ♦ వలయు నిపుడు
ఉరుకు టంబలికుండ ♦ లొకకొన్ని మార్తార
పైజడియక వైవ ♦ వలయు నిపుడు
తే॥ గీ॥ బురుజులకుఁ బ్రాకుచున్నార ♦ లరులుమూఁగి
ప్రతిఘటించి ధరకుగూల్ప ♦ వలయు నిపుడు
కడగి పగవాండ్రపైఁ బాఱు ♦ గాలి నేని
బైకిరాకుండఁ జేయగా ♦ వలయు నిపుడు. 3

(బొబ్బిలి సైనికులు బురుజులెక్కువారిని గ్రిందికిఁ ద్రోయుదురు).

చెలి—ఓ విజయరామరాజా! బుస్సిదొరా! హైదరుజంగూ! మీర లెందుంటిరి. చచ్చుచున్న మీ సైనికుల కడ్డుపడ రేమి! మము బ్రతిఘటింప నరుదేర రేమి! ఓ ప్రతిపక్ష సేనానాయకులారా! దొంగ త్రోవల చూచుకొందు రేల ఇటురఁడు ఇటురండు.

ఉ॥ సంగరరంగమన్న యెడ, ♦ జంకరు వెల్మవజీరు లేలయీ
వెంగలిపాటు మిమ్ము ♦ బలిపెట్టక మానరు యుద్ధమందు, క
త్తింగొని యేగుదెందు, వెను ♦ దీయక రందు, నిలుందు మీ ప్రథా
నాంగములింక శాశ్వతసు ♦ ఖార్థులు కందు, విరోధి సైనికుల్॥ 4

ఇను—ఓ విరోధి సైనికులారా? నిలువుఁడు నిలువుఁడు. బొబ్బిలికోట విజయరామరాజునకు గట్టిపెట్టనిదె పలాయన మంత్రముఁ బఠించుచున్నా రేల? ఇదిగో మిమ్ముఁ బరామర్శింపుటకు నేను వచ్చుచున్నాడను. క్షణము సేపు ప్రతిఘటింపుడు. పద్మనాయక వీరులతో ముష్టాముష్టి బాహాబాహి పోరాడని దేవెన్నుఁ జూపెద రేల? (బురుజు దిగిజూచి) ఓహో. పారిపోవుచున్న సేనకె వ్వడో తురుష్కుఁడు ధైర్యముం జెప్పి యీ వైపునకు దీసికొని వచ్చుచున్నాడు. వీండ్రు మమ్మెట్లుఁ బ్రతిఘటించి ప్రాణము లతో నిలిచెదరో పరిశీలించెదఁగాక. (బురుజెక్కును.)

లాడూ ఖాన్—(ప్రవేశించి) నువ్వు, యెవడూ బే వుండావ్ మాకీ బయం మాకీ బత్తీ లేకుండా మాట్లాడుతావ్. దేఖో ఫీదిద్రైరంనాదీషౌరం పైకివస్తుంది. మాశక్తిమీకు తెలిసిందిలేదు. దమ్మన్నసాబ్ కి శూపాం అజే బండారీల్ మహమ్మద్ హుసేన్ అజ సిద్దిబిలాల్ అజిజా డేఖాడే, అజీ నవాబ్ హుసేన్ అల్లీఖాన్ బహద్దర్ అజిషుకురు ల్లాఖాన్. బొబ్బిలిగడీ పడో, పడో, జీ, రంగారావు బహద్దర్ సాబ్ మాది తుర్కా దెబ్బా కాసుకో

(త్రాటినిచ్చెనతోఁ గోటపైకిఁ బ్రాకును)

దమ్మ—ఓరీ! దురాత్మా? నాబురుజునకే ప్రాకుచుంటివా! రమ్ము రమ్ము నీకును నాకును రాయబారమునాటనుండి చిరపరిచయము కలదు. నిను గౌరవించుట నావిధి.

మ॥ అతిగర్వాత్ముని బుస్సినిన్ విడి, మదా ♦ యత్తాత్ముఁడౌ హైదరున్
క్షితిపైఁ గూల్పక, రామరాజుతలఖం ♦ డింపంగఁ బోకే, దురా

గతచిత్తుఁగా నినుజంపఁ జాలవిలసత్ ♦ ఖడ్గంబు రానుండె, నీ
బ్రతుకీనాఁటికిఁ జెల్లవాఱె చనుమా! ♦ పాపాత్మ! మ్లేచ్ఛాధమా॥ 5

(దమ్మన్న యీటెతోఁ బొడుచును. లాడుఖాఁ మఱికొందఱు గతింతురు.)

విజయరామరాజు——(నేపథ్యమున) ఓబుస్సినరపాలా? హైదరుజంగు మంత్రీశ్వరా! వెలమవీరుల పరాక్రమములముందు మన శక్తియుక్తు లక్కఱకురాకున్నవి. సిద్దిబిలాల్ పాఱిపోయెను. లాడుఖాఁ దమ్మన్నగారి యీటెపోటుచే గతించెను. జాఁ ఖాఁ సైన్య మంతయు దిక్కుచెడి చెల్లాచెదరై పోయెను. సేసలను రక్షింపుఁడు. సైనికులకుఁ బ్రోత్సాహవాక్యముల నుద్బోధింపుఁడు. రండు. రండు.

రంగా——ఓవిజయరామరాజా! చాటుననుండి యేదియో ప్రేలెదవేమి? పౌరుషముఁగల మగవాఁడవేని బొబ్బిలివీరులకు నీబల మొక్కింత చవిచూపుము. లేదా? పిక్కబలముఁ జూపుము. పరాక్రమవంతమగు సత్క్షత్రియవంశమున జనించియుఁ గులగౌరముల నేల మంటిపాలుగావించెదవు?

మ॥ ప్రతిభాశాలురు పద్మనాయకులు దు ♦ ర్వారోగ్ర విక్రాంతిసం
గతులై తావక సైన్యసంహరణముం ♦ గావించుచున్నారు, దు
ర్గతిపాల్గాకుము, సైన్యరక్షణ మొన ♦ ర్పంగఁ బొమ్ము లేకున్నచో
హతమై పొమ్ము ప్రతిష్ఠతో విజయరా ♦ మా! పాపభారాశ్రమా॥ 6

ఇను——రాజా! మానవ్రత మారంభించినవాని నేలయుద్ధమునకుఁ బిలచెదరు. సేనానాయకుల కేని ప్రోత్సాహవాక్యములు వచింపమొగముచెల్లని యీవిజయరామరాజు రణరంగమున నిలచునా? ఎంతబలము కలవాఁడైననేమి? ఎంత సైన్యము కలవాఁడైననేమి? హైదరు జంగు బుస్సిగార లెంత ధైర్యముఁ జెప్పిననేమి. బొబ్బిలివీరులనిన విజయరామరాజునకు సింహస్వప్నమే! హృదయశల్యమే!

కం॥ మన కాఱుకోర్వక మో
ముమునఱలిచి నిలువలేక ♦ మూలలఁ బొలువా
నిని యుద్ధమునకుఁ బిలువఁగఁ
జనునే యిది నిక్కువంపు ♦ సాహసమగునే॥ 7

మహురుల్లా——(ప్రవేశించి) ఈతద్వ బొబ్బిలికోట ముక్కల్కీ ముక్కల్ చక్కల్ కీచక్కల్ కావాలవుంది. పిరంగికి గట్టివుంది. సైతో కోటకుగట్టివుంది తెల్వాలా! బొబ్బిలివాంళ్లకి బోత్ పొగురూవుంది అంతా బైటికి తెప్పిచ్చితీర్తాఁ.

(పిరంగులఁ గోటకుఁ బెట్టి కొందఱు సైనికులు కాల్తురు. మఱి కొందఱు కోటలకుఁ బ్రాఁకుదురు.)

ఇను——ఓరీ దుర్మార్గులారా! మురిదు మీచావుఁ దప్పించికొని కోటగతి విచారింపుఁడు. పద్మనాయకవీరుల విక్రమములముందు మీ జీవితములు బుద్బుదప్రాయములైయుండ వినాశకాల మ్మేల కొని తెచ్చికొందురు? విక్రమింతురా? వెన్నుచూపుదురా?

(పిరంగులు మ్రోగును. కోట పగిలిపోవును. వెలమవీరులు విరోధి సైనికులు సమయుద్ధ మొనరింతురు)

విజయరామరాజు——(నేపథ్యమున) ధన్నీలాస్ కుప్పీ. మీరిరువురు బలిష్ఠములగు ఫిరంగుల సింహద్వారమున కభిముఖముగ నెడతెగకుండఁ బ్రేలింపుఁడు. మర్తెఁ ధరాస్ లీలాన్, మీరు సేనతో మహురుల్లాఖాఁ భేదించిన పశ్చిమదుర్గమును ఛేదించి కోటలోనికి మార్గముఁ జేయుఁడు. బురుజులు పడునంతవఱకు బొబ్బిలికోట మనకు వశముగాదు. ఇదిగో నేనుగూడ వచ్చుచున్నాఁడను. పిరంగులుగాల్చుఁడు.

(నేపథ్యమున పిరంగులు మ్రోగును. కోటపగిలిపోవును).

రంగా——ఓవీరమాతలారా! ఓవీరకాంతలారా? మఱిగఁ గ్రాఁగిననూనెల సైనికులకందీయుఁడు. కళకళక్రాఁగు వేడియంబలి కుండల కోట

మీఁదినుండి సైన్యముపైకి దొర్లింపుఁడు. ఓవీరమాతా! నీవొనరించుకార్యము ప్రశంసనీయము. నీవు చల్లినకారపుంబొడివలన విరోధిసైన్యమంతయు గ్రుడ్డిదైపోయెను. విరోధులీయంధత్వము వలన దిక్కులు తెలియక తమ్మఁదాము కాల్చుకొని మడియుచున్నారు. ఓతెలగవీరులారా! కోటలకెగఁబ్రాఁకు మ్లేచ్ఛుల వధింపుఁడు. ఓవెలమవీరులారా! ఆవచ్చుచున్న సైన్యమున కడ్డుపడుఁడు. ఓరెడ్డిసేనానాయకులారా! ముందునకు రండు.

(నేపథ్యమునఫిరంగులు మ్రోగును)

రంగా—ఓవిరోధులారా! ఓప్రతిపక్ష సేనానాయకులారా? ఇప్పటికి గోట బగులఁగొట్టి ద్వారమును గావింపఁగలిగితిరా? కానిండు. మీరాద్వారము నెటులవశము గావించుకొందురో చూచితీరెదను. ఓవెలమవీరులారా? ఓసేనానాయకులారా? ఓసైనికలారా? కోటగోడలపైఁ గొలఁదిసైన్యమునుంచి విరోధుల లోనికిఁ బోకుండ నీద్వారమున కడ్డుపడుఁడు. ఓవిజయరామరాజా! మురియకుము. మురియకుము. ఇంతవఱకు విజయము మాయదియెయని భావింపుము.

తే॥ గీ॥ బురుజు కూలినమాత్రానఁ ♦ బోయెనొక్కొ
గురుతరంబైన బొబ్బిలి ♦ కోటసొబగు
వివిధ శాఖోపశాఖలు ♦ వెలయుమావి
కొమ్మయొక్కటివిఱిగిన ♦ గొఱఁతఁగను నె॥ 8

విజయరామరాజు—(నేపథ్యమున) ఓయోధాగ్రేసరులారా! ఓపరాసు సైనికులారా! ఈప్రాగ్దిశలోని కోటగోడకుఁ గూడ ఫిరంగులు గుఱిపెట్టికాల్పుఁడు. ఇకబొబ్బిలికోట వశమైతీరును. కోట వశమైనయెడల భటుల సంహరించుటయు విజయధ్వజము స్థాపించుటయు సులభసాధ్యము.

(నేపథ్యమున ఫిరంగులుమ్రోగును)

(రంగస్థలమందలి కోట పగిలిపడిపోవును)

రంగా—ఓసేనానాయకులారా! బురుజుల కాచుకొనుఁడు. ద్వారములనిరోధింపుఁడు. విరోధులఁ గోటలోనికిఁ జొచ్చకుండఁ బ్రతిఘటింపుఁడు. అదిగో బుస్సిదొర సైన్యము పశ్చిమ దుర్గమును భేదించుచున్నది. జాడీఖాన్ అమీరుజా, అధికసైన్యముతోఁ గోటభేదించి గోడలఁ బగులఁగొట్టి లోనికిఁ బ్రవేశించుచున్నాఁడు. కాకర్లపూడి వెంకట రాయఁడుగారూ! మీరా బురుజును మెలకువతోఁ గాచికొనియుండి కొంతసైన్యమును ద్వారముల నిరోధించుటకు నంతఃపురమునఁ బ్రవేశించుసైన్యమును బంధించుటకుఁ బంపుఁడు. కోటలోనికి విరోధిమాత్రుని ప్రాణమున్నంతవఱకుఁ బోనీయకుఁడు.

(లోనఫిరంగులుమ్రోఁగును)

దమ్మ—ఓప్రతిపక్షిసైనికులారా! ఓవిరోధిసేనానాయకులారా! పద్మనాయకవీరుల కంఠమునఁ బ్రాణమున్నంతవఱకుఁ గోటలో మిమ్ములనడుగుపెట్టనీయము. ఆద్వారమున నడుగుపెట్టిన మీకందఱకు సంఘమరణము సర్వసిద్ధముగనున్నది. ఓసైనికలారా!

లయగ్రాహి.

చండతరహేతిఁగొని ♦ కండలనుశల్యములు
తుండెములుజేసెదని ♦ యుండు ననుగెల్వన్
ఖండపరశుండయిన ♦ దండధరుఁడైన గిరి
ఖండనచణుండయిన ♦ గండుకలవాండ్రే
దండునిటు త్రిప్పి చన ♦ కుండుఁ డెదధైర్యము వి
డుండు మిముఁడుస్మెవప ♦ దుండు చనఁబోకుం
డుండుఁడు భవత్శిత ♦ ఖండములు తుండములు
చెండెదను వెన్నొసఁగ కుండుఁడు నిలుండీ॥ 9

రంగా—దమ్మన్నగారు! మీసాహసము సంభావ్యము. మీసైన్యము నించుక యీశాన్యదిశకుఁద్రిప్పినఁ బ్రతిపక్షసైన్యమును గోట

లోనికిఁ జొచ్చకుండఁ జేయవచ్చును. ముందు ప్రతిపక్షుల కడ్డు పడినగాని మనయభిమానముదక్కఁడు.

(దమ్మన్న నిష్క్రమించును.)

రంగా—విజయరామరాజు పద్మనాయక సైన్యమును నుసుము చేయించు చున్నాఁడు. పద్మనాయకవీరులు పెక్కండ్రు భయంకరము లగు ఫిరంగుల కాహుతియగుచున్నారు. ఇనుగంటిధర్మారాయని సైన్యమంతయు విరోధులు చెండాడిరి. కాకర్లపూడి వెంకటరాయఁడు విరోధుల దుర్గద్వారముచెంత నెదిరించి సైన్యసమేతముగ స్వర్గమలంకరించెను. కోట పగిలిపోవుచున్నది. ఇట్టి విపత్సమయమున శరణ్యమెద్ది? కర్తవ్యమెద్ది? (నిరాశతో)

ఉ॥ బొబ్బిలిరాజ్యలక్ష్మి ! సరి ♦ పోయెను నీకిఁక నాఋణంబు, నీ
కబ్బఁగనుండె రామువను ♦ ధాధిపుకూటమి, రక్తపున్నదిన్
బొబ్బిలి పద్మనాయకులు ♦ జోదులు స్వర్గముఁజేరి రింక నీ
వబ్బెస మాచరింపఁగద ♦ వమ్మ ! పరున్ వరియించి మించఁగన్॥ 10

(అటు నిటుఁ జూచి) ఇఁక బొబ్బిలిరాజ్యము రావువంశీయుల యవలంబనమునుండి తొలంగినటులె. బుస్సిదొరవారు పశ్చిమదుర్గము భేదించి దుర్గపాలకుల వధించి కోటలోఁ బ్రవేశింప నున్నారు. విజయరామరాజు రెండువేలమంది సైనికులతో ఫిరంగులతో విజృంభించి కోటగుమ్మములఁ బగులఁగొట్టించు చున్నాఁడు. వెలమవీరుల సైన్యములు విరోధుల హస్తగతము లగుచున్నవి. విరోధులకు బలసంపత్తి చాలినంతకలదు. (చూచి) అదిగో దక్షిణదుర్గముచెంత నేదియో కలకలము జరుగుచున్నది. పరాసుసైనికులు వెలమ సేనానాయకులు చేయు నట్టహాసములు వినవచ్చుచున్నవి. అదిగో చెలికాని వెంకయ్యయొకె యొక తురుష్కుని తఱుముకొని వచ్చుచున్నాఁడు. ఆయనకేమైన నిజవర్తమానములు తెలియునేమో యడిగి తెలిసికొందుఁగాక.

తురుష్కుఁడు—అరేహల్లా! చెలికాని వెంకయ్యాసబ్ నాకీసంపుతూవుంది సంపుతూవుంది దేఖో! దేఖో

(తురుష్కుఁడు నిష్క్రమించును.)

(చెలికాని వెంకయ్య వెంబడించి పరుగెత్తును).

రంగా—(వెంకయ్యనాపి) మిత్రమా! పాఱిపోయిన వానిం దఱిమెద వేల?

చెలి—రాజా! నన్ను వారింపకుడు. యుద్ధధర్మముల బరిత్యజించి విక్రమించియున్న పద్మనాయకుల వరించిన యీక్రూరాత్ముని బ్రతుక నిచ్చిన పాపముగూడ వచ్చును. నన్ను బోనిండు. త్వరలో నాతని శిరంబు దెచ్చి మీపాదములముందుంచెదను.

రంగా—"వినాశకాలే విపరీతబుద్ధిః" యని నటుల నాతురుష్కున కంత్యకాలమునకే యిట్టిబుద్ధిపుట్టినది. వాని నింతతోఁ బోనిమ్ము. మిత్రమా! యుద్ధవిధమెట్టులున్నది? విరోధులకు విజయమహాభ్యమయినదా? విజయలక్ష్మి మనల బరిత్యజించి నటులేనా?

చెలి—రాజా! ఏమని విన్నవింతును? మనసైన్యము చాలవఱకు నిర్మూలమైనది. విరోధులిప్పటికి మూఁడు బురుజులఁ బగులగొట్టిరి. హైదరుజంగు కోటలోనికిఁ బోవలయునని గాఢప్రయత్నముల చేయుచుండఁ బద్మనాయక వీరులు మూర్తీభవించిన ప్రళయస్వరూపములోయన నొక్కొక్కవీరుండు పదిమంది ప్రతిపక్షులపైకి దుముకుచు మదపుటేనుగుపై లాఘవంబు జూపు కొదమసింగము కరణిఁ జెండాడుచు మండలాగ్రముల జళిపించుచు నెల్లెడల తామై ప్రాణములకుఁ దెగించి పోరిపోరి తెగినమెడలతోడను నొగిలిన తొడలతోడను జీలినమేనులతోడను వ్రాలిన ప్రేగులతోడను పగిలిన కపాలములతోడను బొగిలిన కపోలములతోడను నేలకొరగియునుసురులవీడకుండియు సంగవి కలుఁగయి యుండియుఁ గరవాలమున విసిరి పరిసరమున నున్న

ప్రతిపక్షసైనికుల జంపి తాము వీరస్వర్గము చూఱగొనుచు బగవారిచేగూడ ప్రశంసా సత్కారముల నందసాగిరి. ఇప్పటికి విరోధిసైన్యము సగమునకు బైగా నశించినది. మొత్తముమీద విజయము ప్రతిపక్షులదే. ఇంకను హతశేషులగు పద్మనాయక వీరుల్ ప్రభుభక్తి పరాయణులు చావున కొప్పుకొని విరోధుల గోటలోనికి బోకుండ బ్రతిఘటించుచున్నారు కాని కృతార్థులు కాజాలరు.

రంగా—మిత్రమా! బొబ్బిలి రాజ్యలక్ష్మికి మనకు ఋణము తీఱెనది. కలకాలమునుండి వెలమతేంద్రకుం గానాచియగు నీరాజ్యరమ పరుల వరింపనుండ నేను జీవముల దాల్పదగను. కోటయంతయు ద్రోహివలతో నిండిపోయినది. విరోధిసైన్యమింక నంతఃపురమునకుం ఉ॥ బ్రవేశించి తీరును. శుద్ధాంత కాంతల నెటుల గాపాడవలయునో యభిమానముల నెట్లు రక్షించుకొనవలయునో తోచకున్నది. (ఆలోచించి) ఇంక గర్తవ్యమేమున్నది. విరోధిసైన్య మంతఃపురాంగనల గన్నెత్తి చూడకముందె వాండ్ర జెండాడి విజృంభించి వైరిసేనాజనమును మనము హతముగావించి వీరస్వర్గమలంకరించి పీనుగులతోడను రక్తప్రవాహములతోడను నిండి ప్రళయభైరవస్వరూపమును దలపింపజేయు నీరాజ్యము విరోధుల కొరకు విడిచిపెట్టుదము. నీతలంపెద్ది?

చెలి—దేవా? మీయాజ్ఞ కర్తవ్యము. పద్మనాయకవీరుల జీవితాంతమున నంతఃపురాంగనలు దుర్దశలపాలుకాకుండ వీరోచితముగ నందఱ ఖండించి మనము కదనరంగమున స్వేచ్ఛగనటించి శాశ్వతకీర్తి గడించి వీరమరణము సాధించుట ధర్మమొకాని యీసాహసకార్యమున కెవ్వని నియోగించుదము?

రంగా—ఇకార్యమునకుం బరమాప్తుడవగు నిన్నె నియోగించుచున్నాడను. కార్యభారము నిర్వర్తించి యాహవనిర్వహణమునకు నాకుం జేయూతయొసంగుము.

చెలి—దైవమా! నాకెట్టి కష్టవిధిని సంకల్పించితివి! విధీ! నాచేత నెట్టిపౌరుషేతర కార్యమును జేయించుచున్నావు! దక్షిణహస్తమా! నీవెట్టి నీచకార్యమున కుపక్రమింప నున్నావు! ప్రభుని యాన దాటరానిది. స్త్రీవధ చేయరానిది. కాల ముపేక్షింపరానిది. నా కుచితధర్మ మింక నెయ్యది? మానుష సంరక్షణమునకీచేయం బోవు దుష్కార్యము కొంతవఱకేని యుక్తమగునే మొగాని యబలలును ముగ్ధలునునగు రాణివాసపుం జెలువలను దాక్షిణ్యశూన్యుండనై రక్తబాంధవ్యముంగల నేను చెండాడగలనా? ఉపేక్షింపంగలనా?

మ॥ కరవాలంబుధరించి నిష్కరుణమా ♦ కాంతావధాకార్య మె
క్కరణిం జేయంగనేర్తు, నెవ్విధిని నీ ♦ కాలుష్యమీడేర్తు హా
పరమాత్మా! చెలికాని వెంకయ కర ♦ ప్రాలంబ తీక్ష్ణాసికా
పరకాంతా నికురంబ కంఠ రుధిర ♦ ప్రత్యగ్రసత్కారముల్॥

దైవమా? పరమపవిత్రమగు బొబ్బిలిరావువంశమున స్త్రీహత్యలు సమకూర్చుచున్నాడవు. నాకెట్టి దుష్కార్యము నియోగించితివి. రేచర్లగోత్రీయుల రాజ్యలక్ష్మి కెంతటి ప్రళయదినము సంఘటింపంజేసితివి. ఎంత విచారకరము! ఎంత పరితాపకరము

తే॥ గీ॥ తీఱిపోవుచునుండె నీ ♦ దినముతోడ.
బొబ్బిలికి రంగరాయభూ ♦ పునకుఁజెలిమి
గాలచక్రంబ! ఎంతవే ♦ గముగఁదిరుగు
చుంటివే? యీయఘంబర ♦ యుటకు బళిరె॥ 12

రంగా—మిత్రమా! ఏల జాగొనరింతువు. ఇది యాలస్యమొనరింపందగిన సమయముకాదు. ద్వారములన్నింటిని విరోధు లాక్రమింపకముందె యంతఃపురమునకుం బ్రవేశింపవలయును. ఖడ్గమునకు శుద్ధాంతకాంతలరక్తముం జవిఁజూపవలయును.

చెలి—రాజా! ఈపాపకార్యమునకు నే నుపేక్షించిన నింక జేయువారెవరు? అవరోధస్త్రీల కేమేని గడసారి వార్తయున్న నెఱింగిం

పుఁడు. వారలకు వినిపించి పిమ్మట స్త్రీవధావిధానమున కొడం బడెదను.

రంగా——మిత్రమా! నేను ప్రత్యేకించి చెప్పవలసినయంశము లేమియు లేవు. అయినను నామాటలుగ నిటులఁజెప్పుము.

మ॥ అనురాగంబునకుఁ బ్రియంబునకుఁ బ్రే ♦ మావేశ సంసిద్ధికి
దినమే యంత్యదినంబు సాంఘికమృతిఁ ♦ దేవుండుకల్పించె-ఓ
వనితారత్నములార? ఐహికపునం ♦ బంధంబుతీఱెఁ బరం
బుననే యింక బునస్సమాగమము-త్రా ♦ వుం డశ్రుగర్భాంజలుల్॥

చెలి——ఇంక నాకు సెలవొసంగుదురా?

రంగా——ఇదిగో కత్తిఁ దీసికొని పొమ్ము (ఖడ్గము నొసంగి)

ఉ॥ జాలివహింపకయ్య కలు ♦ షంబని దీనికిఁ బ్రాలుమాలి యీ
ఖ్యాల్గునరిత్తసేయుటకు ♦ బాల్పడకయ్య! సతీమతల్లులన్
గూలుచుపట్ల నెమ్మదిని ♦ గుండు వహింపకుమయ్య గెల్వఁగాఁ
జాలమటంచు స్త్రీవధను ♦ సల్పఁగఁ బోఁగదవయ్య, నెయ్యమా॥

రంగా——మిత్రమా! నీరాకకు నిరీక్షించుచు యుద్ధరంగమున నుండెదను. వేగముగ నీకార్యము నిర్వర్తించుకొనిరమ్ము. ప్రకృతిసహజ మగు ప్రేమానుబంధమున మైమఱచి యుచితధర్మమునఁ బ్రమత్తుడవు కాకుము. నీవరుదెంచువఱకు నీసైన్యము నేను నడుపుచుండెద.

చెలి——రాజా! ఈమానవప్రపంచమును త్యజించు వఱకు బ్రేమానుబంధమును విడనాడవీలుఁడదు. సాధ్యమగునంతవరకు మెలకువతో విధాయకకృత్య మొనరించి సమ్ముఖమునకు వచ్చెదను. సెలవుపుచ్చుకొనెదను. (నిష్క్రమించును).

రంగా——ఇప్పటికి నాభారముతీరినది. తమ్మునకు రాజ్యాధిపత్య మొసంగితిని. భరించినను త్యజించినను భారమువానిది. అవరోధ

సతీమతల్లులకు విరోధులవలన హానిజరుగకుండ తగినయత్న మొనరించితిని. ఇప్పటికి సర్వవిధముల గృతార్థుడ. బొబ్బిలికోట యెటుల జీర్ణదశకు వచ్చెనోయటులె విరోధులసైన్యము గూడ జీర్ణదశలోనికి వచ్చినది. నావార్తయే చేరి సుకృతవశమున బాపారాయఁడు రాజాంకోటనుండి సైన్యసహితముగ నరుదెంచెనేని ప్రతిపక్షులసైన్యమంతయు వినాశనముఁ గావింపవచ్చును. సుకృత మెటులున్నదో.

విశ—— (నే పద్యమున).

శా॥ ఖడింపంబడెఁ గోటనల్ దెసలు పొం ♦ కంబాఱెసైన్యంబు మా
దంతుల్ దుర్గము లన్నిటిన్ దొలిచి శు ♦ ద్ధాంతస్థలిన్ జేరఁగా
నుండెన్, మీకిఁక గెల్పు చేకుఱగ బో ♦ దో రంగ రాయా!సమిత్
శౌండా! వీరుఁడ వైన నష్టపడుమా! ♦ శౌర్యంబుఁ జూపింపుమా.

రంగా——ఓహో! విజయరామరాజు ప్రగల్భోక్తులాయివి! విజయరామరాజా! మురియకుము, సంతోషింపకుము. ఈవిజయము నీయదికాదు. పరానువారలది. స్వతస్సిద్ధమగు పరాక్రమమె నీకున్న సరిహద్దులలోనున్న మాపై నింతవఱకుఁ గత్తికట్టకుండ నుందువా? నీవురాజాధిరాజువె! బలశాలివె! అపరిమిత సేనాసహితుఁడవె. ఐన ఫలమేమి? నీ[illegible]హాలు పరవంచనాకార్యమునకుఁ బ్రసరించినటులఁ బరాక్రమ ప్రచారమునఁ జరింపవు. ఆంధ్రదేశమునందలి సుప్రసిద్ధ సంస్థానాధీశులలో నొక్కఁడవయ్యు దేశీయులలో నేహూన్యహృదయుఁడేని యొడఁబడని నైచ్యమునకుఁ బాలుపడుచున్నాడవు. కావుననే నేఁడు నాపాలఁబడ నున్నాఁడవు. ఓవిజయరామరాజా!

ఉ॥ వచ్చుచునున్నవాఁడ, భట ♦ వర్గముతోడుత కాఁచికొమ్ము, నీ
యిచ్చకువచ్చినట్లు వచి ♦ యించిన మేలు లభింపఁబోదు, వి
ర్వచ్చుఁడొ భీముఁడో హరుఁడొ ♦ భార్గవుఁడో మఱిరంగరావొ యీ
వచ్చెడివాఁడఁటంచు రిపు ♦ వారము భ్రాంతిల విక్రమించెదన్॥ 16

ఓపద్మనాయక సైనికాగ్రేసరులారా! నావెంటరండు. మీసైన్యమునకు నేను నాయకుఁడనై విజయరామ భూపాలు నెదిరించెదను. పోదమ్మురండు.

(రంగారావునిష్క్రమించును.)

చతుర్థాంకము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

పాపారాయనిర్యాణము.

పంచమాంకము.

(రంగము. అంతఃపురము. మల్లమాదేవి చేటి ప్రవేశింతురు)

మల్ల—చేటీ! పిదప నేమైనది?

చేటి—ఆపరిచారకులవధించి వాండ్రవద్దనున్న జాబులఁ జూచి పాపారాయఁడు సేనాసహితముగ రాజాముకోటయందున్నటుల స్థిరముఁ జేసికొని సైన్యమునకుఁ బ్రోత్సాహవాక్యములు వచించుచు హైదర్ జంగు ద్వారములభేదింప నారంభించెను.

మల్ల—ఓసీ యుద్ధసమాచారములెటులున్నవి.

చేటి—ఇదమిత్థమని చెప్పరాని స్థితిలోనున్నవి. విరోధులందఱొక్కమాఱు బొబ్బిలికోట నాక్రమించి బురుజుల కెగఁబ్రాకుచుఁ బెక్కండ్రు యోధులఁజెండాడుచు ద్వారములభేదించుచు విక్రమించుచున్నారు. పద్మనాయకవీరులు సేనలతో విరోధులఁ జెండాడుచు బురుజుల రక్షించుచు విక్రమము ప్రదర్శింపుచున్నారు. వీరమాతలగు యువతీమతల్లులు పెక్కండ్రు బురుజులపై వసించి నూనెలఁగాచి అంబలి యుడికించియు వైరిసేనపైఁజల్ల సాగిరి. మఱికొందఱు వీరాంగనలు బురుషులకు దోడుపడి యాయుధము లందిచ్చుచు శిబిరములఁ బరికించుచు మహిషాసురమర్దనియగు మహాకాళీ స్వరూపమున నటింపసాగిరి.

మల్ల—ఇపుడు సేనల నడుపుచున్న దెవరు?

చేటి—ఎవరో నడపిన ఇదివఱకె బొబ్బిలికోట విరోధులకు వశమై యుండెడిది. వీరపురుషాగ్రగణ్యుండు విక్రమధనుండు నగు రంగారాయభూమీశ్వరుఁడె నడుపుచున్నాడు.

మల్లు—యుద్ధము కడు భయంకరముగా నున్నదికాఁబోలు.

చేటి—అమ్మా చెప్పినతీఱునా? ఎటఁజూచిన శవములె. ఏమూలఁగాంచినను మొండెములె. ఏప్రక్కనరసినను రక్తప్రవాహములె. ఏవైపాలకించినను హాహాకారములె. యుద్ధరంగ మెంతభయంకరముగనున్నదన నేరితరము.

మల్లు—ఓసీ విరోధులకుఁ గోటవశమైనదా.

చేటి—మనవి చేయుచున్నదాన. పిరంగిగుండ్ల తాఁకుచే గోటయంతయుఁ గంతలుపడసాగెను. బురుజులు రక్షించుచున్న వీరభటులు గుహాముఖమును బాలించు కొదమసింగములవలె విజృంభించి విరోధులముందున కడుగుఁబెట్టనీయక ప్రాణంబులకుఁ దెగించి పోరాడసాగిరి. విరోధులు ప్రయోగించు నాగ్నేయాస్త్రముల వలన నెట్టియుపాయము వాటిల్లునోయని మనభటులు కోటగోడలపైనున్న కప్పంతయు బెరికివైచి సంగరరంగమున వీరమరణ మందసాగిరి. హిందూసైనికులయం దెన్నఁడుఁ జూచియెఱుఁగని పరాక్రమము బొబ్బిలివారియెడల గానవచ్చుచున్నదని విరోధులు ప్రశంసఁ జేయసాగిరి.

మల్లు—నాప్రాణనాథుని మనోధైర్య మెటులున్నది? విజయము సాధ్యమని తలంచుచున్నాఁడా? నిరాశతో విక్రమముఁ జూపుచున్నాఁడా?

చేటి—విరోధుల విజృంభణము స్వసేనానాశముఁజూచి విజయముపై నాసవదలి సామ్రాజ్యసంరక్షణమొ స్వర్గవాసమొ యవశ్యకర్తవ్యమని చెలికాని వెంకయ్యగారితో నేదియో మంతనములాడి కదనరంగము నలంకరించిరి.

మల్లు—(విచారముతో) ఇఁక నెక్కడివిజయమె? మనమూఁడువేల సైన్యముపైని విరోధుల పదకొండువేలసైన్య . మెపుడుపడెనో

యపుడె బొబ్బిలిరాజ్యమునకు మనకుఁ బ్రాప్తముతీఱినది. ఇఁక మన కుచితవిధియెద్ది? అభిమాన సంరక్షణ మార్గమెద్ది?

చేటి—అమ్మా ఫలితాంశము తేటపడనిది మనము తొందరపడరాదు. ఒకవేళ మనకె విజయములభించునేమో యెవరుచూచి వచ్చిరి. గెలుపోడులు దైవికములుగదా?

మల్లు—ఓసీ! గెలుపే నిశ్చయమేని యిన్నియరిష్టములు సంభవించునా?

సీ॥ రణభేరిరవము దూ ♦ రంబుననుండి హా
హాకారములు సల్పు ♦ నట్లుతోఁచె
సిరినటించెడి యంతి ♦ పురి యంగణముల్లోఁ
బాడిండ్లరీతిఁ గ ♦ న్పడఁదొడంగె
వెలమవీరుల గృహం ♦ బులకడ్డ నపజయం
బాకృతి వహియించి ♦ నట్టులుండె
గులపాలికల ముఖం ♦ బులు మృత్యుదేవతా
నిలయంబులట్లు గ ♦ న్పింపసాగెఁ
తే॥ గీ॥ గారణములేక మదిలోనఁ ♦ గంపమలమి
యంగకములందు నీరస ♦ మతిశయించె
నతివ! బొబ్బిలికే జయం ♦ బగునయేని
వైపరీత్యంబు లిట్లు చూ ♦ పట్టఁగలవె॥ 1

చేటి—అమ్మా! మనసున నేదియో విచారమున్నప్పుడు మనము కాంచు మంచివస్తువులుకూడ వికృతముగ గానవచ్చును. దూరదృష్టి లేనపుడవి యన్నియు నాత్మీయములని తోఁచుట సహజము. మఱియు.

ఉ॥ వందురఁ బోకుమమ్మ ప్రతి ♦ పక్షుల కుంగెలు పబ్బలేదు, రా
జ్యేందిర సత్కృపా విభవ ♦ మే! మనకుంజయమిచ్చు, వైరులు
బెందర వందర సలిపి ♦ చెందుచునుండిరి వెల్మవీరు లీ
వెందులకమ్మ! యిట్లు వహియించెదు రిత్తగ శోకభావముల్.

మల్లు—మనకేది యలభ్యము. దానిపైని నిరాశాజనకములగు మనో భావము లుత్పన్నములగుట సహజము. నాహృదయమున జనించు పరితాపాతిశయమె మనకపజయము కలుగునని యుద్బోధించుచుండ నేల వ్యర్థముగ భాషించెదవు.

చ॥ వెలమకొలంపు ఱేఁడు ప్రియ ♦ వీధిని గెల్పుల నందువేళ హృ
జ్జలరుహమందు ధైర్యము పో ♦ సంగె నకారణ జన్యమై విరో
ధులిపుడు విక్రమింప నెద ♦ దుఃఖము గ్గలైద నంత, నెందుఁగా
గల విధులాశయంబునకు ♦ గన్పడసాగు యథావిధంబుగన్.

చేటి—అమ్మా! మీరింత నిరాశ నొందవలసిన యవసరములేదు. విజయలక్ష్మి యింతవఱకు వెలమశూరుల మండలాగ్రమున నటించుచున్నది, మనము దోషశూన్యులముగాన గెలుపు నందవచ్చునని మనసైనికులు భావింపుచున్నారు. ఈప్రళయసంగ్రామము నకు విజయరామరాజె కారకుడుగాన నాతనిచెంతకు మీరు కదనము మాన్పుమనియు సంధుపిలయ్యమును దొలగింపుమనియు వార్తఁబంపుట యుక్తము.

మల్లు—ఛీ! రాకాసీ! ఉత్తమ పౌరుషాభిరామమగు వెలమకులమున బుట్టి శూరచూడామణియగు రంగారాయని చెట్టబట్టి. విరోధి దుస్సాధ్యమగు బొబ్బిలిరాజ్యమునకు రాజ్ఞినైన నన్ను విజయరాముని యాచింపుమనుచున్నావా! సామ్రాజ్యము శాశ్వతముగాదు. జీవితము శ్వాశతముగాదు. నీవిట్టి విపరీతోక్తుల భాషింతువేని క్షమింపను.

చేటి—అమ్మా! నాసాహసమునకు మన్నింపుడు. ఆపత్కాలము గాన దోచక యిటుల వాకొంటిని. కదనరంగమునుండి స్థిరమగు వర్తమానము వచ్చువఱకు మీరుపేక్షింపుడు. రంగారాయ ప్రభువర్యుడు విజయ మలభ్యమని యూహించెనేని యంతఃపురాంగనల గతి విచారింపక పోడు. దైవకృప యున్న విజయము దుస్సాధ్యముకాదు.

మల్లు—ఓసీ నీవునాకిఁక గుయుక్తుల బోధింపకుము. కోట బగిలిపోవుచున్నదనియు రంగారాయ నృపాలుండు విజయముపై నాస వీడి విజృంభించుచుండెననియు దెలిసికొంటిమి. ఇక నెందులకీ పేరాస! అంతఃపురాంగనలకు దేవుఁడు సంఘమృతి విధించియున్నాడు. ఇంతకంటె నీజన్మమును సుకృతము బడయఁజాలము.

మ॥ అదిరాజన్యులు గెల్పులన్ బడసి శ ♦ ద్ధాంతస్థలిన్ జేరనుం
డిరి ప్రాణంబులఁ దాల్చుచో ఫలము లే ♦ నేలేదు, తీక్ష్ణాసి చే
శిరమున్ నాకయి నేస్రెంచి కొని నా ♦ జీర్ణాంగమున్ జ్వాలికా
పరిణద్ధంబగు లీతిహవ్యాత్రమున నే ♦ భస్మంబుఁ గావించెదన్. 4.

పద్మనాయక కులాభరణలగు నుత్తమకాంత లందరిటెంచులకు సిద్ధము కాకపోరు. విజయాంతమున విరోధులకు లభింపదగినది పద్మనాయక శిశుబాలికా కాంతాభస్మా వృతంబగు నంతఃపురము వీరవర్య శవానేక పూరితంబగు బొబ్బిలిరాజ్యము మాత్రమె ! ఓసీ!నాగారాబముల కాణాచియగు నాముద్దులయ్యనొక మాఱు తీసుకొనిరమ్ము. వానినొక్కమాఱు గాఢాలింగన మాచరించికొని నీకుఁ జెప్పదగినసంగతుల జెప్పి నాయనకు స్వర్గవాసముకొఱకు నాయంతఃకరణముచే మార్గ మేర్పఱచెదను.

చేటి—అదిగో: చిన్నబాబయ్యగారిటె దయచేయుచున్నారు.

చినరంగారావు (ప్రవేశించి) అమ్మా గుమ్మముదగ్గఱ తుపాకులు వేయుచున్నారు. నాన్నగారందఱిచేతను సాములఁ జేయించుచున్నారు. నేను చూచి వచ్చుచున్నాడను.

మల్లు—నాయనా! ఒంటరిగ నటుల బోబోకుము. తండ్రీ!ఊరినిండ బూచివాండ్రున్నారు. చిన్నపిల్లకాయల బట్టుకొనిపోవుదురు. అందుల కనిమె కోటగుమ్మములనైచి మేమందరము లోపలనున్నారము.

చిన్న—నాన్నగారు బూచివాండ్రతో యుద్ధముచేయుచున్నారు. పాపారాయుడుమామయ్య రాజాంకోటకు నెందుకుపోయి నాడు. నాకుఁ దుపాకులఁ దెచ్చుటకా!

మల్లు—నాయనా! నీముద్దుమాటల నాలకించుట కేని నోచకపోతిని. నీకు నాకుదైవమీవియోగము విధించియుండఁ దప్పింప నేరితరము (కనుల నీరుతుడిచికొని) ఓసీ! చేటీ! మాంకదళకు మరణము విధాయకమై యున్నది. ఈయాకస్మిక మరణమునుండి నాతండ్రిని రక్షించుటకు నీవుపూనుకొనవలయును.

శా॥ రంగారాయుని వంశపుఁ మొలక నీ ♦ రాకూన నెట్లైయిన నా
యంగీకారమునిచ్చగించి కుశలం ♦ బౌఅంగ, సామర్లకో
టం గూఢమ్ముగఁ జేర్చి, పిన్నతలియిం ♦ టఁ నిచ్చి రావమ్మ! యీ
బంగారయ్యయె రావువారి కులమ్మున్ ♦ బాలింపె నర్హుండగుఁ. 5

చేటి—అమ్మా! రాణివాసపు సతుల కింతలో నెట్టియాపద రాజాలదు. మీప్రాణము లశాశ్వతమని, యీపసికూనను కానని క్రంతల కంపకుడు. మనరాజ్యము చుట్టు విరోధి సేనలు నేలయీనినట్టు లున్నవి.ఎవరుచూచిన నీబిడ్డ కెట్టి విపత్తు తటస్థించునో! అమ్మా! యీశిశువును మీరె సంరక్షించుట ధర్మము.

మల్లు— ఓసీ! మేము రక్షించు దినములలో మాశిశువుల నీచేతిలో బెట్టితిమకే. నాకన్న తండ్రిని చేతులార చంప నేరక రక్షణము చేయుమని నీకొసంగఁ బ్రతికూలించెదవా? కానిమ్ము. మాతలెనే వీనికిగూడ నాయువు స్వల్పకాలము గావలయును. కాకున్న విధేయురాలవగు నీకిట్టివిపరీతాభిప్రాయము కలుగునా!

చేటి—అమ్మా? మీరుశిశువు చెంతనున్న ఆత్మహత్య మానుదురేమో యని యిటుల భాషించితిని. బిడ్డ నొసంగిన యవశ్యము సామర్లకోటకు జేర్చెదను. ఆయువున్నంతవఱకుఁ గుమారున కెట్టి యాపద రాకుండ గాపాడగలను. దేవీ!

ఉ॥ ప్రాణమురీతి నీతనయు ♦ భద్రముగాఁ గొనిపోయి యెట్లొ స్వ
స్థానము జేర్చుదాన రిపు ♦ జాల్ముల వంచనఁ జేయుదానఁ గ
ర్మానుభవంబుచే మనర ♦ హస్యము వైరులెఱింగిరేని నీ
సూనుని బ్రోచి మార్తురకుఁ ♦ జూపెద మత్కరవాలతీక్ష్ణమున్॥

మల్లు— (బిడ్డనురాదీసిఁ) తనయా! ఈ నిర్భాగ్యురాలు దురదృష్టవంతు రాలు నిన్ను విడచి స్వర్గమున కేగనున్నది. తండ్రీ! కడసారి ముద్దు నాకొసంగుము. (ముద్దుఁగొని) నాయనా! నీపైగల ప్రేమాను బంధమునేటితో తొలగించు కొనుచున్న దాన! మన్నింపుము.

సీ॥ ఆంధ్రవాఙ్మయ సేవకై నీదు ♦ సర్వస్వ
మును ధారవోసి ♦ పేర్గనగదయ్య
పద్మనాయక వీరవర్యుల ♦ విక్రమ
మహిమంబు గలనైన మఱువకయ్య
విజయరాముని జెండి వేసి ♦ యాసైత్రుచే
పిండకంబులు సమర్పింపుమయ్య
రేచర్ల గోత్రంబు ♦ నీచరిత్రముచేత
విఖ్యాతికర్హము గావింపుమయ్య

తే గీ॥ అంత్యమున నేని ♦ ఖండాంతరాగతులకు
జనువు నించుక యేని ♦ యొసంగకయ్య
జీవితమె క్షాత్రమునకె ♦ వెచ్చింపుమయ్య
పోయిరావయ్య విజయంబుఁ ♦ బొందుమయ్య॥

చిన— అమ్మా! విచార పడకుము. నీవూరికి బోయెదవా?పోయిరమ్మ. నన్నెక్కడకొఁ బొమ్మని సెలవిచ్చుచుంటివే! యుద్ధమునకా! ఆఁ పోయెదను. ఆజ్ఞయిమ్ము.

మ॥ కరకుంగత్తి యొసంగి వైరులను జ ♦ క్కాడంగఁ బొమ్మందువో ♦
దురమం దయ్యకుఁదోడుఁ బొమ్మనెదవో ♦ దుర్మార్గులౌ వారలన్

సఖులకా బొమ్మనెదో వచింపగదవే ♦ నాతల్లి నాచెల్మి కాం
ద్రరుగో వారలగూడి నాన్నకు సహా ♦ యంబింక గావించెదన్. 8

చేటి— నాయనా! యుద్ధము భయంకరముగా నున్నది. మీనాయన గారి యొద్దకు నీవుజనవీలులేదు. నీవొక్కడవున్న బూచివాండ్రు పట్టుకొని పోవుదురు చూడుము. నీచెలి కాండ్రందఱు భయపడి యిండ్లలోనున్నారు. మనము సామర్ల కోటకుఁ బోవుదమురమ్మ.

చిన—ఛీ! చెడుఁగా! నన్ను మాయచేసి యెచ్చటికో తీసికొని పోవనున్నావా? నేను సామర్లకోటకు రాను. నీ కవసరమున్నఁ బొమ్ము. అమ్మా! దాయి నన్ను సామర్లకోటకుఁ దీసికొని పోవునఁట. నీవు వలదని మందలింపుము. ఓదాయీ!

సీ॥ అరులమొగ్గరమున ♦ జరియించుచున్న మా
బాబయ్యగారల ♦ పజ్జకైనఁ
పేరోలగఁపుఁబనుల్ ♦ దీఱుచుచున్న మా
చిన్నయ్యగారల ♦ చెంతకైన
రాజాముకోటను ♦ రక్షించుచున్న మా
పాపయ్యమామయ్య ♦ ప్రక్కకైనఁ
కదనరంగంబునఁ ♦ గత్తులదల్చుచు
వెలమవీరులు నిల్చు విడిదికైన

తే॥ గీ॥ బోయెదను నన్నుఁబిల్వకు ♦ పొమ్ముపొమ్ము
నేను సామర్లకోటకు ♦ రానురాను
అమ్మ! సెలవీయవమ్మ ♦ యుద్ధమ్ముఁజేసి
నిముసమునవత్తు నీదుపా ♦ దములదఱికి॥ 9

మల్ల—నాయనా! నే నమ్మనుకాదా! నామాట వినవా! నీవు దాయితోఁ చిన్నమ్మగారి యింటికిఁబొమ్ము. అచ్చటఁ గత్తులు తుపాకులు విల్లనంబులు కలవు నీవు బాగుగ యుద్ధము చేయవచ్చును. నాలుగైదు దినములలో మేమును వచ్చెదము.

చిన్న—నేను సామర్లకోటకుం బోయెదనుగాని మీరచ్చటి కెప్పుడు వచ్చెదరు! వచ్చునపుడు నాకుఁ గత్తులు దుపాకులుఁ దెచ్చెదరు కదా!

చేటి—నాయనా! నీకుఁ గత్తులు దుపాకు లచ్చటఁ గావలసినన్ని కలవు. పిన్నమ్మగారికి పిల్లకాయలతో బాగుగ నాడుకొనవచ్చును. మీయమ్మగారు రెండుమూఁడుదినములలో సామర్లకోటకు దయచేయుదురు. ముందు మనము పోవుదము.

మల్ల—(దుఃఖముతో) ఆత్మజా! ఇదియనీకు నాకుఁ గల యనురాగ బంధమునకుఁ దుదిదినము. నేటితో మనకుంగల యిహలోక బాంధవ్య మంతరించు చున్నది.

సీ॥ పరువంపు లేనవ్వు ♦ మురువుఁజూపెడి నీదు
నిద్దమౌ మేల్ చెక్కు ♦ టద్దములును
దమ్మిఱేకులకు నం ♦ దము చందముంగూర్చి
క్రాలునీ నిడువాలు ♦ కన్నుదోయి
నిండుచందురుని కాం ♦ తిని నెక్కసక్కెంబుఁ
బొనరింపఁజాలు నీ ♦ ముద్దుమోము
విలువంపులై చెలు ♦ వుల్రుగుమ్మరించి సో
గలుదేరితనరు నీ ♦ కన్నుబొమలు

తే॥ గీ॥ కడిఁది గేదంగిచెండుల ♦ నడిమిరేకు
మిసమిసల నవ్వఁజాలు నీమేనిచాయఁ
జూచి సంతోషమందఁగా నోఁచనైతి
ముద్దులకుమార ఇఁకనైనఁ ♦ బోయిరార॥

చేటీ! బాలుని సంరక్షించుభారమంతయు నీతలపైఁగలదు. పరమాత్ముని యనుగ్రహమువలన నీశిశువె జీవించెనేని శావువంశము నిలుచును. దైవవిధి యెటులున్నదో.

చం॥ మనదగు రావువంశమను ♦ మామిడిమోడు చివురించినట్టి శ్రీ
న్నన, కొలమన్న తమిఫుల్వు ♦ వక్షాలువావిరి దేన్చె, మల్లమా
జననియు రంగరాయపతి ♦ సల్పిన నోములపంట నీకుమా
రుని యిదె నీకొసంగితిని తోడ్కొనిపోవుము నీవె చేటికా. 12

చిన—అమ్మా! నాకొఱకై మీరు విచారపడవలదు. నేను నామఱ్ఱి కోటలోనున్న నన్నలతోడను చెల్లెండ్రతోను గలసి యుందును. అమ్మా! పోయివచ్చెదను.

మల్ల—నాయనా నీముద్దుముచ్చటలు జూచుటకు మీపిన్నమ్మయే నోచుకొన్నది. పోయిరమ్మా. యెచ్చటనైననేమి. బ్రతికి బట్టగట్టిన నంతియచాలును.

చేటి—అమ్మా! నేను సెలవు పుచ్చుకొందును. మీదర్శనము మరల నెచ్చటనో.

మల్ల—స్వర్గముననే! పరలోకవాసమునకు సర్వసిద్ధముగానున్న మీయక్కగారిటులఁ జెప్పిరని నాచెల్లితో నెఱిఁగింపఁ గోరుచున్నదానను. సోదరీ!

సీ॥ కడుపసిపాపఁ డాఁకలికిఁ దాళఁగలేఁడు
కడుపుననిడి వీనిఁ ♦ గాంచుమమ్మ
బుడుతండు పిల్లిపేరి ♦ పులవాడు కావునఁ
గనలి యెన్నండేని ♦ కసరకమ్మ
నీకునాకునుగల ♦ నేస్తంబుఁ దలపోసి
యూరకమది దిగు ♦ లొందకమ్మ
పసివానిబ్రతికించి ♦ వంశంబునిల్పి
నాయాశీర్వచనముల ♦ నందుమమ్మ.

తే గీ॥ మరల నీయుత్తరము వచ్చు ♦ వఱకు మేము
బందుగులతోడ స్వర్గాన ♦ నుందుమమ్మ

కరుణవిడకమ్మ! సుతుని నే ♦ మరకుమమ్మ
ప్రాణాలుబ్రతికింపుమమ్మ! నీ ♦ భారమమ్మ.

చేటి—(కన్నీరు తుడిచికొనుచు) నాయనా పోదమురమ్మా. అమ్మా! ఆజ్ఞతీసికొనెదను.

దరు॥ కడుపున మమ్ముఁ బెట్టుకొని ♦ కాచితివింతటిదాక తల్లి? యీ
యిడుములచేత నిన్నువిడి ♦ యేగుచునుంటిని నేఁడు; కూరిమిన్
విడువకమమ్మ! ప్రాణముల ♦ వీడకయుండిన నెన్నఁడేని నీ
కడ కరుదెంతునమ్మ! కడ ♦ కాళ్లకు మ్రొక్కెదనమ్మ సాధ్వీరో॥

(చినరంగారావు చేటి నిష్క్రమింతురు)

మల్లి—ఇప్పటికి నాభారము తీఱినది. నాకు సర్వవిధులఁ గృతార్థత లభించినది. దైవవశమున నాతనయుఁడు విరోధులకుఁ జిక్కకున్నయెడ మావంశము నిలచును. నాకంతకంటెఁ గావలసినదేమున్నది. పద్మనాయక వీరుల బలంబులు వినాశనము కాకముందె! రంగారాయ భూమీశ్వరుండు విరోధులకు వశముకాకముందె యవరోధసతీమతల్లులు శిశుసహితముగ స్వర్గమలంకరింపకముందె నేను పరలోకము నలంకరించుట కర్తవ్యము. (ముందునకుఁజూచి అదిగో! చెలికాని వెంకయ్యగారిటు వచ్చుచున్నారు. ఆయనవలన యుద్ధసమాచారము లాలించుటయె తడవుగ సంకల్పమును నిర్వహించి శాశ్వతలోకవాస మనుభవించెదగాక.

(చెలికాని వెంకయ్య ప్రవేశించి) అక్కటా యీపాపకార్యమెటులొనరింపనేర్తును. దయాదాక్షిణ్యములఁ బోనాడి యెటుల నిర్దోషిణులగు నవరోధ సతీమతల్లుల ఖండాడెదను. ఎటులఁ బ్రభునియాజ్ఞ నిర్వర్తించెదను. అక్కటా! యీపాపపుఁ జేతఁ జేయుటకు బ్రహ్మ నామనస్సు రాతిఁజేసియుండును. కావుననే యింతదుర్భరకార్య మొనరింపనున్నను నాహృద

యము ప్రయ్యొలుకాక యథావిధముగ నున్నది. ఈపాపాత్ముఁడు ఈయవరోధాంగనా ఖండన ప్రతుఁడు; వీరపురుష విగ్రహ్యాశుద్ధాంతాంగనా సంహారణ దుష్కార్య నియుక్తుఁడు విరోధుల శతఘ్నులకు ముందె యెఱయైయున్న యీపాపకృతి యొనరింపక తప్పనుగదా! (చూచి) అప్పుడె యంతిపురికి వచ్చితిని. ఇఁక నీకఠినకార్య విధానమునకు విరామము లేదుకాఁబోలు (ముందునకుఁజూచి) అదిగో మల్లమాదేవి యిచటనేయున్నది. నేనీ పాపకార్యమునకుఁ బాలుపడితినని యీయమతో నెటులవాకొందును. ఎటు లుపేక్షింతును. దైవమా రావువంశమున కెట్టియవస్థఁ దెచ్చిపెట్టితివి. రంగారాయని కుటుంబమున కెంతటి యకాలమరణము సమకూర్చితివి. విధీ నాకెట్టి పనినియోగించితివి.

మల్ల—అగ్రజా! అభివాద మొనరించుచున్నదానను. రణరంగముననందఱు కుశలముగనున్నారా? యుద్ధమెటులున్నది?

చెలి—విరోధుల శతఘ్నుల కెదురునడుచు బద్మనాయకవీరుల కుశలవార్త నెటులెఱిగింపవలయును. యుద్ధఫలితము విరోధుల కనుకూలముగ నున్నది మనసైనికబలము చాలవఱకు గతించినది. బొబ్బిలి రాజ్యలక్ష్మి విజయరామరాజున్ వలచినటులున్నది.

చం॥ బురుజులు కూలుచున్నవి చ ♦ మూబలమెల్ల నశించుచుండె మా
ర్తురు చెలరేఁగి యంతిపురి ♦ దూరఁగనుండిరి రంగరాయ భూ
వరుఁడ్షిఁక నేఁటిగెల్పనుచు ♦ వాకొనెసాగె; విరోధులఁ జయేం
ద్రిర వరియింపనున్నది స ♦ తీ! ఇఁక నేమని విన్నవించెదన్॥ 15

మల్ల—అక్కటా! నాహృదయమునఁ బుట్టిన పరితాపము సహేతుకమైనదె. ఈరావు వంశ నిర్మూలన కర్మఠుఁడు పరజనవంచనాభావుఁడు చలచిత్తుఁడు నగు విజయరామరాజు సంధి కేమేని యంగీకరించునేమొ ప్రయత్నించితిరా!

చెలి— అమ్మా! చేయఁగల ప్రయత్నము లన్నియు నిదివఱకే చేసితిమి. స్వప్రాశనమునకు స్వసేనా నాశనమునకు జంకని విజయరామరాజు సంధి కంగీకరించునా! అంగీకరింపఁడు. అతని నావేశించిన దుష్టగ్రహము లంగీకరింపనీయవు.

మల్ల— పద్మనాయక సాధ్వీలలో సంగ్రామ విద్యయం దారితేరినవారలు పెక్కండ్రు కలరు. వారలందఱు గలసి యుద్ధరంగమలంకరించినచో బాగుండునది. రాణివాస మూపాటి స్వతంత్రమును గటాక్షింపదా!

చెలి— అమ్మా! ఆచారములకు దేశకాల పాత్రములె లక్ష్యములు. సంఘ విలయము సంభవించి నపుడు కూడ రాణివాసమా! విరోధుల విజృంభణము నంతయు నెఱింగి యపజయము నిశ్చయమని తలంచి పద్మనాయక వీరకాంతలు యోధ వేషముల ధరించి మల్లమాదేవిని ప్రత్యర్థులు కన్నెత్తి చూడకుండ జేయుట ధర్మమని సభావేదిక చెంతనున్న బురుజుపైఁ జేరిరి. ప్రళయకాల కాళీ స్వరూపమును దలపింప జేయుచు వీరకాంతలు దుష్టుల ద్రెబ్బి యీటెలతోఁ బొడిచి ముష్టాముష్టి బోరాడి ప్రత్యర్థిలోకమును బంచబంగాళము గావించిరి.

మల్ల— సతీ మణులారా! మీజన్మము సార్థకమైనది. మీజీవితము పవిత్రమైనది. వీరవర్యులకు గూడ మీసాహసము గుణపాఠము గావించుచున్నయది. భర్తృశాసనమున్న నేను మీకు సహాయపడు దాననే. అంతటివిశ్రాంతి లేదయ్యె. అగ్రజా అనంతర మేమైనది.

చెలి— విజృంభించి సహస్ర ముఖముల నరాతులను వీరపత్నులు దునుమాడుచుండ సిగ్గు చెడి నిలువనేరక యంతఃపురాభిముఖులైన భటులందఱు వెన్నిచ్చి పాఱి విజయరామరాజు బుస్సి హైదరుజంగులతో దమ దుర్గతిని చెప్పికొనిరి. నిర్దయా

స్వభావులు పౌరుషశూన్యులునగు నాముగ్గురు వచ్చి చూచి చేయునదిలేక నలువైపుల నాలుగుఫిరంగుల బెట్టించి పేల్పించిరి. బురుజుపైనున్న వీరపత్నులందఱు నేల గూలిరి.

మల్ల—ప్రత్యర్థినృపులారా! ఛీ! ఛీ! మనుష్య రూప రాక్షసులగు మీకు జ్ఞానము లజ్జ కొలందియగుటలో నాశ్చర్య మేమున్నది! ఆఁడువాండ్రతో నెదిరి పోరాడలేని మీబ్రతుకులు కాల్పనా! పౌరుషహీనులై స్త్రీవధ యొనరించి యేమొగమున దలయెత్తి సిగ్గువిడచి దిరుగుచుంటిరో నాకాశ్చర్యముగ నున్నది. సంగ్రామమున నాకుత్సాహమగుచున్నది.

ఉ॥ శాతకృపాణ హస్తనయి ♦ శత్రుసమూహమునందు జొచ్చి సా
ధ్వీ తిలకాభినంద్యమగు ♦ వీరవిహారము నాచరింపఁగాఁ
చేతము తొందరించె రణ ♦ సీమకు జేరిన వైరి సైనిక
వ్రాతముతోడఁ బోరుటకు ♦ వల్లభు నాజ్ఞను గోరమానితిన్॥

చెలి—సాధ్వీ! నీ సాహసము శ్లాఘనీయము. ఉత్తమ రసపుత్రకాంతామ తల్లులయందు బ్రతిఫలించు పరాక్రమరసము నీయందుఁ బ్రతిబింబించుచున్నది. వీరకాంతల శిక్షాలాఘవము రణరంగంబునఁ బ్రదర్శింపదగని యీపాపపుగాలమున మీకు దేహత్యాగముదప్ప వేఱుత్రోవలేదు. రంగారాయ భూమీశ్వరుండు నాకీకరవాలము నొసంగి యంతఃపుర ధర్మముల నెఱవేర్పుమని పంపియున్నాడు.

మల్ల—ప్రాణనాయకుని యాజ్ఞకు భిన్నము జరుగునా! అగ్రజా! ఆకరవాలము నిటు తెమ్ము. ఒకమాఱు గాఢాలింగన సౌఖ్యమున మైమఱచెదను. (తీసికొనబోయి)

సీ॥ శ్రీరంగరాయ ధా ♦ త్రీనాథు దక్షిణ
కరమునందు నిగని ♦ గలను జూపి

పరిపంథిభూపాల ♦ పటలకంఠాశ్లేష
పరమసౌఖ్యా నంద ♦ గరిమనొంది
పద్మనాయక వీర ♦ వర్యసేవితమైన
రావువంశమునకుఁ ♦ జేవగూర్చి
జన్యరంగంబున ♦ జయలక్ష్మిని వరించి
యతులసౌజన్య సౌ ♦ ఖ్యముల దేలి,
తే గీ॥ ఇంతదనుక విరోధి దే ♦ హాంతరములఁ
బొదలు క్రొన్నెత్తురుఁ దావి ♦ ముదముఁ గనిన
ప్రాణనాయక దత్త ని ♦ తాసికిదియ
కంఠమొసగెద స్వర్గభో ♦ గముల గనెద. 17

అగ్రజా! నాప్రాణనాయకు డేమేని నాకు గడసారివార్త నెఱిఁగించియున్నచో దెలుపుము. వినుటయె తడవుగ నిహలోకమును బరిత్యజించెదను.

చెలి—అమ్మా! ఇంతకుఁ దెగించినవాడను నీప్రాణనాయకుడు నీకెఱింగింపుమనిన కడసారివార్త నెఱింగింపక పోవుదునా! ఆలకింపుము.

మ॥ అనురాగంబునకుఁ బ్రియంబునకుఁ బే ♦ ర్మావేశ సంసిద్ధికీ
దినమే యంత్యదినంబు సాంఘిక స్మృతిన్ ♦ దేవుండు కల్పించె ఓ
వనితారత్నములారా ఐహికపు సం ♦ బంధంబు తీఱెన్, బరం
బుననే యింక బునస్సమాగమము తా ♦ వుండ్రశ్రుగర్భాంజలుల్. 8

అమ్మా! ఇదియే నీభర్తృ సందేశము.

మల్ల—నాయకా! ఇట్టి యంత్యవార్తఁ బంపుతఱి నీహృదయ మెంత చింతా తరంగిత మయ్యెనోకదా! మాతోబాటు నీకీ యకాల మరణము దాపరింప నుండెనా,

సీ॥ కులముద్ధరింపగాఁ ♦ గల నీముద్దుల
తనయుని రంగ రా ♦ యని త్యజించి
అనయ మభేదవృ ♦ త్తిని వెన్ను బాయక
మెలగు వెంగళరాయు ♦ చెలిమివీడి

తొలుతనుండియు వెల్మ ♦ దొరలకాణాచియై
రాజిల్లు బొబ్బిలి ♦ రాజ్యమువిడి,
పరమసౌభాగ్యసం ♦ భరితమై తనరారు
భారతమాత సేవనము వదలి,

తే గీ॥ సర్వభోగంబు లందగా ♦ జాలు నీవె,
స్వర్గభోగంబులందగా ♦ సాహసింప,
బ్రతికి నేనొందవలసిన ♦ ఫలములెవ్వి,
రమ్యసద్గుణ సముదాయ! ♦ రంగరాయ! 19

అగ్రజా! ఆలస్య మొనరింపకుము. నాప్రాణనాయకునియాజ్ఞ దాటరానిది. ఖడ్గమిటు దెమ్ము. నాకుత్తుక నేనె త్రెంచికొనెదను.

చెలి— అక్కటా! ఎంతటి విచారకరమగు కార్యమునకు సాహసించుచున్నాడను. ఓకరవాలమా? అవరోధస్త్రీ వధకు తొందర పడుచుంటివా! ఏమీ నీసాహసము!

తే గీ॥ కఠిన కర్కశ రిపురాజ ♦ కంఠదళన
భయద కర్మంబునకు నీవు ♦ పనికిరావు
ఖడ్గమా! యింకమార్దవ ♦ కలితములగు
చిగురుఁ బోడుల కుత్తుకల్ ♦ జెండఁబొమ్ము.

(మల్లమాదేవికి ఖడ్గము నొసంగును).

మల్ల— (ఖడ్గము జేకొని) ఓకరవాల రాజమా! నాయకుని కరగ్రహణము నొంది నాకాశ్లేష సుఖమొనగూర్ప వచ్చితివిగాని, నీవు స్త్రీ వధకు వచ్చియుండవు. ఒక్కమాఱు నాకంఠమును గాఢాలింగన మొనరించుకొనుము. నాకు సుకృతము లభించును. (అట్లు చేయుచు)

సీ॥ వెలమ వీరుల బలంబులు ♦ రూపుమాసె నట
బటు కఠినోక్తి విని ♦ బడకమున్నె

రంగావనీభర్త ♦ రాజ్యరమా కటా
క్షములకు దూరంబు ♦ గాకమున్నె
మూర్తురు పసివాని ♦ మార్గమధ్యంబున
జేకొనిరను వార్త ♦ రాకమున్నె
అంతిపురంబున ♦ కరులేగుదెంచి దు
ర్ఘటకార్యముల నొన ♦ ర్చుటకుమున్నె

తే గీ॥ ప్రాణనాయక దత్తమై ♦ సట్టి నిశిత
ఖడ్గమున నాకునేనయి ♦ కంఠనాళ
మతుల శౌర్యంబుమీఱఁజెం ♦ డాడికొనెడి
భాగ్యసంసిద్ధిఁ గంటి స ♦ ద్వార్తవింటి. 21

చెలి—సోదరీ! మమ్మువిడచి పరలోకమున కేగుచున్నావా! ఎంతకష్టము, ఎంతకష్టము.

సీ॥ పటుపరాక్రమ రసా ♦ స్పదులగు పద్మనా
యకుల వంశంబునం ♦ దవతరించి
రణవిహారమునఁ బే ♦ ర్వడిన రంగావనీ
ధూర్వహుఁ బ్రేమమీఁ ♦ దో వరించి
సామంతరాజుల ♦ జాయలయాడిగ
మ్ములనెల్ల గన్న స ♦ న్నల గ్రహించి
అరిరాజ దుస్సాధ ♦ మైనబొబ్బిలిరాజ్య
లక్ష్మి కారుణ్యఫ ♦ లంబుగాంచి

తే గీ॥ సర్వవిధముల జనముల ♦ సంస్తుతులకుఁ
దగినదాన వఁటంచనఁ ♦ దగిననీవె
యస్తమించిన నెవ్వని ♦ కస్తమింప
నాశయము కల్గదమ్మ! మ ♦ ల్లమ్మదేవి. 22

మల్ల—అగ్రజా! అధీరోచితముగ భాషింపకుము. ప్రేమానుబంధముల కిది యదనుకాదు. ఆత్మరాజ్యమునకు ప్రాణముల నర్పించుట

మీ కేటుల సహజవిధియొ యభిమానసంరక్షణమునకు బ్రాణము లర్పించుట మాకు నటులె సహజవిధి. నీవవరోధకామినుల నందఱ శిశువృద్ధసహితముగ వధించి మరణాంతమున విరోధులు శవములనేని గాంచకుండుటకు దహనవిధిఁగూడ నెఱవేర్పుము. ఈవిలయకారకుఁడగు విజయరామరాజు నిటుల శపించి నాకంఠము నఱికికొనెద. సాధ్వీశాప మూఱక పోదు.

శా॥ ఏనశ్రాంతము నాయకాంఘ్రియుగళీ ♦ హేరాళ భక్తిప్రత
జ్ఞానప్రాభవనేని, మామకమనః ♦ కాంతుండు విష్ణ్వర్చనా
ధీనస్వాంతపయోజుఁడేని, అజయా ♦ ప్తిక్షా రామధాత్రీశుఁడీ
స్థానంబందుక పద్మనాయకుని చే ♦ తః బ్రాణముల్ వాయుతన్.

హా శ్రీహరీ. హా పరమే...శ్వ...రా

(కంఠము నఱికికొని పడిపోవును)

చెలి—అక్కటా! బొబ్బిలిరాజ్యమున కింతకంటె వినాశన మేమి కావలయును?

ఉ॥ చేతులమీద నెవ్వతెను ♦ చెల్లియటంచును బెంచినాఁడనో
యాతలిరాకుఁ బోఁడిని గు ♦ ణాకర నిప్పుడ కూల్చినాఁడఁ జే
చేతుల, నింక నావలనఁ ♦ జేయఁగరాని దురంతకర్మము
న్నే తరుణీవధంబుఁ గన ♦ నేర్చితి నిప్పటికీవిధంబుగన్ 24

ఇఁక నాలస్యమొనరింప దగదు. మల్లమాదేవి యుపదేశ వాక్యములె స్మరించుచు శేషించిన యవరోధ కాంతావధయు సమాప్తినొందించి రంగారాయుని కీశుభవార్త వినిపించి సాధ్వీరక్తపూరితమగు కరవాలముతో విరోధులఁ జెండాడి స్వర్గరాజ్యముం జూఱకొందుఁ గాక. (ఖడ్గముఁ దీసికొని) ఓ ఖడ్గరాజమా! నీవలన నింక నెంతయో పనికానున్నది. ముందంతఃపురమునకు బయనముకమ్ము. (నిష్క్రమించును).

పంచమాంకము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

పాపారాయ నిర్యాణము

షష్ఠాంకము.

(యుద్ధభూమి-రంగారాయుఁడు ప్రవేశించును.)

ఇప్పటికి బొబ్బిలికోట పూర్తిగ నాశనస్థితికి వచ్చినది. వెలమ వీరుల రక్తప్రవాహము పరాసు సైనికులకు జానుదఘ్నముగ బ్రవహించుచున్నవి. ఇంకనెక్కఁడి విజయము? ఇంకనెక్కఁడి యాస? బొబ్బిలి రాజ్యవినాశన హేతుభూతుఁడగు విజయరామరాజును బ్రాణములతో విడచి నాకీయాయువును ద్యజింప మనసగుటలేదు. ఏనాటికేని విక్రమశాలియగు పాపారాయఁడె యక్కార్యము నిర్వర్తింపగలఁడు. నేను విరోధుల హతశేషమగు సైన్యముతో నెదిరించుటయే కర్తవ్యము. (చూచి) అదిగో! విరోధుల విజృంభణము మేఱమీఱుచున్నది. ఏమని యీ సంతసము? ఓ విరోధిసేనాజనులారా!

సీ॥ అతులిత పద్మనా ♦ యక చమూబలమెల్ల
దునుమనేర్చితిమని ♦ త్రుళ్ళవలదు
దోర్దర్పమలరార ♦ దుర్గంబులన్నిసా
ధింపగల్గితిమని ♦ త్రెళ్లవలదు
విజయరాముండు బొ ♦ బ్బిలి రాజ్యలక్ష్మిని
బొందగానుండెనన్ ♦ పొంగువలదు
మానుషమీగి సే ♦ నానాయకులఁ జవ
జాలితిమను సంత ♦ సంబువలదు

తే గీ॥ ఓరిపుక్ష్మాధినాయకు ♦ లార నిలుఁడు
చండదోర్దండ పాండితీ ♦ మండనుండు
రంగ దరిపుంగవ గళౌఘ ♦ భంగచణుఁడు
రంగరాయుండు మిముఁజెండ ♦ రాఁదొడంగె॥

ఎవ రాభాషించునది. విరోధి సేనానాయకులగుదురా? కారు కారు. వాండ్రకంతటి పౌరుషమెక్కడిది? (ఆలకించును).

(నేపథ్యమున)

మ॥ ప్రకటారాతి శిరోవిఖండన కళా ♦ ప్రాగ్భార సంపన్న మా
మక ఖడ్గంబవరోధ సుందరి వధా ♦ మాత్రంబుతోఁ దృప్తిఁగాం
చక మీ సైనిక కంఠరక్తరస మా ♦ స్వాదింపఁగానుండెఁ బో
వకుఁడీ వైరినృపాలులార? మిముఁగూ ♦ ల్పక బాసఁగావించితిన్॥ 2
ఓపిఱికిపందలార! జాతిమాత్రోపజీవులారా! నిల్వుఁడు. నిల్వుఁడు.

రంగా—(ఆలకించి) ఓహో! స్త్రీవధ నొనరించి ప్రతిపక్ష వీరవధా విధానమున కుఱుకు చెలికాని వెంకయ్య పలుకులే యివి! విచారాతిశయమున స్త్రీవధావిధానమున నుద్రేకవంతమయిన యీతని పరాక్రమము విరోధిసైన్యమును సర్వనాశనముఁ జేయక పోదు. (చూచి) యేమి నీవిక్రమము! ఏమినీలాఘవము, ఏమి నీచాతుర్యము! నీపశ్చిమ దుర్గద్వారమునే నిరోధింపుము. ఈ ప్రయత్నమువలన విరోధులబలము సగము నాశనముకాఁగలదు. దిగ్భిత్తికలపైఁ బద్మనాయకుల పరాక్రమజీవితములు యశోలేఖినితో వ్రాయవలసిన యదనిదియె. (నాలుగువైపులుజూచి) అక్కటా! విరోధులీ సంకులావస్థలో బురుజు నాక్రమించిరి. అదిగో పద్మనాయకవీరులతో ఘోరావహముఁ జేయుచున్నారు. సేనలఁ బురికొల్పి వైరిసైనికుల దుర్గమునుండి క్రిందికి ద్రోయవలయును. (నడచి) బురుజుపైఁ తనబావుటా నెలకొల్పవలయునని కాఁబోలు విజయరామరాజిటు వచ్చుచున్నాఁడు. మగటిమితో నా కెదురువచ్చినసరి. లేకున్న సేనతో నాతని ప్రతిఘటించి నాకోపముఁ జల్లార్చుకొందును. సర్వనాశనమైన యీ బొబ్బిలి సంస్థానమునకుం గ్రొత్తగా రావలసిన యవస్థలు వేఱు లేవు. ఓవిజయరామరాజా? ముందునన్నుఁ బ్రతిఘటించి కోటలో నడుగుపెట్టుము.

ఉ॥ క్షత్రియ వంశమందునను ♦ జన్మము నొందినవాఁడవేని లో
కత్రయ వందనీయ భుజ ♦ గర్వముఁజూపి యశఃపవిత్ర చా
రిత్రుఁడవై తరింపుము త ♦ రించుట కిద్ది రహస్యమార్గ మీ
మాత్రపు విక్రమంబునకు ♦ మార్మొగమైనఁ బరంబుతప్పెడిన్॥

విజ—(ప్రవేశించి) చింత జచ్చినను పులుసు చావదనునటుల బొబ్బిలి రాజ్యము సర్వవిధములనిర్మూలమైనను నీరంగారాయని కింక విజయముపై నాసతీఱలేదు. చచ్చిన రాచవానిచేతనే చావవలయునని కాఁబోలు చేయెత్తి నన్ను సంగ్రామమునకుఁ బిలుచుచున్నాఁడు. ఈ కడసారి కోరికఁదీర్చుటధర్మము.

ఉ॥ బురుజులు కూలిపోయినవి ♦ భూరిపరాక్రమ భాసమానులౌ
దొరలు గతించినారు పడఁ ♦ తుల్ కదనాంగణమందు నేలపై
కొరిగిరి సర్వవైభవ స ♦ మూహము నాశనమందె గెల్చి యె
వ్వరిఁ దనియింపనెంచితివొ ♦ వచ్చివచింపుము రంగరాట్పతీ॥

రంగా—నాసంస్థానమును జీవించియున్నంతవఱకుఁ గాపాడుటయే నాధర్మము. దురాశాపీడితుఁడై బొబ్బిలి నపేక్షించిన వంచకుని వధించుటయే నాప్రతిజ్ఞ. విజయరామరాజా? ముందీవేటును గాచికొని పిమ్మట బొబ్బిలిరాజ్యమున విజయధ్వజమును స్థాపింపుము.

విజ—ఇదిగో! సంగ్రామమున కాయిత్తమైతిని. రాజు రాజుచేతను బంటు బంటుచేతను సేనానాయకుడు సేనానాయకునిచేతనే గతించుటగౌరవ ప్రదము. ఈసమయుద్ధమున నెవరుజయించినను విజయము సులభముగా సువ్యక్తము కాగలదు. ఈ వేటును గాచికొమ్ము.

(ఇరువురు ద్వంద్వయుద్ధము గావింతురు).

రంగా—ఇదిగో! తాళఫలమువలె నీశిరము నెగుర గొట్టుచున్నాను. బొబ్బిలిరాజ్యలక్ష్మి ఋణము తీర్చుకొను నదృష్టము లభించుటచే నేను సర్వవిధముల ధన్యుడను. ఖండాంతరుల యపవిత్ర

స్పర్శముచే గలుషితమైన రాజ్యలక్ష్మిని పావనమగు క్షత్రియ
రక్తముతో నభిషేకింతును.

మ॥ బలవద్దర్ప సమగ్రబుద్ధినయి యీ ♦ పాశ్చాత్య దుశ్చిత్తులన్
కలుషస్వాంతుల విశ్వసించి, రణరం ♦ గంబందు నాంధ్రావనీ
స్థల విభ్రాజిత వీరబొబ్బిలిపురీ ♦ సర్వస్వ విద్రోహతా
కలనంబుల్ నెలయింతువే! కలకళం ♦ కా! రామభూమీశ్వరా.
నీవనినటుల రాజునకు రాజుచేతనే మరణము లభించినది.
ఉత్తమున కుత్తమ లోకము లభించుట స్వతస్సిద్ధమే కదా?

చం॥ బలిమియొనరింతు నిన్నిపుడు ♦ భారత భూమికి విక్రమక్రమో
జ్జ్వలులగు వెల్మవారి భగ ♦ వంతుడు నైతమెదుర్పలేడు, కే
వల దురహంక్రియా భరము ♦ పైకొన యుక్తమెఱుంగలేక బొ
బ్బిలిపయి కేగుదెంచితివి ♦ బీరము వీడిపోయె నిత్తఱిన్.

(రంగారావు విజయరామరాజు గుండెపై బాకుగుచ్చివేయును).

(నేపథ్యమున) ఓసేనానాయకులారా! సింహము వలె విజృంభించి
రంగారావు విజయరామరాజును వధించుచున్నాడు. చూచెదరేల?
రక్షింపుడు రక్షింపుడు.

ఉ॥ శాతకృపాణ సద్దళిత ♦ శత్రుడు వేంకటరంగరావు; ప్ర
జ్ఞాతిశయంబుచే మనబ ♦ లావళినంతయు జూరబుచ్చి ని
ర్ఘాత సమానుడౌ విజయ ♦ రామనృపాలుని జెండుచుండె బు
స్సీ! తిలకింపవేల? దయ ♦ చేయవదేటికి? హైదరుప్రభూ.

విజ—ఇతరులసహాయ మెంతమాత్ర మవసరములేదు. విజయరామ
నృపాలుడాహవదోహలుండని యెఱుంగక మీరుభ్రాంతి పడు
చున్నారలు. మేము ధర్మయుద్ధ మొనరించుచున్నారము. పటు
లందరు మధ్యవర్తులై. రంగారాయ! స్థిరముగా నున్నావుకదా!
(రంగస్థలమున దుపాకి పేలును, రంగారావు పడిపోవును).

విజ—రంగారాయ! రంగారాయ! ఏమి నేలకొరిగినాడవు.
(రంగారాయని గాయము పరిశీలించును).

రంగా—ఔరా! ఈబాధదుర్భరముగా నున్నది. ఈతుపాకిగుండు వక్ష
స్థలమునుండి వెనుకకు దూసిపోయినది. ఇక నీయాయువులు
స్వల్పకాలముగూడ భరింపజాలను. వీరపురుషుల కొక్క
ప్రోత్సాహవాక్యము వచించి స్వర్గరాజ్యమును జూఱగొం
దుగాక! వీరునకు రణరంగమున గతించుటకంటె వేఱుసుకృ
తము లేదు.

విజ—(స్వగతము) అధర్మప్రేరితుడై యేసేనానాయకుడో రంగారావు నీ
దుస్థితికి పాలుపఱచినాడు. సంగరధర్మ విచ్యుతుడగు నొక్క
జాల్మునిచేతనే రాజ్యమునంతటి కపకీర్తి వచ్చును. ఈవీరుని
యక్రమ మరణమునకు చింతించ ఫలములేదు. ఈవార్త
వెల్లడికాకముందే నేనిటనుండి నడచుట యుక్తము.

రంగా—ఓసేనానాయకులారా! ఓపద్మనాయకులారా! ఇదే నాయంత్య
విజ్ఞప్తి.

సీ॥ హతశేషులగు సైన్య ♦ పతులార! మీపట్టు
దలల జూపింప స ♦ త్వరమ లెండు
పద్మనాయకులారా ♦ ప్రాణమేగును గాక
పరదాస్యమునకు బా ♦ ల్పడకు డయ్య
రాజ్యలక్ష్మి నీకు ♦ రాజువెంగళరాయ
డతనికే చేయుమ ♦ య్యాసపర్య
అంబుజమిత్ర నీ ♦ వైన బాపారాయ
నకు నాయవస్థవి ♦ న్నప మొనర్పు

తే॥ గీ॥ అరుగుచున్నాడ సురసతీ ♦ నిరుపమ ప్రి
యోపగూహనలకు నాస ♦ నొంది నేడు
రంగరాయండు యుద్ధంపు ♦ రంగమువిడి
అమ్మ భారతమాత రో ♦ ఆజ్ఞనిమ్ము.

(వెంగళరాయఁడు ప్రవేశించును.)

వెంగ—అక్కటా! బొబ్బిలి రాజ్యవైభవము సమాప్తమగుటచే గాఁబోలు! యుద్ధవార్తలు తెలియవయ్యెను. (చూచి) హా దైవమా! ఎంతలో నెంతటి విపత్కాలమును గల్పించితివి. ఇంతకు మున్ను రంగరాయుండు యుద్ధంపు రంగము వీడి యరుగుచున్నాఁడు. అది నాకు వినబడిన వాక్యము. మాయన్నగారి నోటినుండివచ్చిన పలుకువలెనే యున్నది. ఈపలుకెచటి నుండి బయలు దేరెనో యలికిడి బట్టి ప్రయత్నమొనరించినను తెలిసికొన దుస్సాధ్యముగనున్నది. నన్ను వంచించుటకు విరోధులు పన్నిన దురుద్యమమైన గావచ్చును. పద్మనాయక శవానేక సిబిడీకృతంబగు నీరణరంగంబున నాకు యథార్థ మెఱింగించువారెవరు? (ముందునకు బరికించి) హా! బొబ్బిలి రాజ్యలక్ష్మి నీకెంతటి యాపద ప్రాప్తించినది. హా! పద్మనాయక వంశమా! ఎంతటి యమూల్య భూషణముం గోలుపోతివి. (మూర్ఛపోయి తెప్పిరిల్లి) హా అగ్రజాత! విజయరామ వధావిధాన బద్ధకంకణ! హా పౌరుషాభిరామ! పద్మనాయక సంస్థాన సర్వస్వ! హా సంగ్రామధనంజయ! హా ప్రతిపక్ష భూపాల సేనాకానన దావానల! హా జగదేకవీర! ఎంతలో నెట్టి దుర్విధికి లోనైతివి. (శవముపైబడి)

సీ॥ విక్రమించినయట్టి ♦ విజయరామునకు నీ
ప్రధన విక్రమముఁ గ ♦ న్పరచలేదు
ఆత్మజాతునకు రా ♦ జ్యాధిపత్యమొసంగి
యతుల కృతార్థత్వ ♦ మందలేదు
సాగరవేష్టిత ♦ క్ష్మాభాగమున జయ
స్తంభముల్ ♦ స్థాపన సలుపలేదు
తలచిన సంకల్ప ♦ ములనన్నిటిని సమ
ర్థించి ప్రతిష్ఠ నా ♦ ర్జింపలేదు,

తే.గీ॥ ప్రాయమా ముప్పదేండ్లకుఁ ♦ బాయలేదు
చిత్తమా! శాంతభావంబుఁ ♦ జెందలేదు
కటకటా! యింతలోన యీ ♦ గతినిగంటె
ప్రధన గాంగేయ! శ్రీరావు ♦ రంగరాయ॥

అగ్రజాతా! నీవదన సుధాకిరణాస్తమయానంతర మీకువలయ శ్రీలు సౌఖ్యకరములా! మనసున బెచ్చుపెఱుగు విచారత మోరాశి యంతరించునా! వంశవారాశి యుప్పొంగునా? దైవమెట్టి కష్టవిధి సంకల్పించెను? విరోధుల దురుద్యమమెంతలో ఫలించెను? ఎన్నియో కొఱఁతలుండఁగనే నీజీవితము ముగిసెనా? ఆహా! అగ్రజా!

సీ॥ కటకటా! ఎంతటి ♦ కష్టంబుప్రాప్తించె
ననురీతి నాసిక ♦ నంగుళినిడి
కనరాదు దుర్జన ♦ కలితమాలోకంబు
నున్నట్లుఁ గన్నుదో ♦ యిని మొగిడ్చి
అన్నివిధాల కృ ♦ తార్థుండ ననిపల్కు
కరణి వక్షస్థలి ♦ కరముఁ జేర్చి
యుద్ధమంతయుఁ గాంచ ♦ కుండ నేగుచునుంటి
ననుమాడ్కి దైన్యమా ♦ స్యముననించి

తే.గీ॥ రాజమణులకుఁ జావెందు ♦ రణమునందె
యనెడి నుడువుల కీవుదృ ♦ ష్టాంతముగను
నేటితోడుత నూఱేండ్లు ♦ నిర్గమింప
నరిగితివె అగ్రజాతద ♦ యాసమేత॥ 6

పద్మనాయక వంశాలంకారుడగు నీరంగారాయుడు గతించిన పిమ్మట నేను జీవించి యనుభవింప వలసిన సౌఖ్యమెద్ది? రణరంగమున యావచ్ఛక్తి వినియోగించి స్వర్గమున నన్నగారితో నేకీభవించుటయే యాచరణీయము. ఓవైరిసైనికులార!

శా॥ భంగంబుల్ బొనరింతుఁ దావక చమూ ♦ వారాశి నెల్లన్, సమి
ద్రంగంబందు భవత్ విరోధుల నవా ♦ ర్యప్రౌఢిరాల్తుల్, భువిన్
నింగిన్ మీయపవిత్రరక్త సదులన్ ♦ నిండారఁ బారింతు, నీ
వెంగళ్రాయని శక్తి మీకిదియెక ♦ న్నింతునన్సుఁ డీ శాత్రవుల్.

నా భుజాబలమునకు విజయరామరా జడ్డుపడునో బుస్సీ అడ్డుపడునో హైదరుజంగు అడ్డుపడునో పరికింతుగాక! ఓ సైనికులారా! మిగిలినదానికి జేయునది లేదు. మీస్థానముల వర్జింపకుడు. నేను మీకు సేనానాయకత్వము వహించెదను. (నిష్క్రమించును.)

(విజయరామరాజు, బుస్సి, హైదరుజంగు, జవాను ప్రవేశింతురు.)

హైద—బొబ్బిలివాంళ్లు బడా బలవంతుల్ వుండారు. బంట్లు అంతా సచ్చిందాకా కోటలో హడుగు పెట్టనిచ్చారు లేదు. వాంళ్లకి పౌరుసం ఎక్వావుంది. మనకీ తక్వావుంది. లేకపోతే మనకి ఫౌజు యెనిమిది యేలు నష్టం. వాంళ్లకి షేన మూడు యేలు నష్టం. యెట్ల అవుతుంది. క్యా యిజయరాంసాబ్.

విజ—పౌరుషవంతుల కెప్పుడు జయము లభించితీరును. జయమున కేమిగాని జీవములతో పద్మనాయకుల బంధించి యంతఃపురాంగనలతో వలసఁబంపి బొబ్బిలి దీసికొనఁజాలమైతి మని నాకు బరితాపముగ నున్నది.

బుస్సి—విజయరామరాజా! ఇవి నీవంటి ప్రభువున కుండవలసిన బుద్ధులు కావుసుమా! నీహృదయమున కిప్పటికేని పశ్చాత్తాపము కలుగకున్నది. నిష్కారణముగ నిన్ని కుటుంబములు రూపుమాపెనని విచారపడుటకు మాఱు వికటోక్తు లాడుచుంటివా? ఖండాంతరుఁడనైన నేనే ఇంత విచారించుచుండ దేశీయునకు నీకు ఏ చారము కలుగదేమి?

హైద—యిజయరాంసాబ్ మహరాజ్ కి కోపం వచ్చింది. తుం బాత్ కరనకో.

విజ—దేవా! తాము కోపించుచున్నారుగాని బొబ్బిలివారు నన్నెంత కష్టపెట్టిరో తాము చూచియుంటిరా? నా హృదయ మెంతయో పరితపింపకున్న సాహసించి యిటుల గావింతునా? కావలయునని జయించి యింక పశ్చాత్తాపమొందనేల?

బుస్సి—మీకు మీకు ద్వేషముండుఁగాక. అనవసరముగ మేమీ యుద్ధమున జోక్యము కల్గించుకొనుటచేత నేకదా బొబ్బిలి సంస్థాన మిటు లంతరించినది?

హైద—మహరాజ్ పోయిందాన్కి అనుకోవాలా వద్దు. అనోకని లాభంలేదు. ఈలడాయిలో యిజయరాంసాబ్ తప్పు ఒక్క రవ్వా అంతా లేదు. అంతా బొబ్బిలిది.

(నేపథ్యమున) అయ్యో! సామర్లకోటకుఁ బోవుమార్గ మేది! ఆపడిపోయిన బురుజుప్రక్కనుండిపోవు లుబాట యేకదా యెవ్వరు మారుపలుకరే?

(చేటి, చినరంగారావు ప్రవేశింతురు.)

చిన—అబ్బా! నేనింక నడువఁజాలను. నాయడుగులు తడబడుచున్నవి. ఆకలియగుచున్నది. ఇఁక నేను రాను. ఇంటికి బోయెదను.

తే॥ గీ॥ మొలకరానేల పాదంబు ♦ మోపఁజాల
ఒడలు భారంబుగాఁదోఁచె ♦ నడువఁజాల
దప్పియగు చుండె నిముసంబు ♦ తాళఁజాల
చేటి! ఇఁక నెంతపయనంబు ♦ చేయవలెనె? ౪

చేటి—(బుస్సి మొదలగువారిఁజూపి) నాయనా? అరవకుము. అరుగో దొంగలు పట్టుకొనిపోవుదురు. సామర్లకోట దగ్గరకు వచ్చితిమి. (స్వగతము) అక్కటా! ఆ కానవచ్చువారు విరోధులవలె నున్నారు. ఈబిడ్డ కేమి యపాయము కలుగునో? (నడచి)

తే. గీ॥ ఈనగాచియు నక్కల ♦ కిచ్చినట్లు
శిశువు నిందాక రక్షణ ♦ జేసి యిపుడు

వైరులకు నప్పగింపగా ♦ వలసె నింక
పాపనికి దిక్కు లేదు దై ♦ వంబు దక్క.

హైద—ఏజవాన్! ఒకఆడుది పిల్లవాడు పోతూవుంది. మహారాజ్కా హుకుం అయిందీ. అని వాంళ్లకి పిల్చకరా. బొబ్బిలివాళ్ళు వుండారు.

జవాన్—చిత్తమటులె యొనరించెదను. (నిష్క్రమించును).

విజ—పిల్లవాడు పోలికలఁ బట్టి చూడ రంగారావు కుమారునివలె నున్నాడు. ఈకుర్రవానిని దాసి యెచ్చటికో తీసికొనిపోవుచున్నది. మనకంటపడిరి. ఇక నెక్కడికి బోయెదరు?

(చేటి చినరఙ్గారావు ప్రవేశింతురు).

హైద—ఓసీ ఆడ అమ్మి మీదికోన్ సాబస్తీ యీచోటాకీ యాడ్కి తీస్కాపోతావుండావు. పిల్లవాడు యెవర్కి కొడుకు నువ్వు యెవరు బోలో.

దాసి—నాదిబొ......కాదు పెద్దాపురము. ఈబాలుఁడు నాతనయుడు......

విజ—నిజము చెప్పకున్న నిన్ను ఖండింతుము. దాసీకుల సహజమగు నసత్యసంభాషణము మాత్రము సలుపకుము. జాగ్రత్త! నీది పెద్దాపురమా?

చిన—ఏమిరా! నోటికి వచ్చినటుల వాగెదవు. నీకు వెరచువారు లేరు.

తే. గీ॥ కత్తిఁగొనిరార నాతోడి ♦ కయ్యమునకు
శిరము బొబ్బిలికత్తితో ♦ నఱకువాడ
పిల్లవాడుగదాయని ♦ త్రుళ్ళఁబోకు
పదను కత్తికి ముందు నీ ♦ ప్రాణమెంత? 10

విజ—ఓరీ శుంఠా! శాబకా! వెలమకులమునఁ బుట్టినందులకు, మాటలుమాత్రము దిట్టముగ విడుచుచున్నాడవు. మాటల కింకమైన లేకున్న బ్రతుకు తెరువేది? (బుగ్గపట్టుకొనబోవును)

హైద—పిల్లవాడు బడా గట్టివాఁడు వుండాడు పిర్కాగిర్కా లేదు.

బుస్సీ—విజయరామరాజా? ఆబాలకుని కసరకుము. మిగులగారాబముగ బెఱిగిన కుఱ్ఱవానివలె నున్నాడు. కావుననే తొందరపడి మాటలాడుచున్నాడు. హైదర్ జంగ్! ఆబాలకుఁ డెవ్వడో విచారింపుము.

హైద—ఇ పిల్లగాడూ యెవడు? నువ్వు యెవడు సత్తెంబోలో,

చేటి—(బుస్సీవైపునకు మరలి) ధర్మస్వరూపులగు మీముందు యథార్థము వాకొనెదను. బొబ్బిలిరాజ్యము విరోధివశము కానున్నదని అంతఃపురకాంతలందఱు నాత్మహత్య గావించుకొనిరి. మారాణియగు మల్లమాదేవి తానాత్మహత్యఁ గావించుకొనబోవుచుఁ గుమారుని సామర్లకోటలోనున్న తనచెల్లియింట నుంచిరమ్మని నాకాజ్ఞయొసంగినది. ఈబాలుడు రంగారాయని కుమారుడు. మీచేతులలోఁ జిక్కెను. రక్షించినను శిక్షించినను మీకేదిక్కు.

తే. గీ॥ మోడుపోయిన శ్రీరంగ ♦ భూమిపాలు
వంశవృక్షంబునకు దైవ ♦ వశమువలన
చివరకు మిగుల్పబడ్డియె సి ♦ చివురుటాకు
త్రుంతురో పెంతురో యొప్ప ♦ గింతుమీకు.

విజ—రంగారాయని కుమారుఁడే యైనచో బంధింప వలసినదె! బొబ్బిలి రాజ్యము స్వాధీనపఱచుకొనిన తరువాత నీతనిసంగతి విచారింప వచ్చును. అంతవఱకు దాసివద్దనుండి బాలుని తొలగించి మన భటుల కప్పగింపవలయును.

చేటి—కుఱ్ఱవానిని బంధింపుటయే! నాకంఠనాశమున నాయువున్నంత వఱకటుల జరుగనేరదు. ఓవిజయరామరాజా! [illegible]మిహలోకముననే కట్టికుడుపును.

శా॥ శ్రీమన్మల్లమదేవి దివ్యకరుణా ♦ శీర్వాదమున్ రంగరా
డ్భూమీనాయక సత్కృపావిలసనం ♦ బున్ హేతువుంగాగ సం
గ్రామప్రాభవ మేనునేర్చితిని నా ♦ ప్రాణావసానంబునం
దేమోగాని కుమారుఁ గైకొన వశం ♦ బే నీకు రామాధిపా. 12

బొబ్బిలి రాజ్యమునఁ బ్రతియువతియు వీరాహవ నిర్వహణ ప్రవీణయె. ఇంతవఱకు మీరుస్వానుభవమున నెఱింగిన యంశమేయిది. కదనమున నన్నెదిరించి పిమ్మట బాలుని పైకిఁ బొమ్ము. మధ్యవర్తిగ ధర్మమూర్తి బుస్సిదొరగారుందురు.

విజ—ఛీ నోరుమూయుము. వీరక్షత్రియ కుమారుని దాసి సంగ్రామమునకు బిలచెనన్న నవ్విపోదురు. తెలివిగలిగి బ్రతుకుము. ఎవరనుకొంటివో.

హైద—చోటా! యిజయర్రాంసాబ్ కీసలాంకరో? వాడికి దయనీమీద వుంటే నీకు షే.మం అవుతుంధి. ఇష్టు నీదిషర్వం ఆయన్కి శేతుల్లో వుంది.

చిన—చేటీ! విజయరామరా జీతఁడేనా! నాన్నగారితో యుద్ధము చేయవచ్చినాడని నాచెలికాఁడు చెప్పినాఁడు. ఈతఁడు నన్ను చంపునా?

విజ—కుమారా? నిన్ను వధించుట మాసంకల్పముకాదు. ప్రకృత విషమ పరిస్థితులలో నోరెఱుఁగని నిన్నుఁగాపాడి యనంతరమేదోయొక సంస్థానము నొసంగవలయుననియే మాసంకల్పము. రమ్ము. నావద్దకురమ్ము (పిలువఁబోవును.)

దాసి—బొబ్బిలి వెలమబిడ్డసుమా? తాఁక బోకుము.

చిన—నేనురాను, నేనురాను. (కత్తితోఁబొడువఁబోవును.)

బుస్సి—చినరంగారాయని ముద్దుపెట్టుకొని నాయనా! ఉత్తమవంశము నఁబుటిన నీకీపౌరుష ముండవలసినదె గాని. నీకివి కానిదినములు

ఈయకర్మయుద్ధమున హైదరుజంగు విజయరామరాజుల మాటలువిని నీవంశనాశనమునకుఁ గారకుఁడనైన నేను నీకుఁ జేయవలసిన ప్రతికృతిలేదు. పరులమాటలనేను విశ్వసింపకున్న మీకీ యవస్థలురావు. హతశేషులగు బొబ్బిలివీరులచేతిలో నుండి బయటఁబడితినేని నీకుఁ దగినమేలు చేసితీఱుదును. ఓరీజవాన్! ఈకుఱ్ఱవానిని జాగరూకతతో సామర్లకోటకుం జేర్పుము. దాసి నీబాలుని సంరక్షణమున నియోగింపుము. (తనలో) ఇప్పుడుకాకున్న మఱియొకప్పుడేని బొబ్బిలిరాజ్య మీకుఱ్ఱవానికిచ్చి తీఱెదను.

చిన—అయ్యా! నేను వెళ్లివచ్చెదను, నాకు సెలవిండు. (సలాముచేయును)

బుస్సి—నాయనా! పోయిరమ్ము.

(చినరంగారావు చేటి, భటుఁడు నిష్క్రమింతురు.)

హైద—అచ్ఛాఛోటా వుండాడు. బొబ్బిలిగడ్డమీద పిరికివాడూ లేడు, అంతావస్తాదులు అంతాసర్దారులు వుండారు: ఆడవాంళ్లకి మొగవోంళ్లకి పౌరుసంవుంది. కసరత్ వుంది. బలం పరాక్రం వుంది. తెలింగీ దేషములో యీపౌరుసం షూశాంలేదు.

విజ—(తనలో) బొబ్బిలికోట యిప్పటికి సర్వవిధముల నాశనమైనట్లు పశ్చాత్తాప స్వభావముగల బుస్సిని వంచించి బొబ్బిలికోట యేనాటికైనా వెలమవారికి, అందుముఖ్యముగ రంగారాయని పుత్రునకు, సంక్రమింపకుండఁ జేయవలయును. దైవవశమున బ్రతికి బట్టకట్టిననాటికి రంగారాయని పుత్రుని కేమన్నెపు గ్రామములో జూపునటు లిపుడె కట్టుదిట్టముచేయవలెను. సంగ్రామపరిస్థితులు ఈదిక్కుమాలిన శిశువును జూచిన దాది బుస్సిహృదయము విచారక్లిన్నమై నటులున్నది. ఇతనిహృదయము నన్యత్ర మరల్చుట కర్తవ్యము. (ప్రకాశముగ) బుస్సి ప్రభూ! కోటయిప్పటికి మనవశమైనది. ఒకమాఱు. లోనికేగి చూచివత్తమా?

బుస్సీ—ఇంకనేమిచూడవలయును? బురుజులు, కోటలు మనమే పగుల గొట్టితిమి. అంతఃపురాంగన లందఱు నాత్మహత్యగావించు కొనిరి. సేనానాయకులకుటుంబము లెప్పుడో మనఫిరంగులచే నాశనమయినవి. నేను చూడజాలను. శవములచేనిండియున్న యీ బొబ్బిలిరాజ్యమును నేనుజూచి సహింపజాలను. నేనురాజాలను.

విజ—చిత్తము. రేపటి దినము చూడవచ్చును. బొబ్బిలివీరులలో బేరుపడిన పాపారాయడింకను జీవించియేయున్నాడు. అతడు బొబ్బిలి దురవస్థ వినెనేని మనపైబడి తీఱును. ముందాతని సైన్యసహితముగ బంధింపవలయును.

హైద—విజయరాంసాబ్ వాడు యిప్పుయెక్డా వుండాడు?

విజ—మనము బొబ్బిలికోటకు రాజాంకోటమీఁదగ వచ్చెదమేమో యని మనల నెదిరించుటకు సైన్యసహితముగ రాజాంకోటయొద్ద నున్నాడట. మనము మారుత్రోవను ముట్టడింపవచ్చితిమని బొబ్బిలివారు పాపారాయనిచెంతకంపిన భటులనందఱ వధించి యీలేఖలఁ దెప్పించి యాతనికి వార్త బోకుండ జేసితిని.

బుస్సీ—విజయరామరాజా! నీకు సాహసము దూరాలోచనము లేదు. పాపారాయనికి వార్త బోనిచ్చి సైన్యసహితముగ నాతని నిటకు వచ్చునటుల జేసియున్న మనము సులభముగ నెదిరింప వీలుచిక్కునది. నీవు నిరర్థకముగ భంగముగావించితివి. అతనిసంగతి రేపువిచారించుదము. పొద్దుగ్రుంకువేళ గావచ్చినది. సేనల నియతస్థలములు వదలి శిబిరములకు రానాజ్ఞాపింపుము. మనము బసలకు జేరుదము.

(నేపథ్యమున)

ఆ. వె॥ ఏఁడి బుస్సిహైద ♦ రెచ్చటనున్నాఁడో
ఏఁడి విజయరాముఁ ♦ డెందుడాగె
సేనలెల్ల నిటులఁ ♦ జెడివేయుచున్న
నష్టపడెడి యొక్క ♦ డైనగాని.

విజ—అదిగో! వెంగళరాయుడు వెలమసైనికులతోగూడి మనసైనికులను నిగ్రహము గావించుచున్నాడు. రక్షింపుడు, రక్షింపుఁడు.

బుస్సీ—ఈపద్మనాయక వీరులగెలుచుట కష్టసాధ్యము. ఆంధ్రవీరుల యందింత పరాక్రమ మిదివఱకెచ్చట జూచి యెఱుంగము. దేశాభిమానమన నిటులెయుండవలయును. బొబ్బిలివీరులకున్నంత దేశాభిమానము, ప్రభుభక్తి యాంధ్రులందఱకున్నచో సర్వదేశములు జయించియుందురు. (ప్రకాశముగ) విజయరామరాజా! సైనికుల వెన్నీయవలదని తెలుపుము. ఇదిగో మేము వచ్చుచున్నారము.

విజ—రండు, పోవుదము. (అందరు నిష్క్రమింతురు).

షష్ఠాంకము.

సంపూర్ణము.

శ్రీ రస్తు.

పాపారాయ నిర్యాణము

సప్తమాంకము.

(దేవులపల్లి పెద్దన్న, తాండ్ర పాపారాయఁడు ప్రవేశింతురు.)

తాండ్ర—మిత్రమా! పెద్దన్నా! నామనస్సున నేదియో విచారము కారణములేకే జనించి వృద్ధి నొందుచున్నది. తగినటుల బొబ్బిలి కోటను విడచినదిమొదల లింతవఱకు వార్తలు సైతము తెలియుటలేదు. ఇఁక మనమెంతదూర మేగవలయును?

దేవు—అదిగో! ఈకటికిచీఁకటిలో మినుకుమినుకుమనుచుఁ గానవచ్చునదియే బొబ్బిలికోట. సమీపమునకుఁ గూడ వచ్చితిమి.

పాపా—(నడచి) మిత్రమా! కాంచుము, కాంచుము. కోట యిటుల భయంకరముగఁ గనవచ్చుచున్న దేమి! నీకు నిటులనే గనవచ్చుచున్నదా! ఏమి యీవిపరీతము?

సీ॥ గ్రుడ్లగూబలు మూఁకఁ ♦ గూడి యంతఃపురంబు
గోడలపై బిట్టు ♦ గూయసాగె
ఘాతుకమృగము లె ♦ క్కడనుండియో శవం
బులఁగొని వేవేగఁ ♦ బోవుచుండె
క్రొంజవిదయ్యంబులు ♦ బురుజులపైఁ జేరి
వింతనృత్యములు గా ♦ వింపఁదొడఁగె
గుంపుగాజనులుండు ♦ కోటగుమ్మపుదోయి
యశుభచిహ్నంబుల ♦ నాక్రమించె

తే॥ గీ॥ దూరమునసుండివచ్చెడి ♦ మారుతంబు
క్రుళ్లునెత్తురు వాసనల్ ♦ క్రుమ్మరించెఁ
జెలుఁడ! ఇవి మనరాజ్యంపు ♦ విలయసూచ
కంబులనితోఁచు నామనః ♦ కంజమునకు॥ 1

దేవు—మిత్రమా! మీరు విచారము నొంద నవసరములేదు. మన మనస్సున సందేహ మున్నపుడు గాంచునవియన్నియు సందేహాస్పదములుగనే నుండుట నైజము. అంతియగాని మన కేట్టియపకారము జరిగి యుండదు. ఇంకను శోధించుదము.

పాపా—(నడచి) పెద్దన్న! ఇంక సందేహింతువేల? మన బొబ్బిలి రాజ్యమున కింతయనరాని ప్రళయము నిజముగ జరిగినది. కోటలోనికి వచ్చుచుంటిమి. ఎచ్చట సందడి వినవచ్చుటలేదు. త్రోవలయందు సైనికులు కానరారు. ఇంతియగాక.

ఉ॥ దిక్కుల రక్తపున్నదులు ♦ తెంపొకయించుక లేకపాఱె, నే
ప్రక్కలఁగాంచినన్ నెలవు ♦ వారల పీనుఁగులుకానవచ్చె, నే
చక్కినిజూచినన్ రణము ♦ సల్పిన చిహ్నలు చూడనయ్యె: హా
యెక్కడిమాట: బొబ్బిలికి ♦ యేదొ యరిష్టముగల్గె నెయ్యమా॥ 2

(కొంచెము నడచి దిక్కులుచూచి) మిత్రమా! ఇంక సందేహింప నవసరములేదు.

సీ॥ వితత పరాక్రమా ♦ కృతి ధర్మమూర్తి రం
గారాయ భూపతి ♦ కానరాఁడు
ఆత్మీయ సామ్రాజ్య ♦ హర్మ్య మూలస్తంభ
మైన వేంగళరాయఁ ♦ డగుపడఁడు
రమణీయ బొబ్బిలి ♦ రాజ్యరమా నిరం
తరభోగగరిమ గో ♦ చరముకాదు
అతులిత పద్మనా ♦ యక వీర తేజంబు
బాహ్యదృష్టికిఁ గను ♦ పట్టబోదు

తే॥ గీ॥ చేతనవ్రాత మందలి ♦ జీవకళలు
భౌతిక రహస్యతత్త్వ సం ♦ పదలఁగనవు
కోటలోపలఁ బ్రబలును ♦ గూడ లేదు
కటకటా దీనికేయ్యది ♦ కారణంబు॥ 3

దేవు—(స్వాగతము) ఏమిది! బొబ్బిలికోటను సమీపించినను నేఁడు వినరాదు. పాపారాయఁడు రాజాంకోటలో నున్న సమయమున విరోధు లీకోటను ముట్టడించి యిట్టిదుర్గతిని గూర్చియుందురు. లేకున్న నభాగ్యదేవత యిటులఁదాండవించునా? (ప్రకాశముగ) పాపారాయా! ఇంకఁ జెప్పవలసినదేమున్నది?

ఉ॥ ప్రోవులుఁగాఁగ బీనుగులు ♦ పొంతలఁ గన్పడసాగె నెందునే
త్రోవలఁగాంచినన్ రిపువ ♦ రూధిరములున్న గుడారముల్ కనం
గావడె; భూమి సైన్యపద ♦ ఘట్టనమందుటఁ జేసి క్రుంగె ఓ
దేవర! ఇవ్వి బొబ్బిలి క♦ దృష్టముదప్పెనఁటంచు దెల్పెడిన్.

పాపా—మిత్రమా! నీవు వాకొనినటుల విరోధు లేవియో మాయో పాయములఁబన్ని బొబ్బిలికోటను పాడుచేసియుందురు. హా! పద్మనాయక సంస్థానరాజమా! హా!రంగారాయ భూపాల భాగధేయమా! హా! చతుస్సహస్ర దేశీయశూర సైన్య జీవిత సర్వస్వమా! హా! బొబ్బిలిరాజ్యమా! నీదుస్థితి కెంతని పరితపింతును.

సీ॥ మ్లేచ్ఛరాజులకు న ♦ మ్మికఁగూర్చి నిర్వాణ
రాయండు పాలనఁ ♦ జేయునాడు
రాజ్యంబు సంపద్ధు ♦ రంధరంబొనరించి
లింగప్పరాజు పా ♦ లించునాఁడు
రిపులదేశముల నా ♦ క్రించి జనార్దన
రావు జయాంకముల్ ♦ వ్రాయునాఁడు
శత్రునాశనముగా ♦ సంగరంబులొనర్చి
శ్రీరాయఁడప్ప ర ♦ క్షించునాఁడు

తే॥ గీ॥ స్వప్నమునసేమి గనని క ♦ ష్టములు నీకు
రంగరాయని పాపభా ♦ రంబువలనఁ
గలిగె, నేమనవచ్చు నీ ♦ కాలమహిమ?
రమ్యగుణలక్ష్మి! బొబ్బిలి ♦ రాజ్యలక్ష్మి!

దేవు—మిత్రమా! విచారమువలనఁ గాఁదగుకార్యము లేదు. అదియుఁగాక కష్టము సౌఖ్యమను చక్రములు సంసార శకటమునకు విధికృతములు. దైవిక విధు లనుభవింపక తప్పానవి కావు. కొంచెము ముందునకుఁ బోయి రాజ్యవ్యవస్థల సాకల్యముగ నెఱింగి యుచిత విధాయకమున్న నూహించుదము. పోవుదము రండు.

పాపా— నెయ్యమా! విచారాతిశయమున నాహృదయమునకు నిల్కడ తొలంగినది. నేను ముందు చనఁజాలను. నీవుత్రోవఁ దీయుము. నేను వెంట వచ్చెదను

దేవు— పాపారాయా! ఆకరదీపిక నిటుల తెమ్ము. ఇట నొకశవము కానవచ్చుచున్నది. పరిశీలించి మన సంశయమునకు మాన్పు కలిగించుకొందము.

(పెద్దన్న, పాపారాయఁడు పరిశీలింతురు.)

పాపా— హా! పరమేశ్వరా! బొబ్బిలి రాజ్యమున కెట్టి విపత్కాలమును ప్రాప్తింపజేసితివి. రావు వంశమునకెట్టి దురవస్థ ఘటించితివి నేఁటితో నీస్థలభోగము తీఱెగదా!

సీ॥ కడిఁది నెత్తురు పెను ♦ కాలువలోపల
మేను క్రొంజవులీనఁ ♦ దానమాడి
పసపు నిగ్గులుదేఱి ♦ మిసిమి గ్రక్కెడు మేన
మెదడు గందఁపుఁబూఁతఁ ♦ గదియఁబూసి
పుడమి ముద్దియ పైని ♦ పొలయుల్కఁగనుగతి
నవ్వాలి మోముగా ♦ నత్తమిల్లి
పరసౌఖ్యవితతాను ♦ భవముఁ దెల్పెడు భంగి
గన్నుఁ దమ్ములను స ♦ గమ్ముమూసి

తే. గీ॥ వెలమవారల బలములు ♦ వీటిబోవ
వలసె ననుచింతఁబోలె మై ♦ చెలువుఁదొలఁగెన్.

సూర్యమండలమును జీల్చి ♦ సురపురమ్మున
కాయఁబోయితె వెంగళ ♦ రాయభూప॥ 6

హా! మిత్రమా! హా రంగారాయాజ్ఞానిర్వహణ ప్రవీణ! హా విజయస్వయంవర వధూపరిష్వంగాధీన భావా! హా శూరలోక శిరోభూషణ! హా పరాక్రమ నిధాన! "సుకృతీ గతాయుః" అను సూక్తి నీయందె యథార్థవంతము కావలయునా! ఎంతకష్టము. ఎంతవిపరీతము. ఎంతవిచారజనకము. హా దైవమా! ఎంతటి యవస్థఁగూర్చితివి.

దేవు—మిత్రమా! విచారమునొందుటకు జీవితకాలమంతయు వ్యవధి కలదు. రణరంగమున వీరస్వర్గ మలంకరించిన యీశూరవర్యుని మరణమునకై దుఃఖము నొందుదుమేని పరమున నాత్మకు సుఖముండదని యాత్మజ్ఞు లందురు. దుఃఖమెందులకు?

ఉ॥ పౌరుషమెల్ల రూపముగ ♦ భాసిలఁజేసి, నితాంతధైర్యముం
బెరి యనూనజీవమున ♦ బేర్చి, పరాక్రమమన్న రక్తముం
గూరిచి వెల్మవంశమున ♦ కుం విధిగూర్చిన భూషణం బహో
పేరిశిపోయె; నింక విల ♦ పించిన లాభము కల్గనేర్చునే॥ 7

పాపా—మిత్రమా! నాకాయువుపై నిరుత్సాహము కలిగినది. విక్రమధనుండగు నీవెంగళరాయని మరణవార్త విని రంగారాయుఁడు గతించియుండును. ఆయనవెనువెంబట్టి యవరోధసతులు శూరవర్యులు గతించియుందురు. ఈవెంగళరాయని యకాలమరణమునకు విజయరాముని దురుద్యమబద్ధమగు యుద్ధమె హేతువై యుండును. ఇంతటి విలయము జరిగినపిమ్మట నేను జీవించి ఫలమేమి? (కత్తిఁదీసి)

ఉ॥ మనభూమీశ్వర కంఠనిర్గళ దసృ ♦ గ్ధారాళిచేఁ బుణ్యభా
వమై పజ్జనగేయమై యమలమై ♦ సంపత్ప్రదంబై చరి

త్ర విశ్రాంతంబయి సర్వరీతులఁ బ్రశ ♦ స్తంబైన యిచ్చోట నే
నున్ ప్రాణంబుల వీడి పైళమ సుధాం ♦ ధోలోకముం జేరెదన్

వెంగ—(లేవఁబోయి పడి) ఓరీ దురాశయా! అధర్మ యుద్ధమున కుపక్రమించుచున్నాడవా! నాకంఠమునఁ బ్రాణవాయువున్నంతవరకు విరోధినిఁ జేరనీయను.

మ॥ పురుషాకారముఁ దాల్చినట్టి పశువా? ♦ పుంజీకృతాఘవ్రతా
చరణీయా? నిలు మెందుఁబోయెదవు మూ ♦ ర్ఖా బంధువుల్ జంపనీ
కరమెట్లాడెను? రాజధర్మము తొలం ♦ గన్ వచ్చునే? పౌరుషా
కరుఁడీ చేతకు నిచ్చగించునె యహం ♦ కారంబు రక్షించునే॥

(కత్తితోఁ బాపారాయని కొట్టఁజోవును)

పాపా—(కత్తి బట్టుకొని కొంచెమాగి) నాయనా! నేను పాపారాయుఁడను, నీకు విరోధిని గాను. నీవుగతించితివని నేను ప్రాణత్యాగముఁ జేసికొనఁబోయితిని గాని విరోధులెవ్వరును లేరు. ఏల యీదురవస్థకుఁ బాలుపడితివి.

వెంగ—హా! పాపారాయా! నీవేనా! నన్నొకమారు కౌగలించుకొనుము. దాన నాసంతాపము సగముతీఱును. ఇంతటిదురవస్థకులోనైతిని.

సీ॥ శాత్రవదుష్కృత్యో ♦ సమితిచే బొబ్బిలి
కోటసర్వము నేల ♦ గూలిపోయె
అంతఃపురాంగన ♦ లవమానభీతిచేఁ
గరవాలములకు సం ♦ గరములిడిరి
రణమునస్వర్గఁ బోయి ♦ రంగావనీభర్త
సురలోక విభవంబుఁ ♦ జూఱఁగొనియె
పౌరుషార్థము పాటు ♦ వడినతమ్ముంగల 19
వెలమవారల వంశ ♦ ములుగతించె

తే.గీ॥ అతులమైనట్టి మనరాజ్య ♦ మస్తమించె
నవనిఁ బాపీ చిరాయువ ♦ టన్నరీతిఁ
గడకుఁ జాలేక మఱిబ్రతు ♦ కంగలేక
తుదకు మిగిలితి జీవన్మృ ♦ తుండనైతి॥

పాపా—హా! బొబ్బిలిరాజ్యలక్ష్మీ! ఈపాపారాయఁడు జీవించియుండఁగనే నీకు వైధవ్యము తప్పదయ్యె. రంగారాయభూమీశ్వరా! నీకు నాకు ఋణముతీఱినది. వెలమసామ్రాజ్యమా! నీకుఁ బరిచర్యచేయు సౌభాగ్య మంతరించినది. ఓసాధ్వీ, మల్లమాదేవీ! నీకు నాకుఁగల ప్రేమానుబంధమున కంతరాయము కలిగినది. ఓపద్మనాయకవీరులారా! ఓ యవరోధాంగనా మతల్లులారా! దేశమునకై జీవిత మర్పించి కృతార్థులైతిరా!

చ॥ విన్నఁదగనట్టి వార్తవిని ♦ వీఁడిపోవు నశింపవేమి నె
మ్మనమ! రవంత సిగ్గుఁగొను ♦ మా! ఇఁక దేహముతోడ శోకవ
హ్నినిఁబడి క్రాగ్గి బూదియగు ♦ మీ! పనిదీఱెను పాపరాయుతోఁ
జను మిటనుండఁగాఁదగదు ♦ శాశ్వతలోకము వేగఁ జేరుమా॥ 11

దేవు—మిత్రమా! నిరుత్సాహ పడవలదు. జీవముధరించి నిర్వహింపవలసిన ధర్మములేమేని విచారించుట యుక్తము. వెంగళరాయని నేమేని యడుగవలసిన యంశములున్న నడిగి తెలిసికొనుము. ఆచరణీయ కార్యములు పెక్కులు మిగిలియున్నవి.

పాపా—ఓయీ వెంగళరాయా! ఈ బొబ్బిలిరాజ్య వినాశనమునకు విజయరామరాజే కదా కారకుఁడు? అతఁడు రాజాంకోటకు రాకుండ నిట కెటుల రాగల్గెను? ఈవార్త నాకేల తెలుపరైతిరి?

వెంగ—మనరాజ్యమున కాసపడి యింతవిలయము కల్పించినది విజయరామరాజే! మీ వివాహవార్త పలువురివలన నీకుఁ బంపితిమిగాని మనకు విరోధులు వాండ్ర నిర్బంధించి యుందురు. పద్మనాయకవీరులు [illegible]మై [illegible]మాతృదేశాభిమాన పరాయణులై రణరంగమునఁ బ్రాణము

విడచుచుఁ గరవాలముతోఁ జేరువనున్న వైరులనఱకి యాంధ్రదేశమున నేనాఁడు కానరాని పరాక్రమవహ్ని ప్రజ్వలింపఁజేసి స్వర్గరాజ్యము చూఱఁగొనిరి. అపజయము మాత్రము కడకు మనల విడనాడదాయెను. నేనిఁక మాటలాడఁజాలను.

(వెంగళరాయఁడు పడిపోవును.)

దేవు—ఓరీ విజయరామరాజా! బొబ్బిలిరాజ్యనిర్మూలన ప్రతిజ్ఞాధురంధరా! నీకీ పాపారాయనిచేఁ జావుతప్పదు. నీవు చచ్చితివి, చచ్చితివి.

పాపా—మిత్రమా! పెద్దన్నా! నీవీ వెంగళరాయనిఁ గాచియుండుము. నే నీప్రళయకాలకల్పనానల్ప దోశ్శక్తిప్రమత్తమనస్కుఁడగు విజయరాముని పనఁబట్టెద.

సీ॥ బొబ్బిలిరాజ్య మే ♦ పురుషమాత్రుఁడు వినా
శనముఁగావించి దౌ ♦ ష్ట్యంబు నెఱపె
భారతమాత కే ♦ పాపి యవాచ్యమౌ
కష్టంబుఁగూర్చివి ♦ క్రమముఁ జూపె
రావువంశమున కే ♦ రాజన్యమాత్రుండు
కడలేని సంతాప ♦ కారియయ్యె
హిందూమతమున నే ♦ హీనుండు దుర్మార్గ
చక్రవర్తి పదప్ర ♦ శస్తుఁడయ్యె

తే॥ గీ॥ అతని దుర్గర్వ విజయరా ♦ మావనీశుఁ
గదనరంగంబునందు జ ♦ క్కాడి వాని
ప్రేవులను దండరీతి ధ ♦ రించి రంగ
రాయునాత్మకు శాంతినిఁ ♦ జేయువాఁడ॥ 12

(అటునిటుచూచి) ఏమీ! ప్రపంచమంతయు శూన్యమందిర[illegible]మువలెఁ గానవచ్చుచున్నది? రోదోంతరదీపకంబగు సూర్యుం[illegible] యంతఱిపోయినదికాఁబోలు. పద్మనాయకవీరులతోఁబాటు పద్మ[illegible]

వుఁడను నస్తమింపఁజేయఁగాఁబోలు. హృదయదృష్టియు బాహ్యదృష్టియు శూన్యప్రపంచమును జూడఁజాలకున్నవి. నాకీ ప్రపంచమంతయు దిర్దిరఁ దిరుగుచుఁ బ్రళయకాలమహానటుని వదనగహ్వరమునఁ బడుచున్నటు లున్నది. అదిగో! బొబ్బిలిరాజ్యముపై నొకమహాజ్వాలవ్యాపించి విజృంభించుచున్నది. శూన్యప్రపంచమా జ్యోతివలననేని ప్రకాశించుటలేదు. ఏమిది! దిక్కులుకానరావే! ఇది విచారాతిశయమువలన జనించిన చిత్తవిభ్రమమా? నే నున్మత్తుఁడనైతినా? (పడిపోయి నెమ్మదిగ లేచి) ఓ జ్యోతిస్స్వరూపమా! నీయాజ్ఞఁ బాలించుటకై దీక్షాకంకణము ధరించుచున్నాను. ఫలము విజయరామరాజె యనుభవించుఁగాక. (అటునిటు నడచి) పెద్దన్నా! విజయరాముని వధింప నేను భరతమాతచే నాజ్ఞాపింపఁబడితిని. నేనిందు దురదృష్టవశమునఁ గృతార్థుఁడనుగాక, విరోధులకుఁ జిట్టువడితినేని నీజీవితము పయిత మిందులకు వెచ్చించి తీరవలయును.

దేవు—నీయాజ్ఞ పరిపాలింప నేను సర్వసిద్ధముగ నున్నాఁడను.

పాపా—(నడచుచు) హృదయ పేటికా నిండి నయనద్వారములనుండి విస్ఫులింగముల వెలిఁగ్రక్కు నీకోపవహ్నిని భరింపఁజాలకున్నాడ. విజయరాముని వక్షస్థానముఁ జీల్చి వేడినెత్తురుచే స్నానమాడినఁ గాని నాతాపము చల్లారదు. ఆత్మీయసామ్రాజ్యమునకై కింతటివిపత్తును గూర్చిన యీతనిం గరవాలముతో నఱికి రక్తధారల రాజ్యమధ్యంబునఁ బాఱించుటకు మున్న ప్రతిజ్ఞ యొనరించితిని. దానిని పుడ నిర్వహించి సర్వవిధములఁ గృతార్థుఁడ నయ్యెద. ఈ శోచ్యావస్థలోని జీవితమున కింతకంటెఁ గావలసిన ఫలమేమున్నది? (నడచి) ఏదీ విజయరాముని పటకుటీరము? నారాక విని యాతఁడు కాలికి బుద్ధి చెప్పలేదుకదా! ఇఁక నాతఁడెక్కడకుఁ బోవఁగలఁడు? క్షాత్రధర్మములగు చతురోపాయములతో నాతనివధించి ప్రతిజ్ఞ నిర్వహింపనేని రంగారాయనిఋణమునఁ బోదును. విజయరామరాజు తప్పించుకొని పోఁగలఁడు. యమలోకమున కతిథి కావలసియున్నాఁడు.

మ॥ ప్రళయస్థాణు జటాతటీ నివసన ♦ ప్రాగల్భ్యయుక్తైనఁ గా రసాతలముఁ జొచ్చిన మానివృత్తిని గుహాం ♦ తర్వాసియైనన్ సముజ్జ్వల శేషాహి ఫణాసహస్రతట వి ♦ శ్రాంతాత్ముఁడైనన్ రణస్థలిఁ జెండాడెద రామభూవిభుని దో ♦ ర్దర్పంబు వారించెదన్. 13

ఈ పాపవృత్తికి సమభాగులగు బుస్సియు హైదరును దండ్యులే కాని ముందు విజయరామరాజును జెండాడినగాని నాతాపమాఱదు. ఇఁక ప్రొద్దెంతయో లేనటులున్నది.

ఉ॥ కాంతినశించు దీపకళి ♦ కల్ కొకొకోయను కుక్కుటంబు లుద్ధ్వాంత విదారణంబు నలు ♦ పన్ బ్రకటించెడి దిక్కుచాలు, ఆశాంతమునుండి వచ్చు మరు ♦ దంకురముల్ వచియింపసాగె రాత్ర్యంతము వచ్చెనంచు నిపు ♦ డాన్నృపజాల్మువధించితీరెదన్॥

విజయరామరాజున్ను వధించుట యుక్తమా? అయుక్తమా? యను చర్చ కిది యదనుకాదు. విచారాతిశయమున నున్మత్తావస్థలోనున్న నాకీ విచారణచేయు శక్తియు లేదు. (కొంచెము నడచి) ఇఁక విజయరామరాజున్న పటకుటీరమేదియో వెదకవలయును. అదిగో ముందు మూఁడు గుడారములు కానవచ్చుచున్నవి. అందొకటి విజయరామరాజుది కావచ్చును. సందేహింపనేల? గుడారము ముందు కానవచ్చు ధ్వజమే యాపటకుటీరము విజయరామరాజుదని చాటుచున్నది. (సమీపమునకుఁబోయి గుడారముంజూచి) ఇదియె విజయరామరాజు పటకుటీరము. అదిగో విజయరామరాజు జోడలుమఱచి నిదురఁ బోవుచున్నాఁడు. ద్వారపాలకులు నిదురకు మొగమువాచి సొమ్మసిల్లి పడియున్నారు. విజయరామ వధా విధానమున కిదియ యదను. (ఆలోచించి) నిదురించినవానిఁ జంపుట రాజధర్మవిరుద్ధమే! ఎటులీ యకార్య మొనరింతును? (కొంచమాగి) వంచకస్వభావునిఁ జంపుటకుఁగూడ న్యాయబద్ధుఁడను గావ

యునా? (కరవాలముఁదీసి) నేను కావింపఁబోవు పని వీరోచిత మైనదె! ఎటులన.

శా॥ శశ్వ ద్బాహుబలాభిరాముఁడగు న ♦ శ్వత్థామ యుద్ధక్రియా
విశ్వవ్యాపకమూర్తి, భండనకళా ♦ భీభత్సుఁ డుత్సాహియై
నిశ్వాసంబులఁబుచ్చు చిన్నిశిశులన్ ♦ జెండాడఁడే; దాన గీ
ర్త్యాశ్వాసావృత జీవితప్రథిత కా ♦ వ్యప్రౌఢిమల్ తగ్గనే? 15

భారతవీరులలోఁ బెక్కండ్రు నిద్రాణులగు విరోధులఁ జెండాడి యున్నారు. ఇదియొక దోషముకాదు. ఒకవేళ దోషమైన యెడల నీదుష్టవధంబునఁ జనించిన సుకృతముకంటె నాదోష మతిశయముకాదు. నిద్రితు నేలవధింపవలయును? లేపియే వధించెదను. (చూచి) ఇతఁడు విజయరామరాజేనా? (సందేహించి) అగు నాతఁడె. అతఁడె. ఇతనిముఖముఁ గాంచినకొలఁది నాహృదయముల నుద్రేక మతిశయించుచున్నది. చిత్రవధఁ గావించినఁగాని నాక్రోధాగ్ని చల్లారదు. కరవాలముతో నీదుష్టాత్ముని ఖండఖండములు గ నఱకి బొబ్బిలిరాజ్యమున వెదఁజల్లి భూతబలిఁ గావించెద.

(గుడారమును జీల్చి విజయరామరాజుపైఁబడి)

క॥ పులి పులి; పైనింబడె బొ
బ్బిలిబెబ్బులి నిదురలేర! ♦ భీషణదంష్ట్రా
స్థలమునఁబడితివి ప్రాణం
బులు శౌర్యంబుడిగి ధార ♦ పోయర! క్రూరా॥ 16

విజ—(అదరిపడిలేవఁబోయి) ఏది పులి? ఏది పులి? ఓహో పాపారాయఁడా! నన్ను ఖడ్గముఁ దీసికొననిమ్ము. నీ శీర్ష ముత్తరించెదను.

పా—(నెట్టివడవేసి) ఏమిరా! ఇంకను విక్రమింపనున్నాఁడవా? (కత్తితో వక్షమునఁబొడచి) నేఁడు నాపాలఁబడితివి. నీమాంస

ఖండములు రాజ్యమధ్యమున వెదజల్లుటయే నావ్రతము (కత్తితో మఱల పొడిచి.)

మ॥ పరమాహంకరణాతిరేకులగు నీ ♦ పాశ్చాత్యులన్ గూడి రా
జ్యరమాద్రోహమునల్పినందులకు న ♦ త్స్థానమున్ జీల్చి, ని
ర్ఝర పూరమ్ములరీతి నీ రుధిర ధా ♦ రా ధోరణీ సారణీ
పరిణామమ్ముల రాజ్యమందు ప్రవహిం ♦ పన్ జేసి శాంతించెదన్॥

(కత్తితోఁ బొడుచును.)

విజ—ఓరీ! పాపారాయా! ఇప్పటికైన నన్నుఁ గత్తిఁదీసికొననిమ్ము నీ...............

పా—ఛీ! దురాత్మా! ప్రేలకుము. ఇంకఁ బ్రతుకవలయునని యాసపడుచున్నాఁడవా? (కంఠమును గట్టిగా నొక్కిపట్టును)

విజ—(వికారముగా నఱచును).

పా—ఏమిరా! వికృతస్వరము చేయుచున్నాఁడవు!

మ॥ పరరాజ్యంబున కాసనొంది, కుల వి ♦ ధ్వంసంబుఁ గావించి, దు
స్తర దుష్కీర్తి భరించి మించి, యువరో ♦ ధస్త్రీ వధా ఘోర బం
ధురపాపంబు గడించినాఁడ వికనీ ♦ న్నొక్కసైపఁగావచ్చునే?
మరణావస్థ సహింపుమా! విజయరా ♦ మా! దోషమయాలద్రుమా॥

(కత్తితోమరలఁబొడిచి) నాఁడు దామెరదమ్మన్నగారి ముందొనర్చిన ప్రతిజ్ఞ నెఱవేరినది. (తేరిచూచి) ఇంకను బ్రాణముతోడనే యున్నాఁడే! విజయరాముడు.

ఉ॥ ఛావవిదేమిరా? విశిఖ ♦ జాతహతిన్ హృదయంబు భిన్నమై
ప్రేవులు పైకివచ్చినను, ♦ బ్రతివ్వపయిన్ దమియింకఁ దీఱలే
దా! వెదఁగాఁ! యువస్థలకుఁ ♦ దాళి శరీరమువీడ వేల? మూ
ర్ఖా! విడిపించువారెవరు ♦ రా నిను! చేరర పాపలోకమున్॥ 19

(చేతిగోలంది రొమ్ముపైగ్రుద్ది)

తే॥ గీ॥ పగులదేమి నీదు ♦ వక్షఃకవాటంబు
కఠిన దారుమయమొ ♦ కాంస్యమయమొ
కరుగ బెట్టజాలి ♦ కల్లుమాటలకును
భంగురోక్తి విస్ఫు ♦ లింగములకు॥ 26

విజ—అబ్బా! యీబాధ నెటుల సహింతును.

కం॥ చంపెడివాఁడవు చంపక
జంపొనరింపంగ నీకుఁ ♦ జనునే తల ఖం
డింపుము పరలోకమునకుఁ
బంపుము యాతనల కోరు ♦ వఁగనేర సుమా! 20

పాపా—ఓరీ తొందరపడకుము. పరలోకమునఁ బడరాని పాట్లు శ్రీరంగరాయని సమక్షమునం బొందుటకంటెఁ బరోక్షమున నాచేత శిక్షితుఁడవగుటయే యుక్తము. కృతార్థుఁడ వయ్యెదవు. తొందరపడకుము.

శా॥ వక్షస్థాన విపాటనంబిదె యు ♦ నల్ప్రౌఢిఁ గావించి నీ
కుక్షిస్థంబగు దీర్ఘశల్యముల పం ♦ క్తుల్ దండఁగాఁ దాల్చి నా
దక్షత్వంబును సాటనుంటి దురితా ♦ త్మా! యింకనైనన్ బరా
పేక్షన్ దాల్పుమి నారకంబునకుఁ బో ♦ మ్మీ రామభూపాలకా॥

(ప్రేవులుదీసి దండలుగధరించి) ఇప్పటికి రంగారాయని ఋణముఁ దీర్చికొంటిని. పద్మనాయక సంస్థానము రూపుమాపినందులకు విజయరామునకుఁ దగిన ప్రాయశ్చిత్తముగావించితిని. నేనిక సర్వవిధముల ధన్యుఁడను. సిద్ధసంకల్పుఁడను (వెనుకకు మఱలి) అదిగో విజయరామరాజింకను బ్రతికి యున్నటు లున్నది.

శా॥ మేనన్ ముప్పదియాఱు గాయములఁ జే ♦ ర్మిన్ జేసితిన్ జీన వ
క్షోనిక్షేపములైన శల్యముల పం ♦ క్తుల్ దాల్చితిన్ దావక
ప్రాణాస్పర్శన జాలవృంతభవ సౌ ♦ భాగ్యంబుఁ గాంక్షించితిన్
గాసీ! చావవికేమిరా! కులకళం ♦ కా! రామభూపాలకా॥ 22

(కత్తితో మరల మఱల పొడుచుచుఁ దిరిగిచూచి)

ఇప్పటికి విజయరామరాజు కడతేఱినట్లే. వెంగళరాయా! నాఁడు జయలక్ష్మినిగాని వరింపనంటివి. ఇదిగో విజయరామునిచే బంధీకృతురాలైన యీసచ్చరిత్రను విడచిపెట్టితిని. నీజీవితమే నిశ్చయమైన నిన్నే వరించి తీఱును. ఓపద్మనాయక సంస్థానరాజమా! నీఋణము తీర్చికొంటిని. ఓరంగారాయ భూపాలకా! ఇహలోకమున నీకు సంతోషము గల్పింప లేకపోయినను బరలోకమందైనను నీయాత్మకు శాంతిఁ జేకూర్పఁజాలితిని. (నలువైపులరసి) ఇంతకోలాహలము జరిగినను విజయరామరాజు సైనికు లింక మేల్కొనియుండరు. పనిలోఁబనిగ హైదరుజంగును గూడ నిపుడె వధించిన బాగుండునుగాని (అదిగోఁ దెల్లవాఱుచున్నది). ఓవిజయరామరాజ సైనికులారా! ఓ పరాసు సైనికులారా! ఓ మహమ్మదీయ సైనికులారా! లెండు, లెండు,

సీ॥ మన్నెతేఁడులగెల్చి ♦ మానవాతీతమౌ
పటిమఁ జూపిన బల ♦ ప్రాభవుండు
చీకటిరాజ్యంబు ♦ సింహాచలేంద్రంబు
కడదాఁక నేలిన ♦ కజతలాని
భోగభాగ్యంబులఁ ♦ బురుహూతునకుసాటి
నలుపఁగాఁదగిన రా ♦ జన్యమౌళి
తురకరేఁడుల నాంధ్ర ♦ ధరణికి బలిజేసి
సత్కీర్తిఁ గాంచిన ♦ చక్రవర్తి

తే॥ గీ॥ విజయరామాహ్వయ క్షమా ♦ విభుఁడు తాండ్ర
పాపరా డ్విక్రమాగ్నిచే ♦ భస్మమయ్యె
ద్వారపాలకులార! హై ♦ దరువజీర!
బుస్సినరపాల! సంగరం ♦ బునకు లెండు॥ 23

భటులు—(ప్రవేశించి) అక్కటా! మనము నిద్రించుతఱిఁ బాపారాయఁడు విజయరామరాజును గడతేర్చెనే గడతేర్చెను. హా!

యెంతవిలయము జరిగినది. భటులారా! రండు. రండు. రక్తసిక్తాంగుఁడై శల్యముల దండలుగఁదాల్చి ప్రళయకాలభైరవుని దలపించుచు విజయరామ గంధసింధురమును దునిమిన పాపారాయసింహమిటులె వచ్చుచున్నది. ఎదిరింతము రండు. రండు.

పాపా—రండురండు. భటులారా! రండు రండు. రాచపీనుఁగు తోడు లేనిది పోదఁట మిమ్ముందఱను మీప్రభువునకుఁ దోడుగాఁ బంపెద.

భటు—ఇదిగో వచ్చితిమి కాచికొండు, కాచికొండు.

(పాపారాయఁడు భటులనందఱ నురుమాడును. వెనుకనుండి యొకభటుడు తుపాకిఁబ్రేల్పఁ బాపారాయఁడు పడి కత్తివిసరివేయును. తుపాకిఁబ్రేల్చినవాఁడు గతించును.)

పాప—ప్రాణములారా! మీరు స్వేచ్ఛగఁబొండు. మీవలనఁ గాదగిన పని యంతయు నిదివఱకె నిర్వర్తించితిని.

తే॥ గీ॥ ఆత్మసంస్థాన విద్రోహి ♦ యైన విజయ
రాము ఖండించినాఁడను, ♦ రంగరాయ
విభుని యాత్మకు శాంతిఁ గ ♦ ల్పించినాఁడఁ
జనుచున్నాఁడ స్వేచ్ఛగా ♦ స్వర్గమునకు॥ 24

(పడిపోవును)

పాపారాయనిర్యాణము.

సప్తమాంకము.

సర్వము.

సమాప్తి.

శుద్ధపత్రిక.

పేజి	పంక్తి.	తప్పు.	ఒప్పు.
౯	౧౪	తాంవ్రి	తాండ్రి
౧౩	౨౭	వింపుము	ఏంపుఁడు
౨౨	౧౭	స్వతంత్ర	స్వతంత్రం
౨౪	౧౫	బాసిలు	భాసిలు
౩౫	౨౩	అడిగేటేది	అడిగేది
౩౬	౨౫	కట్టుము	కటకము
౪౧	౧౨	పత్తుకుంటి	పత్తులై యుంటిరి
౪౭	౧౩	తీరలా	తీరాలం
౫౪	౮	యొని	యోని
,,	౧౩	యార్ఠమై	యార్థమై
౫౫	౯	లక్షి	లక్ష్మై
,,	౧౮	నిలువ	నిలుప
౫౬	౨	మాసరు	మానగు
,,	౩	బాలుపడ	బాటువడ
,,	౫	సేనాముద్రము	సేనాసముద్రము
,,	౧౫	ప్రధానా	ప్రధాన
౫౭	౨	దుఃరుద్యమ	దురుద్యమ
,,	౭	సాధింతుము	సాధింతము
,,	౮	సవ్యాహిత	సవ్యాహత
,,	౯	రచనా	రసనా
౫౮	౧౩	మాతృ	మాతృదేశ

౫౯	౧౭	అకరింప	లంకరింప
౬౧	౫	స్తవపీయ	స్తవనీయ
,,	౯	చ్ఛకీర్తిచ్ఛటా	చ్ఛకీర్తిచ్ఛటా
౬౨	౨౦	నట	ననన్నట
౬౪	౩	సంగ్రామిక	సాంగ్రామిక
౬౮	౨౩	లచం	లంచం
౭౨	౧౫	మూర్తార	మూర్తుర
,,	౧౮	ధరకు	ధరక
౭౯	౮	వరించి	వధించి
,,	౧౯	ప్రిళయ	ప్రళయకాల
,,	౨౬	వాలమునవిసరి	వాలమునువిసరి
౮౧	౧౮	గతక	గర్త
౮౧	౧౨	తీక్ష్ణాసికా	తీక్ష్ణాసికా?
,,	౧౩	నికురంబ	నికురుంబ
౮౨	౮	గర్షాంజలుల్	గర్భాంజలుల్
౮౬	౪	మెంత	మింత
,,	౧౩	కప్పంనత	కప్పనంత
౮౭	౯	ల్లె	లెల్ల
౮౮	౧౭	బట్టె	బట్టి
,,	౨౦	శ్వాశతము	శాశ్వతము
౮౯	౫	జన్మమును	జన్మమున
,,	౭	అది	అరి
,,	౧౦	లీతిహేత్ర	వీతిహోత్రి
,,	౧౧	విజాయాంతము	విజయాంతము
,,	౧౭	నాయునకు	నాయకునకు

౯౦	౬	మూాంకదలకు	మాకందలకు
౯౧	౨	కేయు	జేయు
,,	౨౦	జీవితమె	జీవితము
౯౪	౧	చివురిచి	చివుర్చి
,,	౪	సీవే	సీవె
౯౬	౧౬	యద్ధ	యుద్ధ
౧౦౨	౧౦	స్థానంబదుక	స్థానంబందొక
౧౦౪	౧౪	సీపశ్చిమ	సీవాపశ్చిమ
౧౦౫	౩	తరింపుము	చరింపుము
౧౦౭	౧౨	చింతించ	చింతించి
,,	౧౮	లారా	లార
౧౦౯	౧౪	నున్నట్లు	సనునట్లు
౧౧౦	౨	విరోధుల	శిరోధుల
౧౧౧	౧౨	పోవులు	పోవుచీలు
౧౧౪	౨	హేతువుం	హేతు

విస్తరభీతిచే సగా...

స్థలవ

లోనగి

చోసకా

మథ్య; ౪

బాలకులు

అర్జునపరాభవము.

ఆఱంకముల నాటకము.

ఇది శ్రీ శేషాద్రి రమణ కవులచే రచియింపబడిన క్రొత్తనాటకము. అపూర్వమగు కథ. పద్యములు రత్నముల వంటివి. కురుసంగ్రామానంతర భారతకథ యిందుగలదు. ఇట్టి సర్వాంగసుందర నాటకము వేఱులేదు. శ్రీకృష్ణుని శాంతము, అర్జునుని పరాక్రమము, సుభద్ర విషాదము, ఆసుర అర్జునుల శృంగారము [illegible] ప్రతి పద్య రసాస్పదమగు నీ నాటకము భాషాభిమానులందఱు పఠింపదగినది. వెల రు 0-10-0

శైలి చూడుడు.

చం॥ పలుచని [illegible] సన్నమగు పట్టెపు నెన్నడుము వెడందవే
రలకును మిన్నతా కనులు రాగము నీనును కేలుదోయి జా
బిలికి సమానమా ముఖము సన్నని నవ్వున గానవచ్చు మొ
గ్గల నిరసించు దంతములు కామిని యందము వృద్ధిజేసెడిన్

వలయువారు——

ఆంధ్రపరిషత్తు,
బెజవ

END OF
TITLE